www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 238 | శనివారం | 17 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00


జై తెలంగాణ
జై కేసీఆర్
మన స్వప్నం - మన లక్ష్యం - బంగారు తెలంగాణ
తెలంగాణ రాష్ట్ర ప్రదాత
బంగారు తెలంగాణ నిర్మాత
జన హృదయ నేత
తెలంగాణ జాతి పిత
జాతిని మేల్కొలిపిన జననేత
మన ప్రియతమ ముఖ్యమంత్రి
నాకు దైవసమానులైన
శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సార్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
శంభీపూర్ రాజు
ఎమ్మెల్సీ రంగారెడ్డి జిల్లా
రాష్ట్ర అధ్యక్షుడు టీఆర్ఎస్ యువజన విభాగం

www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 238 | శనివారం | 17 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



గవర్నర్‌తో సిఎం
ఢిల్లీ ముచ్చట్లు

వారం రోజుల పర్యటన తరువాత తిరిగి వచ్చిన కెసిఆర్

మన తెలంగాణ / హైదరాబాద్ : వారం రోజుల ఢిల్లీ పర్యటన ముగించుకుని శుక్రవారం రాత్రి నగరానికి చేరుకున్న సిఎం కెసిఆర్ విమానాశ్రయం నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్ళి గవర్నర్‌తో సమావేశమయ్యారు. ఢిల్లీ పర్యటన విశేషాలను గవర్నర్‌కు వివరించినట్లు తెలిసింది. ప్రధానితో, కేంద్ర హోం మంత్రితో సమావేశం అవుతారని వార్తలు వచ్చినప్పటికీ వారిని కలవకుండానే హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. రాష్ట్రానికి తరువాయి 6లో

షెడ్యూల్ ప్రకారమే
టిఆర్‌టి పరీక్ష

టిఎస్‌పిఎస్‌సి ప్రకటన

మనతెలంగాణ/హైదరాబాద్ : ఉపాధ్యాయ నియామక పరీక్ష(టిఆర్‌టి)ను షెడ్యూల్ ప్రకారమే నిర్వహిస్తామని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ స్పష్టం చేసింది.అభ్యర్థులుఎప్పటికప్పుడు తాము జారీ చేసే మార్గదర్శకాలను అనుసరించాలని పేర్కొంది. టిఆర్‌టి డాటా అప్‌డేషన్‌పై అభ్యర్థుల నుంచి వస్తు న్న ఫిర్యాదులు, ఇతర సమస్యలపై చర్చించేందుకు శుక్రవారం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నిమ్జేతో కమిషనర్ చైర్మన్ ఘంటా చక్రపాణితో పాటు ఇతర సభ్యులు, కార్యదర్శి సమావేశమయ్యారు. టిఆర్‌టి డాటా అప్‌డేషన్‌తో పాటు ఇతర సమస్యలు తరువాయి 6లో



ఎగ్జామ్‌పై స్టేకి హైకోర్టు నిరాకరణ 5

కావేరిపై సుప్రీం తీర్పు

తమిళనాడుకు తగ్గింపు, కర్ణాటకకు పెంపు 10

డబుల్ ఇళ్లకు ఉక్కు ఊరట

టన్ను రూ.43,660కి ఇవ్వడానికి అంగీకరించిన కంపెనీల యాజమానులు 6

కోర్టులో లొంగిపోయిన హెచ్‌ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తమరెడ్డి 8

డ్రైనేజీలో ఏడుగురు కార్మికుల దుర్మరణం

ఎపి, చిత్తూరు జిల్లాలో దుర్ఘటన 8

"ఎక్కువ తక్కువలు, కులమత భేదాలు ఉండటం మానవ జాతికి అవమానకరం.
– మహాత్మాగాంధీ"



సంపాదకీయం

దక్షిణాఫ్రికాలో అధికార మార్పిడి

అవినీతి ఆరోపణలకు గురై ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్(ఎఎన్‌సి)ను ఇబ్బందిపెట్టిన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా పార్టీ నిర్ణయాన్ని శిరసావహించి ఎట్టకేలకు గురువారం రాజీనామా చేశారు. కొత్త అధ్యక్షునిగా పార్టీ అధ్యక్షుడు సిరిల్ రాంఫోసా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అయితే 9 ఏళ్ల క్రితం అధ్యక్ష పదవిలోకి వచ్చిన జుమా తన రెండవ పదవీకాలం పూర్తి అయ్యేంతవరకు అధికారంలో కొనసాగటానికి తీవ్ర ప్రయత్నం చేశారు. 2017 డిసెంబర్ 18న జరిగిన ఎఎన్‌సి అధ్యక్ష ఎన్నికల్లో తన పూర్వపు భార్యను గెలిపించుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. ఉపాధ్యక్షుడు రాంఫోసా కొద్ది తేడాతో పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైనారు. పార్టీ అధ్యక్షునిగా ఎన్నికైన వ్యక్తే దేశాధ్యక్షుడవుతాడు. అయితే జుమా రాజీనామా చేయకుండా జాగుచేస్తుండటంతో పార్టీ కార్యవర్గం సమావేశమై రాజీనామా చేస్తారా లేక పార్లమెంటులో ప్రతిపక్ష అవిశ్వాస తీర్మానాన్ని బలపరిచి దించమంటారా అని తీవ్రమైన హెచ్చరిక చేసిన తదుపరి జుమా గురువారం రాజీనామా ప్రకటించారు. అధ్యక్షుణ్ణి రీకాల్ చేసే అవకాశం రాజ్యాంగంలో లేకపోయినా ఎఎన్‌సి పార్టీకి ఆ హక్కు ఉంది.

106 సంవత్సరాల ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ శ్వేతజాత్యహంకార, వర్ణవివక్ష పాలనకు వ్యతిరేకంగా మహాత్మాగాంధీ స్ఫూర్తితో, నెల్సన్ మండేలా మార్గదర్శకత్వంలో దీర్ఘ కాలం అహింసాయుత పోరాటం సాగించి, ప్రపంచాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని వర్ణవివక్ష అంతాన్ని సాధించింది. 1994 లో అన్ని జాతులు పాల్గొన్న తొలి సార్వత్రిక ఎన్నికల్లో ఎఎన్‌సి 'నల్లసూరీడు' నెల్సన్ మండేలా అధ్యక్షునిగా ఎన్నికైనారు. ఎఎన్‌సి కేవలం ఒక పక్షానికి చెందిన రాజకీయపార్టీ కాదు. వర్ణవివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసిన దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ సహా వివిధ స్రవంతుల వేదిక. ప్రభుత్వంలో కమ్యూనిస్టుపార్టీ పాల్గొంటున్నది. ఎఎన్‌సి ఫ్రీడం ఛార్టర్ ప్రాతిపదికగా ప్రభుత్వం పనిచేస్తుంటుంది. నెల్సన్ మండేలా 1999లో తన వారసునిగా గని కార్మికుల జాతీయ యూనియన్ అధ్యక్షుడైన సిరిల్ రాంఫోసాను కోరుకున్నప్పటికీ, ఎంబెకీని అంగీకరించేటట్లు ఆలివర్ టాంబో తదితరులు మండేలాకు నచ్చచెప్పారు. 1990లో జైలునుంచి మండేలా విడుదల అనంతరం ప్రజాస్వామ్యంలోకి పరివర్తనకు నాయకత్వం వహించిన టాస్క్‌ఫోర్స్‌లో రాంఫోసా కీలకమైనవ్యక్తి. మండేలా అనంతరం అధ్యక్ష పదవి లభించక పోవటంతో అసంతృప్తి చెందిన రాంఫోసా రాజకీయాలు విడిచిపెట్టి వ్యాపారంలోకి వెళ్లారు. 45 కోట్ల డాలర్ల ఆస్తివిలువతో రాంఫోసా ఆఫ్రికాలో సంపన్నుల జాబితాలో 42వ స్థానంలో ఉన్నట్లు 2015 లో ఫోర్బ్స్ ప్రకటించింది. 2012లో ఆయన రాజకీయాల్లోకి తిరిగి వచ్చి పార్టీ నాయకత్వంలో రెండవస్థానం పొందారు, 2014లో దేశ ఉపాధ్యక్షుడైనారు. జాకబ్ జుమా అవినీతిని అడ్డుకోలేక పోయారన్న అపవాదు ఆయనపై ఉంది. మరో సంవత్సరకాలంలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ఎఎన్‌సి ఫలితాలు ఆయన పనికి గీటురాయి కానున్నాయి.

జుమా తొమ్మిదేళ్ల పాలన అవినీతికి ఆలవాలం కావటమేగాక ఆర్థికాభివృద్ధి స్తంభించింది. విధానాల్లో అస్థిరత కారణంగా పెట్టుబడులు పెట్టేందుకు బ్యాంకులు, మైనింగ్ కంపెనీలు నిరాకరించాయి. కరెన్సీ ర్యాండ్ మారకవిలువ పడిపోయింది. మెజారిటీ నల్ల జాతి పాలన ఏర్పడి దాదాపు రెండున్నర దశాబ్దాలు కావస్తున్నప్పటికీ ఆర్థిక వ్యవస్థపై పట్టు బహుళజాతి కంపెనీలు, శ్వేత జాతీయుల చేతిలోనే ఉంది. జుమా కాలం లో ప్రభుత్వ నియామకాల్లోకి కూడా వారి ప్రభావం విస్తరించింది. కాగా భూసంస్కరణలు అమలు జరిపే క్రమం అసంపూర్ణంగానే ఉంది. ఫ్రీడం చార్టర్ అమలును వేగవంతం చేయటంలో వైఫల్యం, అవినీతి పెరుగుదల ఎఎన్‌సి ప్రతిష్టను దెబ్బతీసింది. అది నిరుడు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రతిపక్షానికి వరమైంది. మైనింగ్, మీడియా, టెక్నాలజీ, ఇంజినీరింగ్ రంగాల్లో వ్యాపారంలో స్థిరపడ్డ భారత సంతతికి చెందిన గుప్తా కుటుంబం జుమా అవినీతికి ఆసరాగా ఉండటం కొసమెరుపు.

దళిత స్త్రీల ఆయుష్షు తక్కువే!

చూపు

దేశంలో దళిత, పేద మహిళల ఆయుర్దాయం అగ్రవర్ణాల స్త్రీల కంటే తక్కువగా ఉంటోంది. ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన తాజా నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. 2030 నాటికి స్త్రీ,పురుష సమానత్వ ఎజండా అనే శీర్షికతో విడుదలైన ఈ నివేదికలో నిమ్న జాతుల స్త్రీలు ఇతర వర్గాలవారి కంటె త్వరగా మరణించడానికి పారిశుద్ధ్యలోపం, తగినంతగా నీరు–ఆహారం సరఫరాలు లేకపోవడం కారణమని పేర్కొంది. 'యుఎన్ ఉమెన్' పేరిట గల సంస్థ ఈ నివేదిక రూపొందించింది. ఆరోగ్య సంరక్షణ సేవలు కూడా దళిత మహిళలకు తగినంతగా అందుబాటులో లేవని సంస్థ తెలిపింది. సమాజంలో తీవ్రంగా అణచివేతకు స్త్రీలు, బాలికలు గురౌతున్నారు.



భారతీయ సమాజంలో పురుషులకంటే స్త్రీలపట్ల లింగభేదాలు పాటించడం ఎక్కువ. ఈ రకమైన దిగలాగుడు అనేక రూపాలలో కూడా ఉంటుంది. ఫలితంగా స్త్రీలకు, బాలలకు నాణ్యమైన విద్య, గౌరవంతో కూడిన పని–ఆరోగ్యం–సంక్షేమం లోపిస్తోంది. సుస్థిరమైన అభివృద్ధిని 2030 నాటికి సాధించే ఎజండాను రెండేళ్లక్రితం ఆమోదించారు. 'సమాజంలో ఏ ఒక్కరినీ వెనుకబడనీయకుండా ముందుకు తీసుకుపోవడమే' ఎజండాలోని ముఖ్యాంశం. సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాల అవసరాలకు ప్రాధాన్యతను ఇవ్వడానికి ఈ ఎజండా పెద్దపీట వేసింది. భారతీయ సమాజంలో అంతర్గతంగా ఎన్నో వైరుధ్యాలు ఉన్నప్పటికీ అన్ని తరగతుల మహిళలు, బాలికల పట్ల వివక్షలు పాటించడం సర్వసాధారణం.

ఈ పరిస్థితిలో దళిత మహిళలు, బాలికల అవసరాలపట్ల సమాజానికి ఎటువంటి శ్రద్ధ ఉండదని వేరే చెప్పనక్కరలేదు. సాంప్రదాయ కట్టుబాట్లు, ఆంక్షలు స్త్రీలపై రుద్దడం చరిత్రకాలంనుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈ పరిస్థితిలో మహిళలు తమను తాము సంరక్షించుకునే వెసులుబాటుకూడా మృగ్యం. అటువంటిది కాయకష్టం చేసుకునే దళిత వర్గాలలో ఈ అసమానత తారస్థాయిలో ఉంటోంది. దానికి ఎటువంటి వార్తావిశేషం లేకపోవడం సమస్య తీవ్రతను ప్రతిబింబిస్తోంది. ఐక్యరాజ్యసమితి నివేదిక ఈ పరిస్థితులను ప్రస్తావించింది. ఈ నివేదిక స్త్రీల అంశాల విషయంలో అనేక దేశాల వాస్తవ పరిస్థితులను ఉటంకించింది.

స్త్రీల సాధారణ సమస్యలపై ప్రత్యేకించి నివేదిక పేర్కొంది. వాటి నివారణకు ప్రభుత్వాలు ఎటువంటి విధానాలు అవలంబించాలన్నది స్పష్టం చేసింది. కులం, జాతి/తెగ, మతం తదితర అంశాలలో మహిళలకు ప్రత్యేకించి ఎదురవుతున్న వివక్షలను నివేదిక ప్రస్తావించింది. ఆయా అంశాలలో మహిళలు పురుషులకంటే అధికంగా వివక్షకు గురవుతున్నట్టు పేర్కొంది. అంతేకాకుండా అధికారిక గణాంకాలలో కనపడుతున్న వివక్షలను ఏకరువు పెట్టింది. అధికారిక వివరాల్లో కూడా ఇటువంటి వివక్షతలు స్పష్టంగా అగుపడడం సమస్య తీవ్రతను వ్యక్తం చేస్తున్నట్లు నివేదిక ఆందోళన ప్రకటించింది. లింగభేదాల దృష్టితో చూసినప్పుడు అందరు స్త్రీలూ, బాలికలకు వారి వయస్సు, ప్రాంతం, వర్గం, జాతి, తెగతో నిమిత్తం లేకుండా సమాన హక్కులు కల్పించాల్సిన ఆవశ్యకత కనపడుతోందని నివేదిక పేర్కొంది. ఈ పరిస్థితులే దళిత స్త్రీలు సమాజంలోని అగ్రవర్ణాలవారికంటే 14.6 సంవత్సరాలు ముందే మరణించడానికి దారితీస్తున్నట్లు నివేదిక వివరించింది.

అగ్రవర్ణాల స్త్రీలకు ఉండే అనేక సౌలభ్యాలు దళిత మహిళలకు అందుబాటులో లేక పురుషులకన్నా దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని నివేదిక పేర్కొంది. కర్నాటక కొప్పాల్ జిల్లాలో ఆరోగ్య సేవలు అందుకోవడంలో పేద మహిళలు పూర్తిగా వెనుకబడినట్లు ఒక అధ్యయనంలో వెల్లడైంది. ఇతర వర్గాల స్త్రీల పరిస్థితి ఈ విషయంలో పేద పురుషులతో సమంగా ఉంది. అగ్రవర్ణాలలో స్త్రీలకు స్వయం నిర్ణయాధికారం లేకపోవడంతో ఆరోగ్య రక్షణపట్ల అప్రమత్తంగా ఉండే అవకాశం తక్కువ. అలాగే ఆర్థిక వనరులు కూడా మహిళలకు అంతగా అందుబాటులో ఉండవు. అందుకే ఆరోగ్య సేవలందుకోవడంలో వారి పరిస్థితి పేద పురుషులతో సమంగా మిగిలింది. పురుషులకు పేదరికం ఉన్నా లింగవివక్ష అనే అదనపు సమస్య లేదు. సంపద, ప్రాంతం కూడా మహిళల పరిస్థితిపై ప్రభావం చూపుతున్న అంశాలు. వాటిని బట్టి కూడా అసమానతలు నెలకొంటున్నాయి. ఒక ప్రాంతంలో పేదరికం ప్రభావం మహిళల విషయంలో ఇతర ప్రాంతాలపై కూడా చూపుతోంది.

ఈ నివేదిక ప్రకారం భారత్‌లో గ్రామీణ పేద కుటుంబానికి చెందిన 20–24 ఏళ్ల యువతికి 18 ఏళ్లు రాకుండానే పెళ్లి అయిపోతోంది. పట్టణ ప్రాంతాలకు చెందిన సంపన్న కుటుంబ యువతికంటే ఆ వయసులోని గ్రామీణ యువతికి ఈ సమస్య ఐదు రెట్లు అధికమని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. అలాగే పట్టణ సంపన్న యువతికంటే గ్రామీణ యువతికి పాఠశాల విద్య కూడా లోపించడం సమస్య 20 రెట్లు అధికం. అంతేకాకుండా గ్రామీణ మహిళలకు సాధారణంగా సొంతానికి డబ్బు ఉండదు. ఈ సమస్య పట్టణాలలోకంటే గ్రామాలలో 1.3 రెట్లు అధికం. అలాగే ఖర్చు విషయంలో ఆడవారి మాట చెల్లకపోవడం పట్టణాలలోకంటే గ్రామాలలో 2.3రెట్లు ఎక్కువగా ఉంది. మహిళలు భూములు లేని ఎస్‌సి వర్గం వారైతే పేదరికం స్థాయి మరింతగా పెరుగుతుంది. ఆమె పనిచేయాలని నిర్ణయించుకున్నా చదువులేకపోవడం, సమాజంలో అట్టడుగు స్థాయి కావడంవల్ల దోపిడీకి అధికంగా గురౌతోంది. పనిచేసినా జీతం దక్కకపోవడం తదితర సమస్యల నిష్పత్తి భారత్‌లో పురుషుల కంటే స్త్రీలకు పదిరెట్లు అధికంగా ఉంది.

'లైవ్‌మింట్' అనేసంస్థ నివేదిక కూడా భారత్‌లో పేద మహిళలు తమకున్న సమయంలో 24శాతాన్ని వంటచెరుకు ఏరడం, తదితర ఇంటిపనులకు వెచ్చిస్తున్నారని పేర్కొంది. ఆహారం, ఇంటికవసరమైన పదార్థాల సేకరణకే వారు తమకున్న సమయాన్ని వెచ్చిస్తుండడంతో చదువు, ఆరోగ్య రక్షణపై అంతగా దృష్టి పెట్టలేకపోతున్నారు.

పట్టణాలలోని సంపన్న వర్గాలలో మహిళల పరిస్థితి ఈ విషయంలో కొంచెం మెరుగ్గా ఉన్నట్లు 'లైవ్‌మింట్' తెలిపింది. 'ఏ ఒక్కరినీ వెనుకబడనీయవద్దు' అనే ఎజండా లక్ష్యాన్ని అందుకోవడానికి వ్యూహాలు తక్షణ రూపొందించాలని ఐరాస నివేదిక సూచించింది. 'ఈ లక్ష్యం వెనుక అసలు ఉద్దేశ్యం అణగారిన ప్రజలకు న్యాయం జరగాలనే' అని ఐరాస వివరించింది.అయితే ఈ కృషిలో సామాజిక అసమానతలు ఏ మాత్రం పెరగకుండా చూడడం ముఖ్యమని హెచ్చరించింది. పేద వర్గాల స్త్రీలపై సామాజిక ఆంక్షలను తొలగించాలని కూడా సూచించింది. సమాజంలోని బలహీన వర్గాల మహిళల హక్కులు దుర్వినియోగం కాకుండా రక్షణ కల్పించాలని నివేదిక సలహా ఇచ్చింది.

✽ అమనత్ ఖుల్లార్

నెగెటివ్ ఓటు మాత్రమే చాలదు



టంకశాల అశోక్
9848191767

2019 ఎన్నికలలో తిరిగి అధికారంలోకి వచ్చేందుకు నరేంద్రమోడీ ప్రభుత్వంపట్ల ఉండగల నెగెటివ్ ఓటు మాత్రమే చాలదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ గ్రహించాలి. దానితోపాటుగా, తమ నాయకత్వాన కాంగ్రెస్ విధానాలు ఏ విధంగా ఉండగలవో వివరించి ప్రజలనుంచి పాజిటివ్ ఓటు కూడా సంపాదించేందుకు ఆయన ప్రయత్నించవలసి ఉంటుంది.

మోడీ ప్రభుత్వం పట్ల వ్యతిరేకతకు ఆరంభమంటూ జరిగిందనే భావన క్రమంగా వ్యక్తమవుతున్నది. ఈ మాట ఇటీవలి గుజరాత్ ఎన్నికలు, రాజస్థాన్ ఉప ఎన్నికల ఫలితాలను బట్టి మాత్రమే అంటున్నది కాదు. అంతకుముందు సుమారు ఏడాదికాలంగా ఈ సూచనలు కన్పిస్తున్నాయి. ఎక్కడికో వెళ్లనక్కరలేకుండా మన చుట్టూ గల పట్టణ ప్రాంతాలు, గ్రామాల ప్రజలను కదిలించినా వారికి మోడీపట్ల 2014లో ఉండిన సానుకూల భావనలు గణనీయంగా తగ్గాయి. దేశమంతటా కూడా ఇదే వాతావరణం ఏర్పడుతున్నట్లు కన్పిస్తున్నది. ఇందుకు ప్రధాన కారణం ఎన్‌డిఎ ప్రభుత్వం సామాన్య ప్రజల కోసం ఏమి చేస్తున్నదో అర్థం కాకపోవటమే. అధికారంలోగల వారిపై అవినీతి ఆరోపణలు రాకపోవటం, కొన్ని సరకుల ధరలు అదుపులో ఉండటం అనే రెండింటిని మినహాయిస్తే, ప్రభుత్వాన్ని ప్రశంసించదగ్గది ఏమీ వారికి కన్పించటం లేదు. ధరలు కూడా అనేక సరకులకు చాపకింది నీరువలె నెమ్మదినెమ్మదిగా పెరుగుతూనే ఉన్నాయి.

ఇందుకు భిన్నంగా, మోడీ ఎంతగానో హామీ ఇచ్చిన సంవత్సరానికి కోటి ఉద్యోగాల జాడ ఎక్కడా కన్పించటం లేదు. ఈ విషయమై వస్తున్న ప్రశ్నలకు ప్రభుత్వంనుంచి కనీసం మొక్కుబడి సమాధానమైనా లేకపోవటం గమనించదగ్గది. అదేవిధంగా, దేశజనాభాలో అధిక సంఖ్యాకులకు జీవనాధారమైన వ్యవసాయం, కూలిపనులు, చేతివృత్తుల పరిస్థితి నానాటికి తీసికట్టు కావటం మినహా మోడీ పాలనలో వారికి కలుగుతున్న మేలు ఏమిటో బోధపడటం లేదు. మరొకవైపు పారిశ్రామికాభివృద్ధి, పారిశ్రామిక ఉత్పత్తి, ఉత్పాదకతలు నాలుగేళ్లు పూర్తవుతున్నా ఎదుగుబొదుగు లేకుండా ఉన్నాయి. ఎంతోకొంత మెరుగుదల ఉన్న చోట్ల అందుకు తగిన ఉపాధి కల్పన జరగటం లేదు. ప్రభుత్వమే తరచు మాట్లాడే జిడిపి, ఎగుమతులు, పారిశ్రామికోత్పత్తి అంశాలను చూసినా నిరుత్సాహకరంగానే ఉన్నాయి. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి మాత్రమే ఇందుకు కారణమనలేము. ఈ ధోరణులు అంతకు ముందే మొదలయ్యాయి. నోట్లరద్దు, జిఎస్‌టి లేనట్లయితే పుంజుకుని ఉండేవని కూడా చెప్పలేని స్థితి ఉంది. ఆర్థిక నిపుణులు పలువురి అంచనా ప్రకారం, ఈ రెండు చర్యలవల్ల ఆ నెగెటివ్ ధోరణి మరింత బలపడింది. ఒకవేళ చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్లలో తగ్గి ఉండకపోతే, అట్లా తగ్గినప్పటికీ ఆ ప్రయోజనాన్ని ప్రజలకు బదిలీ చేయకుండా ప్రభుత్వ ఖజానాయే లాభపడే పద్ధతిని అనుసరించి ఉండక పోతే, పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉండేదని నిపుణులు చెప్తున్న మాట. ఇది ఎవరికైనా సహేతుకంగా తోచేదే.

మరొక స్థాయిలో కేంద్రప్రభుత్వం పలువర్గాలకు సబ్సిడీలను తగ్గిస్తున్నది. మదుపరులకు బ్యాంకు వడ్డీలలో కోత పెడుతున్నది. చివరకు డిపాజిట్లకు భద్రతపై అనుమానాలు ఏర్పడే పరిస్థితిని సృష్టిస్తున్నది. అందుకు సంబంధించిన ఆలోచనలను కైట్ ఫ్లయింగ్ పద్ధతిలో మీడియాకు లీక్‌చేయటం, ప్రజల స్పందనలు ఏ విధం గా ఉండేదీ గమనించటం, వ్యతిరేకత తీవ్రంగా ఉంటే తమకు అటువంటి ఆలోచన లేదంటూ నమ్మబలకటం ఒక క్రీడగా మారింది. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, పేదల విషయంలో ఈ విధంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం, యథేచ్ఛగా బ్యాంకు రుణాలు ఎగవేస్తూ, పన్నులు ఎగవేసే అతి పెద్ద పారిశ్రామికులను నియంత్రిస్తున్న సూచనలు ఏమీ లేవు. కొత్త పన్ను విధానాలవల్ల సాధారణ పారిశ్రామికులు, వ్యాపారులపై కొన్ని నియంత్రణలు కన్పిస్తున్నాయి. తిరిగి అందులోనూ పలువురు ఆ భారాన్ని సామాన్యులపైనవేసి తమ అక్రమార్జనలను కొనసాగించే పద్ధతులను ఇప్పటికే కనుగొన్నారు. జిఎస్‌టి ఇందుకు ఒక ఉదాహరణ. అదేవిధంగా, పెద్దనోట్ల రద్దు ఒక పెద్ద ప్రహసనంగా మిగిలింది. కొద్దిరోజుల క్రితం స్వయంగా రిజర్వ్‌బ్యాంక్ వెల్లడించిన సమాచారం ప్రకారం, ఆ చర్య దరిమిలా బ్యాంకులలో డిపాజిట్ అయిన పెద్దనోట్ల విలువ ఎంతో పదిహేను మాసాల తర్వాత కూడా తెలియదట. ఇందరు సిబ్బంది, ఆధునిక లెక్కింపు యంత్రాలు, ఇన్ని బ్యాంకులు ఉన్నప్పటికీ ఈ లెక్క ఇంకా తెలియదనటం నమ్మగల విషయమేనా? అసలు ఇప్పటికే చెప్పిన లెక్కలనుబట్టి, నల్లధనమంటూ తేలింది ఆవగింజంత. బయటినుంచి నల్లధనాన్ని రప్పిం చి అందరి ఖాతాల్లో 15లక్షల రూపాయల చొప్పున వేయగలమన్న తాతలనాడే గాలిలో కలిసింది. ఇపుడు పెద్దనోట్ల రద్దు ద్వారా నల్లధనం వెలికితీత మరొక పరిహాసమైంది.

> ప్రజలకు తమపట్ల ఆ విధమైన ఆకర్షణ, విశ్వాసం ఏర్పడేందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు తమ పాజిటివ్ లక్షణాలు ఏమిటో ప్రజల ముందుకు తేవాలి. అది చేయక మోడీ పాలనా వైఫల్యాలను ఎంత గొప్పగా విమర్శించినా అందువల్ల ప్రజలు ఒక మేరకు మాత్రమే ప్రభావితులవుతారు. నెగెటివ్ ప్రభావం కన్నా ఎప్పుడైనా పాజిటివ్ ప్రభావం ముఖ్యమవుతుంది. ఈ దిశలో రాహుల్ గాంధీ ఆలోచిస్తున్నట్లు కనీసం ఇంతవరకైతే కన్పించటం లేదు.

దీనంతటి సారాంశం ఏమంటే, మోడీ ప్రభుత్వం 2014లో ప్రజలకు కల్పించిన ఆశలు క్రమంగా పలచబడుతున్నాయి. అటువంటి స్థితి మధ్య ''సమర్థమైన పాలన'' అనే మరొక ముఖ్యమైన హామీకి గల అర్థమేమిటో తెలియదు. పెద్దవారి అవినీతి, నిత్యజీవితంలో అధికార యంత్రాంగపు అవినీతి యధావిధిగా కొనసాగుతున్నప్పుడు ఆ రుగ్మతను నిర్మూలించటమనే హామీ ఏ విధంగా అమలువుతున్నదో కూడా తెలియటం లేదు. దీనంతటికి తగినట్లు మోడీ ప్రభుత్వ బాధ్యులు, ఆ ప్రభుత్వాన్ని వెనుకనుంచి నడిపించే సంఘ్‌పరివార్ శక్తుల ధోరణులు క్రమంగా వెగటు పుట్టిస్తున్నాయి.

మోడీ పాలనకు నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్న సమయంలో నికరంగా తేలుతున్న పరిస్థితులు ఈ విధంగా ఉన్నాయి. అందువల్లనే ప్రజలలో 2014 నాటి ఉత్సాహం ఇపుడు లేకపోగా నెగెటివ్ భావనలు ఏర్పడుతున్నాయి. పైన అనుకున్నట్లు ఏడాదికి ముందునుంచే కనిపించటం మొదలైన ఈ ధోరణి ఈ సరికి మరింత పెరిగింది. గుజరాత్, రాజస్థాన్ ఎన్నికల ఫలితాలు దీనికి అద్దంపట్టాయి. దీనిని గమనించినందువల్లనే కాంగ్రెస్‌కు, ఇతర ప్రతిపక్షాలకు కొత్త ఆశలు రేకెత్తుతున్నాయి. కాని వారికి అందువల్ల తిరిగి ఆశలు కలుగుతున్నాయి గాని అదే సమయంలో కొన్ని విషయాలను అర్థం చేసుకుంటున్నారా అనే సందేహం కలుగుతున్నది. మోడీ పాలన పట్ల ప్రతికూలత దేశవ్యాప్తంగా ఇదే స్థాయిలో ఉందని ఇంకా చెప్పలేము. అన్ని వర్గాలలో ఒకే విధంగా ఉందని కూడా చెప్పలేము. ఇది ఒక పరిస్థితి కాగా, అటువంటి వ్యతిరేకత ఏర్పడినవారు కూడా అందరూ తప్పక ప్రతిపక్షాలకు ఓటు వేయగలరని సైతం అనలేము. ప్రజల 'ఎలక్టోరల్ బిహేవియర్' అనే దానిని జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన అవసరం ఇక్కడనే ఉంటుంది. ఇక పార్టీ పట్ల వ్యతిరేకతగల ఓటర్లు, ఎదుటిపక్షం అంతకన్న మెరుగ్గా లేక అధ్వాన్నమా అనేది కూడా పోల్చిచూస్తారు. ఏ విధంగా మెరుగని తమకు తాము చర్చించుకుంటారు. స్పష్టమైన రీతిలో తేడా కన్పిస్తేనే ఓటు వేస్తారు. లేదా అధికారంలోగల పార్టీ పట్ల చాలా తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడి, అవతలి పార్టీ ఎటువంటిదైనా సరే ఆ పార్టీ పీడను వదిలించుకోవాలనే అభిప్రాయం కలిగితేనే ఆ పని చేస్తారు. మోడీ ప్రభుత్వానికి సంబంధించి ఈ విధమైన అంచనాలు తుది రూపంలో వేసేందుకు ఇంకా సమయం ఉందని గుర్తించాలి.

పోతే, ప్రజలకు తమపట్ల ఆ విధమైన ఆకర్షణ, విశ్వాసం ఏర్పడేందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు తమ పాజిటివ్ లక్షణాలు ఏమిటో ప్రజల ముందుకు తేవాలి. అది చేయక మోడీ పాలనా వైఫల్యాలను ఎంత గొప్పగా విమర్శించినా అందువల్ల ప్రజలు ఒక మేరకు మాత్రమే ప్రభావితులవుతారు. నెగెటివ్ ప్రభావం కన్నా ఎప్పుడైనా పాజిటివ్ ప్రభావం ముఖ్యమవుతుంది. ఈ దిశలో రాహుల్‌గాంధీ ఆలోచిస్తున్నట్లు కనీసం ఇంతవరకైతే కన్పించటం లేదు. తన విధానాలు ఏమిటో, గతకాలపు కాంగ్రెస్ విధానాలలోని, ఆచరణలోని, సంస్థలోని లోపాలను ఏ విధంగా సంస్కరించనున్నారో ఆయన ఇపుడు అధ్యక్షుడు అయిన తర్వాతనైనా వివరించటం అవసరం.

కొంపముంచిన మిత్రధర్మం



బి.నర్సన్
9440128169

నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలయినాయి– అనే సామెత ఉంది. కేంద్రంలో, రాష్ట్రంలో బిజెపితో జతకట్టిన చంద్రబాబు మిత్ర ధర్మం పరిస్థితికి పై సామెత సరిపోతుంది. ఇంటి మనిషినే కదా నా అవసరాలు తీర్చరా అని నమ్మిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి రాజ్యాంగబద్ధమైన విభజన చట్టం ప్రకారమైనా నిధులు కేంద్రం కేటాయించలేదు. నవ్యాంధ్రకు నాలుగేళ్లుగా కేంద్రం ఇచ్చిన నిధులు కేవలం రూ.20వేల కోట్లు. ఆంధ్రప్రదేశ్‌కు సుమారు రూ.3.55లక్షల కోట్లు ఇచ్చామని బిజెపి నేతలు ఢిల్లీలో ప్రకటించడంపై స్వయాన చంద్రబాబు విస్మయం ప్రకటించారు. రెండుపార్టీల మధ్య ఈ లెక్కలయుద్ధం నడుస్తోందిప్పుడు.

రాష్ట్ర విభజనవల్ల ఆంధ్రప్రదేశ్ నష్టపోకుండా పటిష్టమైన విభజన చట్టం ఏర్పడింది. ఆనాడు కేంద్రం లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు కల్పించే సదుపాయాల గురించి లిఖితపూర్వకంగా పార్లమెంటు ఉభయసభల్లో ఆమోదింపచేసింది. ప్రత్యేక హోదా, వనరుల లోటు భర్తీ, పోలవరం ప్రాజెక్టు, రైల్వేజోన్ ఏర్పాటు, అమరావతికి సాయం, పెట్రో కెమికల్ కాంప్లెక్స్, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ, విజయవాడల్లో మెట్రో అందులో ప్రధానమైనవి. అయినా, రాష్ట్ర విభజనపై కసితో ఆంధ్రప్రదేశ్ ఓటర్లు కాంగ్రెస్ పార్టీని ఊడ్చి పారేశారు. ముందుచూపుతో చంద్రబాబు బిజెపితో జతకట్టాడు. కేంద్రం నుండి తమ రాష్ట్రం అభివృద్ధికి సామరస్యంగా నిధులు రాబట్టుకోవచ్చని ఆయన ఆలోచన. అయితే మోడి ప్రభుత్వం మాత్రం చంద్రబాబుకు చుక్కలు చూపిస్తోంది. ఢిల్లీకి ఎన్ని చక్కర్లు కొట్టినా చంద్రబాబుకు మిగిలింది ఆయాసమేగాని ఆశ నెరవేరలేదు.

ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని అమరావతికి అక్టోబర్ 2015లో పునాదిరాయి పడింది. చంద్రబాబు స్వయంగా వెళ్లి ప్రధాని నరేంద్ర మోడీని ఆహ్వానించారు. ఆనాడు బాబు ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో ఉన్న అన్ని హామీలు నెరవేర్చుతామని ప్రధాని అన్నారని చెప్పారు. నీతి ఆయోగ్‌ని హామీలను నెరవేర్చే దిశగా ప్రణాళిక సిద్ధం చేయమని ప్రధాని కోరారని ఆర్థికమంత్రి జైట్లీ అన్నారు. అప్పటికి చంద్రబాబునాయుడు ప్రత్యేక హోదా కోసం మోడీని కలువడం ఎనిమిదోసారి. 22, అక్టోబర్ 2015నాడు తన చేతులతో తొలిరాయి ని రాజధాని నిర్మాణం కోసం వేసిన ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ ప్రజల కలలు నిజం చేసేందుకు ఇద్దరం కలిసి పని చేస్తామని గుండెలనిండ భరోసా ఇచ్చారు. అదే ప్రారంభోత్సవానికి హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో కలిసి ఇద్దరు చంద్రుల మధ్య నిలబడి ప్రధాని చేతులెత్తి ప్రతికలకు ఫోజులిచ్చారు.

అయితే తనవెంట తెచ్చిన కలశాన్ని చేతుల్లో పెట్టి ఇది కేంద్రం నజరానా అన్నట్లు ప్రధాని తన ప్రసంగంలో ప్రత్యేక హోదా గురించి ఒక్క మాటా మాట్లాడలేదు. వాస్తవానికి ఆనాడే తీవ్ర నిరాశ చెందిన చంద్రబాబు నోటికి మిత్రధర్మం అడ్డొచ్చింది. కేంద్రం ప్రత్యేక హోదానో, ప్రత్యేక ప్యాకేజీయో ఏదైనా నానబెడుతూ ఉండడంతో తెలుగుదేశం ప్రభుత్వానికి ఆ సమస్య రాజకీయంగా విపరీత చిక్కులు తెచ్చిపెడుతోంది. కేంద్రంలో మిత్రపక్షంగా ఉండి తెగించి మాట్లాడలేని పరిస్థితి చంద్రబాబుది. విపక్షా లు ఎంత నిలదీసినా ఓపిక పట్టక తప్పలేదు. కేంద్రం లో వెంకయ్యనాయుడు ఉన్నారులే అన్న ఆ కాస్తా ఊరట వెంకయ్య ఉపరాష్ట్రపతి కావడంతో ఆరిపోయింది. 2014 నుండి 2017వరకు కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ కోసం రూ.1500కోట్లు విడుదల చేశారు. విడతల వారీగా వచ్చిన ఆ మొత్తంతో రాజ్‌భవన్ నిర్మాణం, హైకోర్టు, సెక్రటేరియట్, శాసనసభా సముదాయం నిర్మాణాలు చేపట్టింది. వెన్వెంటనే ఖర్చుల వివరాలు, నిర్మాణాల దశ తెలియజేస్తూ వినియోగపత్రాలను మరిన్ని నిధుల విడుదలకోసం సమర్పించింది. రాబోయే మూడేళ్లలో రూ.6705కోట్లు విడుదల చేస్తేగాని ఆ నిర్మాణాలు పూర్తికావు.

ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రవేశపెట్టారు. అదే బిజెపి ప్రభుత్వానికి చివరి బడ్జెట్. బిజెపిని నమ్మిన చంద్రబాబుకు అయిదు బడ్జెట్లు నిరాశపరచాయి. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ప్రస్తావనే పెద్దగా లేకపోవడం, రాష్ట్రానికి చెందిన ప్రధాన ప్రాజెక్టులు, ప్రభుత్వ వినతులు ఏమాత్రం ఖాతరు చేయకపోవడంతో రాష్ట్రం మరోసారి తీవ్ర అన్యాయానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల సహకారానికి మిత్రధర్మానికి చివరకు చిన్నచూపే ఎదురైంది.

పార్లమెంటు సమావేశాలు అయిపోయేలోగా నిరసన ను తెలియచేసి ప్రభుత్వంనుండి వెసులుబాటును పొందాలని బాబు ఆలోచనతో పార్లమెంటు లోపలా బయట తెలుగుదేశం పార్లమెంటు సభ్యులు ఆందోళన మొదలుపెట్టారు. అయిదురోజుల పోరాట బాటతో కూడా జైట్లీ నోట పాతపాటే వచ్చింది. 2018 ఫిబ్రవరి 8 గురువారం రోజు తెదెపా సభ్యుడు గల్లా జయదేవ్ పార్లమెంట్ ప్రసంగం కేంద్రాన్ని తీవ్రంగా దుయ్యబట్టింది. సెప్టెంబర్ 7, 2016 హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించినా అదీ నెరవేర్చలేదని, కనీసం దానికి చట్టబద్ధత కూడా కల్పించలేదని అన్నారు. విభజనచట్టం 94(3) ప్రకారం నూతన రాజధానిలో రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ, కౌన్సిల్ ఇతర మౌలిక సదుపాయాల కోసం కేంద్రం తప్పకుండా ఆర్థిక సాయం చేయాలి. ఆంధ్రప్రదేశ్‌కు ఇంతవరకు కేటాయించిన మొత్తం 1815 కోట్లు ఓ తెలుగు సినిమా కలెక్షన్లతో పోల్చవచ్చని జయదేవ్ నిరసన తెలిపారు. ఆయన ప్రధానిని, ఆర్థికమంత్రిని నిలదీసిన విధానం చూస్తుంటే మిత్రభేదం మొదలయినట్లే అనిపిస్తుంది.

మరోవైపు ప్రధాని మోడీ పార్లమెంటులో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చిచ్చుపెట్టే ప్రయత్నం చేశారు. ఆయన తన ప్రసంగంలో కాంగ్రెస్‌పై విరుచుకుపడుతూ – స్వార్థ ప్రయోజనాలకోసం పార్లమెంటు తలుపులు మూసేసి హడావిడిగా చేసిన విభజనవల్ల ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఇబ్బందులు పడుతోందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఆనాటి చివరి పార్లమెంటు సమావేశాలు దోహదపడ్డాయన్న ఆలోచన ఆయనలో లేకపోవడం విచారకరం.అయిదేళ్లలో తమ మిత్రపక్షానికి మేలు చేయకుండా తమ తప్పును కాగ్రెస్‌పైకి మోపడం అన్యాయమే. ఆ కసితోనే తెలుగుదేశం సభ్యులు 'వివాంట్' అంటే సోనియా సైతం మెల్లగా 'జస్టిస్' అన్నారని వార్తల్లో వచ్చింది.

నరేంద్ర మోడీ తొలిసారిగా ప్రధాని హోదాలో ఆగస్టు 2016లో మిషన్ భగీరథను ఆరంభించడానికి తెలంగాణకు వచ్చినపుడు కూడా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావును పొగడ్తలతో ముంచెత్తారు గాని ఎలాంటి ఆర్థిక వెసులుబాటును మాటకైనా చెప్పలేదు.

బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని తోటి తెలుగువారిగా తెలంగాణ రాష్ట్రసమితి పార్లమెంటు సభ్యులు విచారం వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ తెరాస పక్షనేత ఎపి జితేందర్‌రెడ్డి పార్లమెంటు సాక్షిగా తెదెపా సభ్యులకు సంఘీభావం తెలిపారు.

తెరాస పార్లమెంట్ సభ్యురాలు కవిత ఆంధ్రప్రదేశ్ కేటాయింపుల పట్ల అసంతృప్తి ప్రకటించారు. బడ్జెట్ చర్చలో పాల్గొంటూ కవిత ఆంధ్రప్రదేశ్ ఎంపీలకు మద్దతు తెలుపుతూ ప్రభుత్వాలు మారుతాయి కాని పాలనమారదు. ఎపి, తెలంగాణ విభజన సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన హామీలపై కేంద్రం కట్టుబడి ఉండాలని అనడం మంచి సంప్రదాయానికి బాటలు వేస్తోంది. తెలుగువారిపై కేంద్రం వివక్షను పరస్పర సహకారంతో ఎదుర్కోవాలని పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్‌కు తెరాస సభ్యులు తోడు నిలువడం తెలుగుజాతి ఆనందించదగ్గ విషయం. చంద్రబాబుతో అవసరం తీరిందని బిజెపి మిత్రభేదానికి సిద్ధపడిందా లేదా అనేది ఏప్రిల్ 6 లోగా ముగిసే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోగా ప్రధాని, ఆర్థికమంత్రి చేసే ప్రకటనలబట్టి తెలుస్తుంది.



చేయి కోల్పోయిన కార్మికుడికి రూ.5 వేలు ఆమోదయోగ్యం కాదు

మన తెలంగాణ/ హైదరాబాద్ : విద్యుత్ ప్రమాదంలో చేయి కోల్పోయిన కార్మికుడికి మానవీయ కోణంలో ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వడం బాగానే ఉందని, అయితే ఆ కార్మికుడికి నెలకు రూ.5 వేలు మాత్రమే వేతనం నిర్ణయించడమే ఆమోదయోగ్యంగా లేదని హైకోర్టు ఆక్షేపణ తెలిపింది. కాంట్రాక్టర్ దగ్గర పనిచేసే వెంకటేశ్వర్లు 2011లో విద్యుత్ ప్రమాదంలో కుడి చేయి పోయింది. నాగర్‌కర్నూల్ జిల్లా రాచూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు ప్రభుత్వం నెలకు రూ.5 వేల జీతంతో ఉద్యోగం ఇచ్చింది. ఆ జీతంలో కుటుంబపోషణ చేయలేకపోతున్నానని, కనీస వేతన ఇవ్వాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. గత ఆదేశాలను అధికారులు అమలు చేయకపోవంతో కోర్టు ధిక్కార వ్యాజ్యాన్ని వేశారు. దీనిని న్యాయమూర్తులు నాగార్జునరెడ్డి, శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం విచారించింది. కనీస వేతన చట్టం కింద జీతం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బెంచ్ ఎస్పీడీసీఎల్ సీఎండీని ఆదేశించింది.

ఇంద్రకరణ్ రెడ్డికి బర్త్ డే శుభాకాంక్షలు



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర గృహ నిర్మాణ, దేవాదాయ శాఖల మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి జన్మదినోత్సవాన్నిపురస్కరించుకుని మంత్రి కెటిఆర్ శుభాకాంక్షలు తెలిపారు. బేగంపేట క్యాంప్ ఆఫీస్‌లో శుక్రవారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి కెటిఆర్ పుష్పగుచ్ఛం అందజేసి, స్వీట్లు తినిపించారు.ఎంఎల్‌ఏలు గువ్వల బాలరాజు, ఎర్రబెల్లి దయాకర్ రావు, రాథోడ్ బాబూరావు, హౌజింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మడుపు భూం రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి చిత్రా రామచంద్రన్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శివ శంకర్, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు తదితరులు మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

టిఆర్‌టి పరీక్షపై స్టేకు నిరాకరణ

వరంగల్, ఖమ్మం ఫలితాలు ఆపాలని హైకోర్టు ఆదేశం


మన తెలంగాణ/ హైదరాబాద్ : ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీ ఆర్టీ) నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. అయితే ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పరీక్షలు నిర్వహించిన తర్వాత వాటి ఎస్జి.జి.టి. ఫలితాల్ని బహిర్గతం చేయరాదని తెలంగాణ విద్యాశాఖ/జీఏడీల ముఖ్యకార్యదర్శులతోపాటు టీఎస్‌పీఎస్సీలను హైకోర్టు న్యాయమూర్తి ఎమ్మెస్ రామచంద్రరావు ఆదేశించారు. 2012లో జరిపిన డీఎస్సీ పరీక్షల్లో వరంగల్/ఖమ్మం జిల్లాల్లో దివ్యాంగులకు కేటాయించిన ఎస్జీటీ పోస్టులు 9, 5 చొప్పున భర్తీ కాలేదని, వీటిని కూడా కలిపి టీఆర్టీ నిర్వహించాలని, అప్పటి వరకూ టీఆర్టీ నిర్వహణను ఆపేయాలని ఆ జిల్లాలకు చెందిన మల్లికార్జున్, మురళి వేరువేరుగా హైకోర్టుల్లో రిట్లు దాఖలు చేశారు. వీటిని శుక్రవారం హైకోర్టు విచారించి ఆ రెండు జిల్లాల్లో పరీక్షలు నిర్వహించాక ఎస్జి.జి.టి. ఫలితాల్ని వెల్లడించరాదని మధ్యంతర ఆదేశాలిచ్చింది. విచారణ 2 వారాలకు వాయిదా పడింది.

హైకోర్టుకెళ్ళిన ఫార్మా-డి పట్టభద్రులు

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉద్యోగాల కల్పన చేయడం లేదంటూ ఫార్మాడి(పీబీ), ఫార్మాడీ కోర్సుల్లో పట్టభద్రులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిని హైకోర్టు న్యాయమూర్తి ఏవీ శేషసాయి శుక్రవారం విచారించి.. తెలంగాణ రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి, కేంద్ర ఆరోగ్య శాఖ, భారత ఫార్మసీ కౌన్సిల్‌లకు నోటీసులు జారీ చేశారు. ఫార్మాడీ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ ఈ రిట్ వేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో కెరీర్, సృష్టి అవకాలు కల్పించడం లేదన్న ఈ కేసు విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.

త్రిసభ్య కమిటీ భేటీ : ఫార్మా డి విద్యార్థుల సమస్యలను పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వం నియమించిన త్రిసభ కమిటీ తొలిసారి సమావేశమై ఫార్మా డి విద్యార్థులకు ఉద్యోగాల కల్పన అంశంపై చర్చించింది. నెల రోజులుగా ఫార్మా డి విద్యార్థులు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ మొదటిసారిగా వారితో సమావేశమైంది. వైద్య, విద్యా సంచాలకుల అధ్యక్షతన ఏర్పాటైన కమిటీలో డ్రగ్స్ కంట్రోల్ డీడీ కైలాసంతో పాటు తెలంగాణ ఫార్మసీ నుంచి ఒకరు సభ్యులుగా ఉండాలి, కానీ ఫార్మసీ కౌన్సిల్ లేకపోవడంతో డీఎంఈతో పాటు డ్రగ్స్ కంట్రోల్ డీడీలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఫార్మా డి విద్యార్థుల సంక్షేమ సంఘం నుంచి ఇద్దరు ప్రతినిధులు హాజరయ్యారు. సమస్యలను సావధానంగా విన్న కమిటీ అవసరమైన చర్యలు చేపడతామని హామి ఇచ్చినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగాల కల్పనకు సంబంధించి వారం రోజుల్లో ప్రభుత్వానికి ఒక నివేదికను అందజేయనున్నట్లు కమిటీ హామీ ఇచ్చినట్లు విద్యార్థి ప్రతినిధులు చంద్రశేఖర్, రామలక్ష్మి, నరేష్, శ్రావ్యలు తెలిపారు.

బుద్ధ గయకు చైర్మన్, స్పీకర్



మన తెలంగాణ/హైదరాబాద్: బిహార్ రాజధాని పాట్నాలో కామన్ వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌కు హాజరైన మండలి ఛైర్మన్ కె.స్వామి గౌడ్,శాసనసభ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి శుక్ర వారం గయాలోని బుద్ధక్షేత్రాన్ని సందర్శించారు. బుద్ధక్షేత్రం బాధ్యులు జార్జ్ వారిని స్వాగతం పలికారు. శాసనసభ కార్యదర్శి నర్సింహ కూడా ఉన్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు ప్రత్యేక సర్కిల్

మన తెలంగాణ/హైదరాబాద్:మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌ల నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. భూసేకరణలో జాప్యం, ఇతరత్రా కారణాలతో ఈ ప్రాజెక్టుల పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. వీటిని వేగవంతం చేయడానికి కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో గజ్వేల్ కోసం ప్రత్యేక సర్కిల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది.మల్లన్నసాగర్ ద్వారా సిద్ధిపేట నియోజకవర్గంలోని ప్రాంతాలకు, కొండపోచమ్మ సాగర్ ద్వారా గజ్వేల్ నియోజకవర్గంలో మెజారిటీ ఆయకట్టుకు సాగునీరు లభిస్తుంది. ఈ రిజర్వాయర్లు పూర్తయితేనే దానికి కొనసాగింపుగా ఉన్న గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లు, వాటి ఆయకట్టుకు, హైదరాబాద్ తాగునీటి కోసం నిర్మిస్తున్న శామీర్‌పేట రిజర్వాయర్‌కు నీరు వస్తుంది. కానీ పనుల్లో ఆశించినంత వేగంలేకపోవడంతో ప్రత్యేక సర్కిల్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి.మరో వైపు ఈ రిజర్వాయర్లు పూర్తికాకున్నా, కెనాల్‌ల ద్వారా నీటిని తరలించి, చెరువులు నింపేలా ప్రత్యామ్నాయ ప్రణాళికను ఇరిగేషన్ శాఖ సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి టి.హరీశ్‌రావుల సొంత నియోజకవర్గాలు, జిల్లాలు కావడంతో అధికారులు కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనులు పూర్తిచేయడంపై అధికారులు దృష్టి పెడుతున్నారు. హైదరాబాద్‌లోని కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ పరిధిలో ఇప్పటికే సిద్ధిపేట, భువనగిరి సర్కిల్‌లు ఉండగా, గజ్వేల్ పేరుతో మరో సర్కిల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కొండపోచమ్మ పనులను ఒక డివిజన్‌కు, మల్లన్న సాగర్ పనులను మరో డివిజన్‌కు అప్పగించనున్నారు.

ఎర్రజొన్న రైతులకు గుర్తింపు కార్డులు

ఇతర రాష్ట్రాల కోల్డ్ స్టోరేజ్‌ల నుంచి సరకు రాకుండా పకడ్బందీ చర్యలు



మన తెలంగాణ/హైదరాబాద్ : ఎర్రజొన్న రైతులకు గుర్తింపు కార్డులను జారీ చేయాలని మార్కెటింగ్ శాఖ మంత్రి హరీష్‌రావు ఆదేశించారు. వ్యవసాయ విస్తరణాధికారి, మార్కెటింగ్, రెవెన్యూ అధికారులతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీ స్క్రూటినీ అనంతరమే నిజమైన రైతుల నుంచి ఎర్రజొన్నలు కొనుగోలు చేయాలన్నారు. అసలు రైతులకు మాత్రమే ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జలసౌధలో వివిధ శాఖల అధికారులతో ఎర్రజొన్నల కొనుగోళ్లపై సమీక్షించారు.దీనిపై తక్షణమే ఆర్మూర్‌ను సందర్శించాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌తో పాటు వ్యవసాయ కమిషనర్, మార్కెటింగ్ డైరెక్టర్, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఎకరానికి 12 క్వింటాళ్ళకు మించి మార్కెట్‌కు తీసుకు వచ్చే వారిపై విజిలెన్స్ నిఘా పెట్టాలని కోరారు. కొనుగోలు చేసిన సరకుకు డబ్బును రైతు ఖాతాలోనే జమ చేయాలని, ఒక్క పైసా కూడా దుర్వినియోగం కావడానికి వీలు లేదన్నారు. కర్నాటక వంటి పొరుగు రాష్ట్రంలో దాదాపు మూడున్నర లక్షల క్వింటాళ్ల ఎర్రజొన్న నిల్వలు ఉన్నట్టు సమాచారం అందిందన్నారు. రాష్ట్రంలోని జిల్లాల్లో కొన్ని చోట్ల కోల్డ్ స్టోరేజ్‌లలో గత సీజన్ నుంచి నిల్వ ఉంచిన సరకు కూడా పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని వాటన్నింటినీ అరికట్టాలని కోరారు. క్రయ, విక్రయాలలో అవకతవకలు, అక్రమాలకు పాల్పడే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మార్కెటింగ్ రంగంలో పరిశోధనా విభాగం : మార్కెటింగ్ రంగంలో పరిశోధనా విభాగం ఏర్పాటు చేయాలని మంత్రి అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాదికి తెలంగాణలో సాగునీటి వసతి అనూహ్యంగా పెరగనున్నందున దిగుబడిని కూడా ముందుగానే అంచనా వేయాల్సి ఉంటుందన్నారు. ఆయా పంటల దిగుబడికి అనుగుణంగా మార్కెట్ సౌకర్యాలు, స్టోరేజ్ వసతి కల్పించాల్సి ఉందని మంత్రి చెప్పారు. ఏ ప్రాంతంలో ఎటువంటి పంటలు వేస్తున్నారు? దిగుబడి ఎంత? మార్కెట్‌లో ధరల పరిస్థితులు ఏమిటి? వాటి ఎగుమతికి ఉన్న అవకాశాలు? ఆయా పంట ఉత్పత్తులకు వివిధ రాష్ట్రాల్లో, వివిధ దేశాల్లో ఎగుమతికి గల అవకాశాలపై పరిశోధన జరగాలన్నారు.

19 నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు

ఎర్రజొన్నలను ఈ నెల 19 నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారధి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.శీతల గిడ్డంగుల వద్ద, అంతరాష్ట్ర సరిహద్దుల్లో అధికారుల బృం దాల నిఘాల ఉండనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.నిజామాబాద్,జగిత్యాల్, నిర్మల్ జిల్లాలో 51 234 ఎకరాలలో సాగైన 87099 మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని 27506 రైతుల నుంచి సేకరించనున్నారు.

నిరాహారదీక్షను భగ్నం చేసిన పోలీసులు



మన తెలంగాణ/ ఆర్మూర్: ఎర్రజొన్న, పసుపు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష,ధర్నా కార్యక్ర మాన్ని పోలీసులు భగ్నం చేశారు. శుక్రవారం ఉ. 3.45 గంటలకు పోలీసులు శిబిరంపై దాడి చేసి రైతులను అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకతుపై విడుదల చేశారు. పట్టణంలోని అన్ని కూడళ్ల వద్ద భారీ బందోబ స్తు ఏర్పాటు చేశారు. ఆర్మూర్ సిఐ సీతారాం, రూరల్ సిఐ వెంకటర మణారెడ్డి,భీంగల్ సిఐ సాదుల్లా, ఎస్ఐలు జగదీశ్‌లు బందోబస్తు ఏర్పాట్లలో పాల్గొన్నారు.

రహదారుల కోసం త్వరితగతిన భూసేకరణ : తుమ్మల

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.శుక్రవారం సచివాలయంలో జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్రం ఎనిమిదివేల కోట్ల రూపాయల జాతీయ రహదారుల నిర్మాణాలను ప్రకటించిందని, వీటికి అవసరమైన భూసేకరణ చేపట్టాలన్నారు.వీటితోపాటు కొత్తగా చేపట్టబోయే రాష్ట్ర రహదారుల కోసం కూడా భూమిని సేకరించాలన్నారు.వీటి కో సం అవసరమైన అటవీ,ఇతర భూముల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం ప్రకారం చేయాలని కలెక్టర్లకు సూచించారు.ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ, ఇఎన్‌సిలు రవీందర్‌రావు,గణపతిరెడ్డి,జాతీయ రహదారులఅథారిటి ఆర్‌ఓకృష్ణప్రసాద్ ఇతరఅధికారులు పాల్గొన్నారు.

ఎన్‌ఎసి లండన్‌తో ఒప్పందం :నిర్మాణ రంగంలో వివిధ స్థాయిల్లో పనిచేసే కార్మికులకు, నిపుణులకు, ఇంజనీర్లకు ప్రపంచస్థాయిలో నైపుణ్యం పెంచేందుకు నేషనల్ ఓపెన్ కాలేజ్ నెట్‌వర్క్ లండన్ ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. శుక్రవారం ఎన్‌ఎసి ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించేందుకు నేషనల్ ఓపెన్ కాలేజి నెట్‌వర్క్ లండన్‌తో పరస్పరం ఒప్పందం కుదుర్చుకున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మతో పాటు నేషనల్ ఓపెన్ కాలేజి నెట్‌వర్క్ లండన్ ప్రతి నిధులు,ఎన్‌ఎసి డిజి భిక్షపతి పాల్గొ న్నా రు.

మార్చి చివర్లో ఇంటింటికి కంటి వైద్యం

కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని మంత్రి లక్ష్మారెడ్డి ఆదేశం



మన తెలంగాణ/ హైదరాబాద్ : ఇంటింటికి కంటి పరీక్షల నిర్వహణ కార్యక్రమాన్ని మార్చి నెలఖారుకల్లా ప్రారంభించాలని,ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ముందు చూపుతో ప్రకటించిన ఇంటింటికి కంటి పరీక్షల నిర్వహణకు అధికారులంతా సిద్ధం కావాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో జరిపిన సమీక్షా సమావేశంలో మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వమే బాసటగా నిలవాలని సీఎం కెసిఆర్ భావిస్తున్నారని, కంటి పరీక్షలు జరిపి ఉచితంగా కంటి అద్దాలతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా చేయాలన్నారు. ఇందుకోసం శిబిరాల నిర్వహణ, పరికరా లు, ప్రస్తుతమున్నవి, మరిన్ని కొనుగోలు చేయడంతో పాటు స్క్రీనింగ్ ఎంత కాలం నిర్వహించాలి, మానవ వనరుల అవసరం, అద్దాలు, తదితర అంశాలపై చర్చించారు. వీటిని పరిగణలోకి తీసుకొని ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు.

డయాగ్నోస్టిక్ కేంద్రాల పనుల వేగవంతం చేయాలి
డయాగ్నోస్టిక్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన పనులను కూడా వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించే పథకం ప్రారంభానికి కూడా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ప్రజల అనారోగ్య సమస్యలపై అధ్యయనం చేసి అవసరమైన చికిత్సలు,శస్త్ర చికిత్సలు జరిగే విధంగా చర్య లు చేపట్టాలన్నారు. అనేక మందికి వ్యాధులపై తగిన అవగాహన లేదని,దీనివల్ల వ్యాధులు ముదిరి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి నయం చేసేందుకు వీలుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు.సమీక్షలో కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌వాకాటి కరుణతోపాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కల్తీ నివారణకు పటిష్ట చర్యలు : కల్తీ నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పలు హోటళ్ళు, బేకరీ, టిఫిన్ సెంటర్లతో పాటు బండ్లు, ఇతర ఆహార పదార్థాలకు సంబంధించిన కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాలతో పాటు నూనెలు, మంచినీళ్ళను పరిశీలించారు. వంట గదులు, వాటి పరిశుభ్రత, ఆహార పదార్థాలోల వాడుతున్న రంగులను పరిశీలించారు. మొబైల్ వ్యాన్ ద్వారాపరీక్షలు నిర్వహించారు. హోటళ్ళకు వ్యాపార, ఆహార సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. కల్తీపై తొలుత అవగాహన కల్పించాలని ఆతర్వాత చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఏడు రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే

ఇంటర్, డిగ్రీ, పిజి పరీక్షలు బహిష్కరిస్తాం

కెజి టు పిజి జెఎసి హెచ్చరిక



మనతెలంగాణ/హైదరాబాద్:ప్రధాన సమస్యలపై చర్చించి ఏడు రోజుల్లో ఉత్తర్వులు జారీ చేయకపోతే ఇంటర్, డిగ్రీ, పిజి పరీక్షల నిర్వహణను బహిష్కరించి సహాయ నిరాకరణ చేస్తామని తెలంగాణ కెజి టు పిజి విద్యా సంస్థల జెఎసి హెచ్చరించింది. సమస్యలను పరిష్కరిస్తామని ఏడాది నుంచి చెప్తూ వచ్చిన పెద్దలంతా ముఖం చాటేశారని, విధిలేని పరిస్థితుల్లోనే ఇప్పుడు సహాయ నిరాకరణకు దిగుతున్నామని తెలిపింది. శుక్రవారం సెంట్రల్ కోర్ట్ హోటల్ జరిగిన విలేకరుల సమావేశంలో కెజి టు పిజి జెఎసి ఛైర్మన్ జి.రమణారెడ్డి, కన్వీనర్లు ఎన్.ఎన్.రెడ్డి,గౌరీ సతీష్, నారాయణ గౌడ్‌లు మాట్లాడారు. సామాజిక బాధ్యతతో తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలు ఇప్పుడు ఆర్థిక తోడ్పాటు లేక, నిబంధనల ఆంక్షల వల్ల అభద్రతకు లోనవుతూ అభివృద్ధి లేకుండా కుంటుపడుతున్నాయన్నారు. ఇంటర్ ఫీజులను సైన్స్ కోర్సులకు రూ.25 వేలు, ఆర్ట్స్ కోర్సులకు రూ.15 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. డిగ్రీ సైన్స్ కోర్సులకు రూ.30 వేలు, కామర్స్ కోర్సులకు రూ.25 వేలు, ఆర్ట్స్ కోర్సులకు రూ.20 వేలు పెంచాలన్నారు. రాష్ట్రంలో కామన్ అడ్మిషన్లు, కామన్ పరీక్షలు ఉన్నప్పుడు రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పిజి కోర్సులకు కామన్ ఫీజు విధానం ఉండాలని పేర్కొన్నారు. సంక్షేమ శాఖలు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బుల్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. జూనియర్, డిగ్రీ కళాశాలలకు ఐదేళ్లకోసారి అఫిలియేషన్ రెన్యువల్ విధానం తీసుకురావాలన్నారు. పదేళ్లు పూర్తి చేసుకున్న అన్ని జూనియర్, డిగ్రీ, పిజి కళాశాలలకు కార్పస్‌ఫండ్ ఎఫ్‌డిఆర్‌లు విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. దోస్త్ నిర్వహణ సరళంగా ఉండాలని, మిగిలిన సీట్లు కళాశాల యాజమాన్యం ఆర్‌టిఎఫ్‌తో భర్తీ చేసుకునే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. అలాగే అన్ని పాఠశాలలు, కళాశాలలకు ఆస్తిపన్ను, విద్యుత్ ఛార్జీలలో రాయితీ ఇవ్వాలని, పాఠశాలలకు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ నుంచి మినహాయించాలని తెలిపారు.

అన్ని విద్యాసంస్థలకు ప్రభుత్వ ధరకు 2 ఎకరాల భూమి కేటాయించాలని కోరారు. అనంతరం కెజి టు పిజి జెఎసి ప్రతినిధులు ఇంటర్ బోర్డ్ కార్యదర్శి ఎ.అశోక్‌ను కలిసి ఇంటర్ పరీక్షల బహిష్కరణ నోటీస్ ఇచ్చారు.

తప్పుడు వివరాలు సమర్పిస్తే న్యాయవిచారణ

పంచాయతీ ఎన్నికల్లో కొత్త నిబంధన

మన తెలంగాణ/హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికల్లో సర్పంచి, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసే అభ్యర్థుల విషయంలో ఎన్నికల కమిషన్ కొత్త నిబంధన విధించింది. నామినేషన్‌తో పాటు సమర్పించే వివరాల్లో తప్పులు దొర్లితే వారిపై న్యాయవిచారణ చేపట్టనున్నట్లు స్పష్టం చేసింది. అభ్యర్థికి సంబంధించిన నేరచరిత్ర, ఆస్థులు, విద్యార్హతలు వంటివివరాలన్నీ నామినేషన్‌తో పాటు ఇద్దరు సాక్ష్యులతో నిర్ణీత ఫార్మాట్‌లో సమర్పించాలని, ఈ వివరాల్లో తప్పులుంటే సంబంధిత రిటర్నింగ్ అధికారి న్యాయవిచారణ చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి అన్ని జిల్లాల అధికారులకు ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఈ నిబంధన పంచాయతీ ఎన్నికల్లో లేనందున ఈ సారి కొత్తగా ప్రవేశపెట్టారు.

సైనిక సంక్షేమానికి టీచర్ల విరాళం



మన తెలంగాణ/ హైదరాబాద్ : సైనికుల సంక్షేమం, వారి కుటుంబాల శ్రేయస్సును ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధికి ఉపాధ్యాయుల సంయుక్త కార్యాచరణ సమితి(జాక్టో) ఉపాధ్యాయుల ఒకరోజు మూల వేతనాన్ని విరాళంగా ప్రకటించింది. ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీష్‌రావుకు జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యులు బి.భుజంగరావు, జి.సదానందంగౌడ్, ఇ.రఘునందన్, ఎం.అంజిరెడ్డి, జి.చెన్నయ్య,జి.వేణుగోపాల స్వామి, రాధాకృష్ణ, ఎం.డి.అబ్దుల్లా, చంద్రమోహన్,జి.మోహన్‌రెడ్డి, గీతాంజలి,ఎం. డి.నయీమ్, మీర్ ముంజాత్ అలీ, ఆర్.సురేందర్‌రెడ్డి, కృష్ణుడు విరాళానికి సంబంధించిన లేఖను అందించారు.

ఎర్రజొన్నకు రూ.2300 మద్దతు ధర చారిత్రాత్మకం



మన తెలంగాణ/హైదరాబాద్: ఎర్రజొన్నకు ప్రభుత్వం క్వింటాకు రూ.2300 మద్దతు ధరను నిర్ణయించడం చారిత్రాత్మకమని టిఆర్ఎస్ ఎంఎల్ఎ ఎ.జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఎర్రజొన్న రైతులు తమ బకాయిల కోసం రోడ్డెక్కితే కాల్పులు జరిపారని, టిఆర్ఎస్ ప్రభుత్వం వారి సమస్యను వెంటనే పరిష్కరించిందని చెప్పారు. టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎర్రజొన్న రైతు సమస్యలపై దృష్టి సారించలేదన్నారు. 2008లో ఎర్రజొన్న సమస్య పరిష్కారం కోసం ఎనిమిది రోజుల పాటు నిరాహారదీక్ష చేశానన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటకలో ఎర్రజొన్నకు రూ.1600మద్దతు ధర ఇస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా టిఆర్ఎస్ ప్రభుత్వం క్వింటాకు రూ.2300 ధరను నిర్ణయించిందన్నారు. సిఎం కెసిఆర్ స్వయంగా రైతు కావడంతోనే ఎర్రజొన్న రైతుల సమస్యలపై వెంటనే స్పందించారన్నారు. సిఎం కెసిఆర్ మీద ఎర్రజొన్న రైతులు ఎంతో నమ్మకంతో తమ ఆందోళన విరమించారని, స్థానిక కాంగ్రెస్ నేత సురేష్‌రెడ్డి మనుషులే దీక్షలో పాల్గొన్నారని అన్నారు. ఆర్మూర్ ఎర్రజొన్న రైతు సమస్యలను పరిష్కరించినందుకు సిఎం కెసిఆర్, మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్‌రావు, ఎంపి కవితకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కాళేశ్వరంపై విచారణ వాయిదా

మనతెలంగాణ/న్యూఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంపై దాఖలైన పిటిషన్ పై శుక్రవారం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) విచారణ జరిపింది. ఈ కేసు తదుపరి విచారణను మార్చి 21 కి వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ప్రకాష్ రెడ్డి వాదనలు వినిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి అటవీ పర్యావరణ, అనుమతులు వచ్చాయి కాబట్టి కేసు విచారణ ముగించాలని తెలంగాణ తరపు న్యాయవాది కోరారు. ప్రాజెక్టు అనుమతులు అన్ని వచ్చాయి కాబట్టి ఇంకా మీ అభ్యంతరాలేంటి ? అని పిటిషనర్ ను ఎన్జీటి ధర్మాసనం ప్రశ్నించింది. ప్రాజెక్ట్ నిర్మాణంలో పర్యావరణ అనుమతులను ఉల్లంఘించారని హయతుద్దీన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటీషన్ ను జస్టిస్ రఘువేంద్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ప్రాజెక్ట్ కు పర్యావరణ అనుమతులు వచ్చినా తమకు కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని పిటిషనర్ తరపు జూనియర్ న్యాయవాది తెలపడంతో విచారణను మార్చి21 కి వాయిదా వేసింది.

కరీంనగర్‌కు 'స్మార్ట్' నిధులివ్వండి



మన తెలంగాణ/ న్యూఢిల్లీ: కరీంనగర్ స్మార్ట్ సిటీకి నిధులు విడుదల చేయాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్ దీప్ సింగ్ పురిని కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బి. వినోద్ కుమార్ కోరారు. శుక్రవారం నిర్మాణ్ భవన్‌లోని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యాలయంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్ దీప్ సింగ్ పురితో ఎంపి వినోద్ కుమార్ సమావేశమయ్యారు. సమావేశం అనంతరం కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ కరీంనగర్ స్మార్ట్ సిటీకి త్వరితగతిన నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి హర్ దీప్ కోరామని తెలిపారు.

రూ.450 కోట్లే అడుగుతారా?



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రానికి రూ.40వేల కోట్లు కావాలంటున్న కెసిఆర్, ఢిల్లీకి వెళ్లగానే కేంద్ర ప్రభుత్వాన్ని కేవలం రూ.450 కోట్లనే అడుగుతున్నారని శాసన మండలి ప్రతిపక్షనేత మహ్మద్ షబ్బీర్‌అలీ ఆరోపించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో శుక్ర వారం ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను, రైతులకు మద్దతు ధర తదితర కేంద్ర సహాయం అంశంలో కెసిఆర్ కేంద్రంతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎంపిలు తమ రాష్ట్రం కోసం పోరాడుతుంటే, టిఆర్ఎస్ ఎంపిలు మాత్రం మౌనంగా ఉండడం దారుణమన్నారు. ఎర్రజొన్న రైతులకు ప్రభుత్వం వెంటనే బోనస్ ప్రకటించి వారిని ఆదుకోవాలన్నారు. ఎస్‌సి,మైనార్టీ బిల్లులను కెసిఆర్ కేంద్రానికి ప్రతిపాదించలేదనే అనుమానాలు కలుగుతు న్నాయన్నారు. ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ ఢిల్లీ టూర్ కొండను తవ్వి ఎలుకను తవ్విన చందంగా మారిందన్నారు.

కీసరను అభివృద్ధి చేస్తాం : ఈటల



మన తెలంగాణ/కీసర (మేడ్చల్ జిల్లా): కీసర గొప్ప పుణ్య క్షేత్రంగా అభివృద్ధి చెందే ఆస్కారం ఉందని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కీసరగుట్టలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగి శాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి ఈటెల మాట్లాడుతూ యాదాద్రి, వేములవాడ ఆలయాలను అభివృద్ధి చేస్తున్న తరహాలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన కీసరగుట్టను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు.

ఎంబిబిఎస్, ఐఐటికి ఉత్తమ శిక్షణ

మన తెలంగాణ / హైదరాబాద్ : ఎంబిబిఎస్, ఐఐటి లాంటి కోర్సుల్లో అత్యధికంగా సీట్లు సాధించడమే లక్ష్యంగా విద్యార్థులకు మెడికల్ అకాడమి, ఐఐటి కోర్సులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ సలహాదారు (సంక్షేమం) ఎ.రామలక్ష్మ ణ్ అన్నారు. శుక్రవారం ఆయన రంగారెడ్డి జిల్లాలోని గౌలిదొడ్డి ఎస్‌సి బాలికల, బాలుర గురుకుల జూనియర్ కాలేజీలు, నార్సింగి బాలికల జూనియర్ కళాశాలలను సందర్శించారు.

గత విద్యా సంవత్స రంలో గౌలిదొడ్డి కళాశాల నుండి 30 మంది విద్యార్థులు ఎంబిబిఎస్‌లో, 7 మంది బిడిఎస్‌లో, 5గురు బివిఎస్‌సిలో, ఎఐఐఎంఎస్, నీట్ లలో ఒక్కొక్కరికి హెచ్‌సియులో ఐదుగురికి ఉన్నత ర్యాంకులు సాధించారని ప్రిన్సిపల్స్ రామలక్ష్మ ణ్‌కు వివరించారు.

గవర్నర్‌తో సిఎం ఢిల్లీ ముచ్చట్లు

(మూడవ పేజీ తరువాయి)

రావాల్సిన వెనకబడిన జిల్లాలకు సంబంధించిన నిధులతో పాటు పునర్ వ్యవస్థీకరణ చట్టంలో అమలుకు నోచుకోకుండా ఉన్న పలు హామీలను, ఎయిమ్స్‌కు నిధుల కేటాయింపు తదితర అంశాలను జైట్లీతో ప్రస్తావించడం, లభించిన సానుకూల స్పందన తదితరాలను వివరించినట్లు తెలిసింది. వచ్చే నెల 12వ తేదీన ప్రారంభం కానున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాలపై గవర్నర్‌తో చర్చించారు. రానున్న వర్షాకాలం నుంచి రైతులకు ఇవనున్న నాలుగు వేల పెట్టుబడి పథకం, దానికి అవసరమైన ఆర్థిక వనరులు, బ్యాంకుల్లో నగదు లభ్యత, కేంద్రం నుంచి ఆశిస్తున్న సహకారం, రిజర్వు బ్యాంకు నుంచి ముందస్తుగానే పొందే రుణం తదితరాలకు సంబంధించి కూడా గవర్నర్‌తో సిఎం కెసిఆర్ చర్చించినట్లు తెలిసింది. ఢిల్లీ పర్యటన తర్వాత క్రమం తప్పకుండా గవర్నర్‌కు వివరించడం ఆనవాయితీగా వస్తున్నట్లుగానే ఇప్పుడు కూడా నేరుగా విమానాశ్రయం నుంచి రాజ్‌భవన్‌కు వెళ్ళడం విశేషం. సిఎం కెసిఆర్ శనివారం పుట్టినరోజు వేడుకల నేపథ్యంలో ఒక రోజు ముందుగానే గవర్నర్ నుంచి జన్మదిన శుభాకాంక్షలను, ఆశీర్వాదం అందుకున్నారు. ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి గవర్నర్ శనివారం చెన్నై వెళ్తున్నందున ఒకరోజు ముందుగానే కెసిఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు.

టిఆర్‌టి పరీక్ష

(మూడవ పేజీ తరువాయి)

పరిష్కరించేందుకు తాము పనిచేస్తున్నామని, సాధ్యమైనంత త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఈ సందర్భంగా రాజేంద్ర నిమ్జె తెలిపారు.

టిఆర్‌టి అభ్యర్థుల ప్రత్యేక హెల్ప్‌డెస్క్

టిఆర్‌టి అభ్యర్థుల సమస్యలు పరిష్కరించేందుకు టిఎస్‌పిఎస్‌సి కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయలని కమిషన్ నిర్ణయించింది.ఈ హెల్ప్‌లో టిఎస్‌పిఎస్‌సి, సిజిజి సిబ్బంది అందుబాటులో ఉంటారు.టిఆర్‌టి పరీక్షలు ముగిసేంతవరకు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఈ హెల్ప్‌డెస్క్ అందుబాటులో ఉంటుంది. టిఆర్‌టి అభ్యర్థులకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా కానీ లేదా 8333923740 ఫోన్ నెంబర్‌లో లేదా helpdesk@tspsc.gov.inకు మెయిల్ చేయవచ్చని టిఎస్‌పిఎస్‌సి తెలిపింది. టిఆర్‌టి అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో 31 జిల్లాలను 10 జిల్లాలకు అనుగుణంగా సవరించుకోవాలని సూచించింది.

డబుల్ ఇళ్లకు 'ఉక్కు' ఊరట

• టన్ను ఉక్కుకు రూ. 43,660 • మంత్రుల భేటీలో అంగీకరించిన స్టీల్ కంపెనీలు



మన తెలంగాణ/హైదరాబాద్ : డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణానికి తక్కువ ధరకు ఉక్కును విక్రయించేలా మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, కెటిఆర్‌లు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. టన్ను ఉక్కును రూ. 43,660కి విక్రయించేందుకు స్టీల్ కంపెనీల యజమానులు అంగీకరించారు. బేగంపేటలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో మంత్రులు స్టీల్ కంపెనీల యజమానులతో సమావేశమై డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన స్టీలును నిర్ధిష్టమైన (బేస్ రేట్) ధరకు సరఫరా చేయాలని కంపెనీలకు విజ్ఞప్తి చేశారు. నిరుపేదలకు నాణ్యతతో విశాలమైన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ప్రభుత్వం నిర్మిస్తోందని, లాభాపేక్షతో కాకుండా సామాజిక దృక్పథంతో సరసమైన ధరకు ఉక్కు విక్రయించాలని సూచించారు. గ్రామాల్లో లక్ష ఇండ్లకు 1.45 లక్షల మెట్రిక్ టన్ను లు, పట్టణాల్లో 60 వేల ఇండ్లకు 1.04 లక్షల టన్నులు, జిహెచ్‌ఎంసి పరిధిలో లక్ష ఇండ్లకు 2.78 లక్షల టన్నుల స్టీల్ అవసరమని వివరించారు. రెండు నెలల కాలానికి ఏప్రిల్ 16 వరకు రూ.43, 660కే ఉక్కును అమ్మేందుకు కం పెనీలు అంగీకరించాయి. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పథకం ప్రారంభించినప్పుడు బహిరంగ మార్కెట్లో మెట్రిక్ టన్ను స్టీల్ ధర (పన్నులతో కలుపుకుని) రూ.32,550 ఉండగా అది రూ.53,100 (జిఎస్‌టితో కలిపి) చేరుకుంది. స్టీల్ కంపెనీల యజమాన్యాలతో చర్చించిన తర్వాత టన్ను రూ.43,660 కే (జిఎస్‌టి కలి పి) విక్రయించేందుకుముందుకు వచ్చారు. దీంతో గృహ నిర్మాణ శాఖపై రూ.264.60కోట్ల భారం తగ్గినట్లయింది.

బాలికల విద్యాశాతం పెంపునకు ప్రభుత్వం కృషి

రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌కు తెలిపిన ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



మనతెలంగాణ/న్యూఢిల్లీ : బాలికల విద్యా శాతాన్ని పెంచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని భారత రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి వివరించారు. శుక్రవారం భారత రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ తో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటిలో భాగంగా బాలికల విద్యాభివృద్ధిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తోన్న కృషిని భారత రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కు ముందు రాష్ట్ర వ్యాప్తంగా బాలికల డ్రాపవుట్లు అధికంగా ఉండేవని, కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ బాలికల డ్రాపవుట్లపై ప్రత్యేక సర్వే నిర్వహించారని రాష్ట్రపతికి వివరించారు. ఈ దిశలోనే ప్రాథమిక స్థాయి నుంచి, ఉన్నత విద్యనభ్యసించే దిశలో బాలికల డ్రాపవుట్లు పెరుగుతున్నాయని గమనించినట్లు రాష్ట్రపతి కి వివరించాలని కడియం శ్రీహరి తెలిపారు. అందుకోసమే రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 470 గురుకుల పాఠశాలలను ప్రారంభించామని రాష్ట్రపతికి తెలిపారు. దేశంలోనే తొలిసారిగా కేవలం ఎస్సీ, ఎస్టీ మహిళల కోసం 53 రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కు వివరించినట్లు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. దేశ వ్యాప్తంగా విద్యాభివృద్ధి, బాలికల విద్యా వ్యాప్తి కోసం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ఈ సందర్భంగా రాష్ట్రపతి అడిగి తెలుసుకున్నారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బాలికల విద్యపై దృష్టిపెట్టాల్సి ఉందని రాష్ట్రపతి సూచించారని ఉప ముఖ్యమంత్రి అన్నారు. పాఠశాలల్లో, కాలేజీల్లో బాలికల ఎన్‌రోల్‌మెంట్ పెంచాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఈ సందర్భంగా రాష్ట్రపతి గుర్తు చేశారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. భారత రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరితో పాటు, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు ప్రొఫెసర్ సీతారాం నాయక్ లు ఉన్నారు

కానిస్టేబుల్ పదోన్నతులకు

హైకోర్టు బ్రేక్

జిఓను నిలిపివేయాలని ఆదేశం

మన తెలంగాణ/హైదరాబాద్ : కానిస్టేబుల్ పదోన్నతుల మార్గదర్శకాలపై ఈ నెల 6వ తేదీన హోంశాఖ జారీ చేసిన జిఒ 19ని తాత్కాలికంగా నిలిపివేయాలని హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. పదోన్నతుల వివాదంపై మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ జిఒ ఆధారంగా పదోన్నతుల జాబితాలో ఎఆర్‌లో పనిచేసిన మొత్తం పనిదినాలను పరిగణలోకి తీసుకోకుండా కేవలం సగం పనిదినాలనే లెక్కించడం వల్ల తాము నష్టపోతున్నామని సివిల్ విభాగానికి బదిలీ అయిన పలువురు ఎఆర్ కానిస్టేబుళ్లు జిఒను సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించడంతో దానిపై విచారణ జరిపిన హైకోర్టు ఆ జిఒను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది. తుది తీర్పు వెలువడేవరకు జిఓను అమలు చేయరాదని స్పష్టం చేసింది.

కాగా పదోన్నతుల విషయంలో మొదటి నుంచి తమకు అన్యాయం జరుగుతోందని పలువురు ఎఆర్ కానిస్టేబుళ్లు మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎఆర్ నుంచి సివిల్‌కు బదిలీ అయిన ఐదేళ్ల తరువాత తమకు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతులు కల్పించాలని గతంలో ఉత్తర్వులు ఉన్నాయని, ఈ ఉత్తర్వులను కాదని కొత్త మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులు తీయడం సబబు కాదని మంత్రికి వివరించారు. రాష్ట్రం విభజన జరిగిన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో సివిల్‌కు బదిలీ అయిన ఎఆర్ కానిస్టేబుళ్లకు పాత ఉత్తర్వుల మేరకే పదోన్నతులు కల్పించారని వారు గుర్తు చేశారు. ఇక్కడ కూడా అదే పద్ధతిలో తమకు న్యాయం చేయాలని కోరారు.ఈ విషయంపై ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఇదిలావుండగా హైకోర్టు శుక్రవారం జిఒను ఆపాలని ఉత్తర్వులు జారీ చేయగా గురువారమే పదోన్నతులు ఇచ్చినట్లుగా పాత తేదీలతో ఆయా జిల్లాల ఎస్‌పిలు, కమిషనర్లు పదోన్నతులు జాబితా విడుదల చేశారని పలువురు ఎఆర్ కానిస్టేబుళ్లు ఆరోపించారు.



భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్

ఎఐటియుసి డిమాండ్

మన తెలంగాణ / హైదరాబాద్ : భవననిర్మాణ రంగంలో పని చేస్తున్న 60 ఏళ్లు నిండిన కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా కనీసం రూ.3 వేల నెలకు) పెన్షన్, కుటుంబానికి హెల్త్‌కార్డులు, డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందకపోవడం వల్ల వారి కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని యూనియన్ విమర్శించింది. బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గన్నారపు రమేష్ అధ్యక్షతన ఎఐటియుసి కార్యాలయంలో శుక్రవారం జరిగింది. సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎస్.కె.లతీఫ్, యం. రాంమోహన్, కార్యదర్శులు ఎం.నరసింహ్, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

సిఎం కెసిఆర్ జన్మదినోత్సవానికి భారీ ఏర్పాట్లు



మన తెలంగాణ/ హైదరాబాద్ : టిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జన్మదినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు టిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో బర్త్‌డే ఉత్సవాలు ప్రారంభించారు. టిఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఉదయం పది గంటలకే టిఆర్ఎస్ యువజన విభాగం, టిఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వేడుకలకు సన్నాహాలు చేశారు. ఇందులో భాగంగా రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భారీ కేక్‌ను కూడా సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పట్నం మహేందర్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపి కల్వకుంట్ల కవిత,టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జె.సంతోష్‌కుమార్, ఎంఎల్‌సి శంభీపూర్ రాజు హాజరుకానున్నారు. నానక్‌రామ్‌గూడ చిత్రపురిలో ఉదయం 8.45 గంటలకే ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారు. అలాగే కెసిఆర్ సేవా దళం ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12.30 గంటలకు తెలంగాణ భవన్‌లో జరిగే రక్తదాన శిబిరానికి ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి ఎస్.వేణుగోపాలచారి, డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్ తదితరులు పాల్గొంటారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జలవిహార్‌లో ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. ఉదయం తొమ్మిది గంటలకు సికిందరాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆయుష్షు హోం నిర్వహిస్తున్నారు. ఇందులో ఎంపి కవిత పాల్గొంటారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వద్ద ఉదయం జరిగే వేడుకల్లో ఎంఎల్‌ఎ కిషోర్, ఎస్‌సి,ఎస్‌టి కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్, టిఎస్‌టిఎస్ చైర్మన్ రాకేశ్‌లు పాల్గొంటారు.

విదేశాల్లో వేడుకలు

సిఎం కెసిఆర్ జన్మదినానికి ఒకరోజు ముందే విదేశాల్లో కూడా వేడుకలు ప్రారంభమయ్యాయి. కెసిఆర్ అభిమానులు, టిఆర్ఎస్, జాగృతి శాఖల ఆధ్వర్యంలో పలు దేశాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. న్యూజిలాండ్, బహరెయిన్‌లలో శుక్రవారమే రక్తదానం చేశారు.

కువైట్ ప్రవాసీలకు విమాన టికెట్లు ఇప్పించిన కాంగ్రెస్



మన తెలంగాణ/హైదరాబాద్: కువైట్ క్షమాబిక్ష పథకంలో స్వదేశానికి వెళ్ళడానికి విమాన టికెట్లకు డబ్బులు లేక ఇబ్బందిపడుతున్న 100 మంది పేద ప్రవాసి కార్మికులకు కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉచిత విమాన ప్రయాణ టికెట్లు ఇస్తున్నామని కుంటియా తెలిపారు. కువైట్ ప్రభుత్వం ప్రకటించిన ఆమ్నెస్టీ (క్షమాబిక్ష) పథకంలో వాపస్ రావాలనుకుని ఇబ్బందులు పడుతున్న ప్రవాస భారతీయ కార్మికులకు భరోసా, నైతిక మద్దతు కల్పించడానికి కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందం కువైట్ లో పర్యటిస్తున్నది. ఈ సందర్భంగా కుంటియా మాట్లాడుతూ టికెట్లు ఇస్తానని ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం ప్రవాసీలను మోసగించిందన్నారు.

కాంగ్రెస్ బస్సుయాత్ర షెడ్యూలుపై తర్జనభర్జనలు

మన తెలంగాణ / హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ ఈనెల 26 నుండి ప్రారంభించాలని తలపెట్టిన బస్సు యాత్ర షెడ్యూలుపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. మొదటి విడతగా 26 నుండి మార్చి 11వ తేదీ వరకు వరుసగా బస్సుయాత్ర నిర్వహించాలని తొలుత ప్రతిపాదించారు. అయితే మధ్యలో మార్చి 2న హోళి, వరుసగా 3,4 తేదీలలో పెద్ద ఎత్తున పెళ్ళిళ్ళు ఉండడంతో కాంగ్రెస్ నాయకత్వం డైలమాలో పడింది. దీంతో వరుసగా మూడు రోజులు బ్రేక్ ఇస్తే ఎలాగ ఉంటుందని ఆలోచిస్తున్నారు. అయితే, ఇప్పటికే యాత్ర ఒక్క విడత కాకుండా బడ్జెట్ సమావేశాలకు విరమం ఇచ్చి ఆ తరువాత ఏప్రిల్‌లో రెండవ విడత చేపట్టాలనుకోవడం, మళ్ళీ యాత్ర మొదలైన మూడు రోజులకే బ్రేక్ ఇస్తే స్ఫూర్తి దెబ్బతింటుందేమోనని కొందరు నాయకులు అభిప్రాయపడుతున్నారు.

దీంతో ఒక దశలో యాత్రను బడ్జెట్ సమావేశాల తరువాతనే ప్రారంభించి మొత్తం ఒకే విడతలో పూర్తి చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన కూడా జరిగింది. కాని ఈ నెలలో ప్రారంభిస్తామని వాయిదా వేసుకుంటే తప్పుడు సంకేతాలు వెళ్తాయనే ఉద్దేశ్యంతో సూత్రప్రాయంగా ఈ నెల 26 నుండి ప్రారంభించాలనుకుంటున్నారు. మార్చి మొదటి వారంలో మూడు రోజుల విరామంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఒకటి రెండు రోజుల్లో వీటన్నిటిపై ఒక స్పష్టత వచ్చాక అధిష్ఠానం వద్ద గ్రీన్ సిగ్నల్ తీసుకొని యాత్ర షెడ్యూలును ప్రకటించే అవకాశం ఉంది.

స్టీరింగ్ కమిటీలో తెలంగాణకు మొండిచేయి

త్వరలో జరగనున్న ప్లీనరీకి సన్నాహంగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ స్థానంలో శుక్రవారం ఎఐసిసి ప్రకటించిన స్టీరింగ్ కమిటీలో తెలంగాణకు చోటు లభించలేదు. సిడబ్ల్యుసిలో రాష్ట్రం నుండి సీనియర్ నాయకులు ఎస్.జైపాల్‌రెడ్డి, డాక్టర్ జె.గీతారెడ్డి పేర్ల వినిపించాయి. అయితే, తాజాగా 34 మంది సభ్యుల స్టీరింగ్ కమిటీలో రాష్ట్రం నుండి ఎవరి పేరు లేదు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ డాక్టర్ ఆర్.సి.కుంటియాకు మాత్రం అందులో చోటు లభించింది.

మాట తప్పితే అతివాదం.. తీవ్రవాదం

జనసేన అధినేత పవన్



మన తెలంగాణ/హైదరాబాద్ : మాట ఇచ్చి తప్పించుకుంటే ఆ ప్రభావం నేటితరంపై పడదేమో కానీ, రానున్న తరంపై మాత్రం గణనీయంగా పడుతుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. దీంతో రానున్న కాలంలో దేశ సమగ్రతను భంగం కలిగించడంతో పాటు అతివాదం, తీవ్రవాదాలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో శుక్రవారం జెఎఫ్‌సి సమావేశమైంది. ఈ భేటీలో లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ్, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, సిపిఐ నుంచి కె. రామకృష్ణ, సిపిఎం నుంచి మధు, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, మాజీ ఉన్నతాధికారులు పలువురు రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్యావేత్తలు, న్యాయకోవిదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ మీడియాతో మాట్లాడుతూ సంయుక్త నిజనిర్ధారణ కమిటీ (జెఎఫ్‌సి)తో కలిసి పనిచేసేందుకు చాలా మంది సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. జెఎఫ్‌సి సమావేశాలు ఇక నుంచి వరుసగా జరుగుతాయన్నారు. పార్లమెంటరీ వ్యవస్థలో మాట ఇచ్చి వెనక్కి వెళ్లిపోతే బాగుండదన్నారు. మీరు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేనప్పుడు చట్టాలను నేనెందుకు పాటించాలని ప్రతీ ఒక్కరిలో తిరుగుబాటు ధోరణి వస్తుంది. ప్రాథమిక సమస్యలను పరిష్కరించకపోవడమే వేర్పాటువాద ఉద్యమాలకు ఊపిరిపోస్తుందన్నారు. ఉత్తరాది, దక్షిణాది పౌరులమంటూ వీడిపోవాల్సి వస్తుందన్నారు. ఇదే విషయాన్ని గతంలో బిజెపి ప్రధాని అభ్యర్థిగా ఉన్నపుడు మోడికి గాంధీనగర్‌లో చెప్పినట్లు తెలిపారు. ఇతర పార్టీల నేతలు కొన్ని రోజుల తర్వాత కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. విభజన చట్టం హామీలపై ఎవరి దారిలో వారు పోరాటం చేస్తారన్నారు. అందరి ప్రయత్నం రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని వివిధ పార్టీల నేతలు స్పష్టం చేశారు. జెఎఫ్‌సి భేటీకి ముందు పవన్ ట్యాంక్‌బాండ్ వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు ఆర్పించారు.



ఉపాధి హామీ పనుల పరిశీలన

మనతెలంగాణ/ కొండమల్లెపల్లి : కేంద్ర ప్రభుత్వం నిధులతో ప్రవేశపేటబడిన ఉపాధిహామీ పథ కాల పనితీరును కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ సారధ్యంలోని నేషనల్ లేవల్ మానిటా రింగ్ బృందం సభ్యులు జ్ఞానసుందర్, ప్రత్యూషలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుమ్మ డవెల్లి , చింతకుంట్ల, చెన్నారం గ్రామాల్లో ఉపాధి నిధులతో రైతులు సాగుచేస్తున్న బత్తాయి, నిమ్మతో టలను, ఎన్ఆర్ఎం పనులను పరిశీలిం చారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్వహించ బడుతున్న పథకాల పనితీరును రైతులు, స్థానికులను అడిగి తెలుసుకు న్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజల,రైతుల అభివృద్ధి కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని ఆ నిధులతో పండ్ల తోటల సాగును చేప డితే సాగుకు ఖర్చు ఉపాధి నిధుల నుండి అందిస్తుందన్నారు. రైతులు ప్రభుత్వ పథకా లను సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ఏపీడీలు రవిందర్, ముత్తాయ్య, యంపీడీవో విజ యలక్ష్మీ , ఏపివో రాంచంద్రం ఐకెపి ఏపీఎం శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ సీతారాం, ఆర్‌డబ్ల్యాస్ ఏఈ నగేష్, సర్పంచ్ ఆదిరాల రాము, ఈవోలు వీరా బాబు, మల్లారెడి, ఐసీడీఎస్ సూపర్‌వైజార్ చిట్టమ్మ, ఫీల్డ్ అసి స్టెంట్ సత్యనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నగరవాసులకు ఇక ఆర్గానిక్ కూరగాయలు

- **మన కూరగాయల మార్కెట్ ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్**

మన తెలంగాణ/ బేగంపేట్ : హైదరాబాద్ నగరంలోని ప్రజలకు ఇకనుండి ఆర్గానిక్ కూరగాయలను సరఫరా చేసేందుకు టిఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించుకుంది. అందులో భాగంగానే సనత్‌నగర్ నియోజకవర్గంలోని బేగంపేట్ డివిజన్‌లో పాటిగడ్డలో తెలంగాణ ప్రభుత్వం నూతనంగా నూతనంగా నిర్మించిన మాడల్ మార్కెట్ ప్రాంగణంలో తెలంగాణ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మన కూరగాయల మార్కెట్‌ను రాష్ట్ర మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మేయర్ బొంతు రాంమోన్‌లు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ నగరవ్యా ప్తంగా 50 మోడల్ మార్కెట్లను నిర్మించినట్లు తెలిపారు. మనకూరగాయల మార్కెట్‌లో డైరెక్టుగా రైతుల నుండి వచ్చిన కూరగాయలను అందించే విధంగా చర్యలు తీసు కున్నట్లు తెలిపారు. నగరం చుట్టూ సేంద్రీయ కూరగాయ లను పండించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుం దని చెప్పారు. అలా పండించిన కూరగాయలను దళా రుల బెడద లేకుండా నేరుగా మన కూరగాయల మార్కెట్ ద్వారా తక్కువ ధరలకే అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. రైతులుగా వినయోగ దారులకు మేలుకలిగే విధంగా ఈ కూరగాయలను అందించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాటిగడ్డలో జిహెచ్ఎంసి కార్మికులకు పనిముట్లను మంత్రుల చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ కార్యక్ర మంలో బేగంపేట్ కార్పొరేటర్ ఉప్పల తరుణి, మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మి భాయి, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ శంకర్‌రావు, డిసి. శైలజా, హైజింగ్ ఈఈ వెంకట్ దాస్, టౌన్‌ప్లానింగ్ ఎసిపి. రాజేందర్ యాదవ్, హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, స్థానిక నాయకులు నరేం దర్ రావు, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాగేందర్, యాదగిరి గౌడ్, బోయినిపల్లి మార్కెట్ డైరెక్టర్ మహ్మద్ అఖీల్ హమ్మద్, అక్బర్, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

బస్తీలలో పర్యటన..

సనత్‌నగర్ నియోజకవర్గంలోని రాంగోపాల్‌పేట్ డివిజన్ లోని వెంగళ్‌రావు నగర్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణం పనులను మంత్రి పలు శాఖల అధికారులతో కలిసి బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఇరుకైన ఇళ్ళలో నివసిస్తూ ఇబ్బం దులు పడుతున్న తరుణాన్ని గమనించిన ముఖ్యమంత్రి కెసిఆర్ పేదలంతా ఆత్మగౌరవంగా విశాలమైన గదులలో జీవించాలనే ఆలోచనతో పేదలకు రెండుపడకల గదు లను నిర్మించి ఇస్తున్నాడని మంత్రి టి. హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా సన త్‌నగర్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మా ణాలు జరుగుతున్నాయని అలాగే వెంగళ్‌రావు నగర్‌లో కూడా డబుల్ బెడ్ రూం ఇళ్ళు నిర్మించడానికి కాలసిన ఏర్పాట్లను చేస్తున్నామని తెలిపారు.





గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

మన తెలంగాణ/ బాన్సువాడ (కామారెడ్డి జిల్లా): గిరిజనుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, వారి అభ్యున్నతికి పాటు పడు తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు, శుక్రవారం బాన్సువాడ పట్టణంలో జరిగిన సేవాలాల్ మహ రాజ్ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అంతకు ముందు సేవాలాల్ మారాజ్ విగ్రహా నిర్మాణానికి గాను మంత్రి సాయికృప నగర్ ప్రాంతంలో భూమి పూజ చేశారు. అనం తరం ఆయన మాట్లాడుతూ, గిరిజనులకు సేవాలాల్ మారాజ్ ఆరాధ్య దైవమన్నారు. ఆయన చూపిన బాటలోనే నేటికి ముందుకు పోతున్నా రని చెప్పారు. గిరిజనులకు కావాల్సిన రిజర్వేషన్‌తో పాటు నిరుపేద లకు డబుల్ బెడ్ రూం ఇండ్లు, సబ్సిడీపై రుణాలను అందించడం జరు గుతుందని తెలిపారు. గిరిజనుల కోసం రాబోయే రోజుల్లో ప్రభుత్వం సంక్షేమాన్ని కాంక్షించి పలు కార్యక్రమాలను చేపట్టబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బద్యానాయక్, కిషన్ నాయక్, పోచారం బాస్కర్ రెడ్డి, పోచారం సురేందర్ రెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

భార్య పరిస్థితి విషమం

మన తెలంగాణ/ భూపాలపల్లి టౌన్ జిల్లా : మండలంలోని మోరం చపల్లి గ్రామం వద్ద ఇసుక లారీ, బైక్ ఢీకొనడంతో బైక్‌పై భూపాలపల్లి నుంచి పరకాల వైపు వెళ్తున్న కంచం రవీందర్(38), చంద్రకళ(33) దంపతులకు తీవ్రంగా గాయలై భర్త అక్కడిక్కడే చనిపోగా, భార్యకు సైతం త్రీవ గాయాలయ్యాయి. దీంతో ఆమెను 108 వాహనంలో ఎంజిఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ఆమె పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. కంచం రవిందర్ భూపాల పల్లిలోని సంఘమిత్ర కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా విధులు నిర్వ హిస్తున్నారు. స్వంత గ్రామం అన్‌సాన్‌పల్లి, మలహల్ మండలం చెందిన అతనికి ఒక కుమారుడు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ వారు మృతునికి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా ఇచ్చే వరకు ధర్నా విరమించమని ఆందోళన చేయ డంతో ఆర్డీఓలు అందరూ అక్కడికి చేరుకొని న్యాయం చేస్తామని వారికి నచ్చజెప్పడంతో వారు ధర్నా విరమించారు.

సమస్యల పరిష్కారానికై వంటావార్పు

టిజెఎసి చైర్మన్ ప్రొ. కోదండరాం

మనతెలంగాణ/ జవహర్‌నగర్ : సమస్యల పరిష్కారమే రాజకీయం అని ఆదిశగా మనం రాజకీయాలు చేయాలని టిజెఎసి చైర్మన్ ప్రొ. కోదండరాం అన్నారు. మేడ్చల్ జిల్లా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కాప్రా మండలం జవహర్‌నగర్ దళిత సంక్షేమ భవన్‌లో మేడ్చల్ నియోజకవర్గ జెఎసి చైర్మన్ మేడ రవి ఆధ్వ ర్యంలో నిరుద్యోగుల రైతుల సదస్సు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొ.కోదండరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్ల పాలనలో టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదని, రాష్ట్రంలోనే జవహర్‌నగర్ అతి పెద్ద మురికివాడని, ఇక్కడ అత్యధికంగా పేద ప్రజలు నివసిస్తున్నా రని వారికి ప్రభుత్వం జీవో 58,59 ప్రకారం అర్హులైన వారికి ఇండ్ల పట్టాలు ఇచ్చి, మిగితా ఇండ్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశా రు. చెత్త డంపింగ్‌యార్డ్‌తో 36 గ్రామాల ప్రజలు సతమతమవుతున్నా రని, ఈ సమావేశంలో జిల్లా చైర్మన్ చీమ శ్రీనివాస్, కన్వీనర్ లక్ష్మా రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రజలంతా కాంగ్రెస్ పక్షమే!

- **సిఎల్‌పి ఉపనేత, ఎంఎల్ఎ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**



మనతెలంగాణ/ కొండమల్లెపల్లి : రానున్న సాధారణ ఎన్నికలలో నల్లగొండ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉంటా నని సిఎల్పి ఉపనేత నల్లగొండ ఎమ్మెల్యే కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నల్లగొండ రోడ్డులో డిసిసి ప్రధాన కార్యదర్శి పస్నూరీ యుగేందర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురా వడంతో పాటు రా హుల్‌గాంధీ ప్రధానిని చేయ డమే లక్ష్యంగా కాం గ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త సైని కుడిలా పని చేయాలన్నారు. నల్లగొండ పార్ల మెంట్ స్థానం నుంచి పోటీలో ఉండి భారీ మెజా ర్టీతో విజయం సాధించి నల్లగొండ ఉమ్మడి జిల్లా పరిధిలోని 12 నియోజకవర్గాలను కాంగ్రెస్ భారీ మెజారిటీతో కైవసం చేసుకోవడం ఖాయమన్నా రు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. రాజకీ యంగా తనను ఎదుర్కోలేకనే నల్లగొండ మున్సి పాల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి భర్త శ్రీనివాస్‌ను దారుణంగా హత్య చేశారన్నారు. శ్రీనివాస్ హత్య కేసును సిబిఐ విచారణ చేపట్టనుందని దీంతో నిజ నిజాలు బయటికి వస్తాయన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న సాయిబాబ ఆలయంలో సాయిబాబను ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కేతావత్ జగన్‌లాల్ నాయక్, జిల్లా నాయకులు కేతావత్ బిల్యానా యక్, వడ్త్యా రమేష్‌నాయక్, నేనావత్ కిషన్‌నా యక్, గుంజ రేణుకనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉట్కూరీ వేమన్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని ఒకటో టౌన్ సిఐకి మెమో జారీ





మనతెలంగాణ/ గోదావరిఖని: కరీంనగర్ జిల్లా గోదావరిఖని పట్టణంలోని సిఎస్‌పి కాలనీకి చెం దిన స్వాతి(28) అనే మహిళ గురువారం రాత్రి తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, బంధువుల సమాచారం మేరకు గత సంవత్సరం డిసెంబర్ 26న స్వాతి 4సంవత్సరాల కుమార్తెను అదే కాలనీకి చెందిన అక్రమ బెల్టు షాప్ నిర్వాహకుడు సమ్మయ్య కుమారుడు అబ్బు లు అత్యాచారం చేశాడని, న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా సిఐ అవమానించాడని తెలిపారు. అబ్బులు తరుచూ స్వాతి ఇంటిమీదకు వచ్చి గొడ వలు పెడుతూ బెదిరింపులకు గురిచేసేవాడని, ఈ విషయంపై ఫిర్యాదు చేయడానికి స్వాతి వెళితే సిఐ అవమానకరంగా మాట్లాడడంతో తనకు న్యా యం జరగలేదని తీవ్ర మనస్థాపానికి గురై తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని బం ధువులు పేర్కొన్నారు. దళిత మహిళ విషయంలో సిఐ నిర్లక్ష్యంగా వ్యవహరించాడని ఆరోపిస్తూ దళి త సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. సిఐపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో 1టౌన్ సిఐ గజ్జి క్రిష్ణకు మెమో జారీ చేసి విఆర్‌కు అటాచ్ చేసినట్లు సీపీ తెలి పారు. బాధితులకు అండగా ఉంటామని, నిందితు లకు శిక్ష పడేలా చూస్తామని రామగుండం సిపి విక్రంజిత్ దుగ్గల్ హామీ ఇవ్వడంతో దళిత సంఘాలు ఆందోళన విరమించారు.

'సుబాబుల్' గిట్టుబాటు ధరకు ఆందోళన

- **రైతులకు న్యాయం చేసేంత వరకు ఉద్యమిస్తా : రేణుకాచౌదరి**



మన తెలంగాణ/ ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుమారుగా 2 లక్షల ఎకరా లకు పైగా గత దశాబ్దన్నర కాలంగా రైతులు సాగు చేస్తున్న సుబాబుల్, జామాయిల్ పంటలకు గిట్టు బాటు ధర కల్పించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం వైఫల్యం చెందిందన్నారు. నెల రోజులుగా త మకు గిట్టుబాటు ధర కల్పించాలని సుబాబుల్ రై తులు అఖిలపక్షంగా ఏర్పడి రాష్ట్రంలోని మంత్రు లను ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు కలిసి వి న్నవించిన ఫలితం ఏమాత్రం చూపకపోవడంతో అఖిలపక్షంగా ఏర్పడి బిపిఎల్ కేంద్రాన్ని ముట్ట డించేందుకు పిలుపునిచ్చారు. సుబాబుల్‌కు గిట్టు బాటు ధర కల్పించాలని కోరుతూ బిపిఎల్ ముట్ట డికి అఖిలపక్ష నేతలతో పాటు సుబాబుల్ రైతులు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం బిపిఎల్‌ను మూకుమ్మడిగా ముట్టడించి నిరసన వ్యక్తం చేశా రు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలోని భద్రాచలం పేపర్ లిమిటెడ్ యాజమాన్యం జామా యిల్, సుబాబుల్ రైతులకు న్యాయం చేయాలం టూ కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) న్యూడె మోక్రసీల ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహిం చారు. ఈ ధర్నాను ఉద్దేశించి మాజీ కేంద్ర మం త్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి మాట్లా డుతూ సుబాబుల్ రైతులకు న్యాయం జరిగేంత వరకు ఉద్యమిస్తానని కుండబద్దకొట్టారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు రైతుల ఆత్మహత్య

మనతెలంగాణ/ కాల్వశ్రీరాంపూర్ (కరీంనగర్ జిల్లా): అప్పులు తీర్చలేక మానసికంగా కుంగిపోయిన కౌలు రైతు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్ప డిన సంఘటన కరీంనగర్ జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్ పేట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం నిరుపేదైన చేగొండ రాజయ్య గ్రామంలోని కొంతమంది రైతులకు చెంది 9ఎకరాల భూమిని కౌలుకి తీసుకుని వరి, పత్తి పంటలు సాగుచేశాడు. వర్షాలు లేకపోవడంతో పంటలు చేతికి రాక, పాత అప్పులకు తోడు కొత్త అప్పులు తోడయ్యాయి. దీనికితోడు తన పెద్దకూతురు శ్రీలత వివాహ అప్పులు తోడు కావడంతో అప్పులు తీర్చలేననే బెంగతో, మానసికంగా కృంగిపోయి, తాను సాగుచేస్తున్న పొలంలోనే వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు హెడ్‌కానిస్టేబుల్ జానీ తెలిపారు.

కనపర్తి గ్రామంలో మరొకరు

భూపాలపల్లి/రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కనపర్తి గ్రామానికి చెందిన మునిగాల రాజసమ్మయ్య(59)అనే రైతు తన కున్న ఐదెకరాలలో గత యేడాది పత్తి, మిర్చి పంట సాగుకు రూ. 6 లక్ష లకు పైగా అప్పులు చేశాడు. గిట్టుబడి వచ్చినప్పటికీ గిట్టుబాటు ధర లేక పోవడంతో చేసిన అప్పులు తీరలేదు. దీంతో మనస్తాపం చెందిన రాజస మ్మయ్య శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు పోలీసు లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి

మన తెలంగాణ / షాద్‌నగర్: కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘ టన రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, బూర్గుల గ్రామంలోని గార్డెన్ ఆఫ్ ఈడెన్ వెంచర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల, పోలీసులు తెలి పిన వివరాలు.. అదే గ్రామానికి చెందిన మధుసూదన్(32) గత 15 సంవ త్సరాల నుంచి కాంట్రాక్టు కరెంటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. విధుల లలో భాగంగా శుక్రవారం ఉదయం 9గంటల ప్రాంతంలో ట్రాన్స్ ఫార్మర్ వద్ద మీటరు బిగిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు తీగ అతనిపై పడ టంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

భర్త చేతిలో భార్య దారుణ హత్య

మనతెలంగాణ/ హుజూరాబాద్ టౌన్ : కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని బండఅంకూస్‌వాడకు చెందిన రొంటాల జయంత్‌కు సైదా పూర్ మండలం అమ్మనగుర్తి గ్రామానికి చెందిన శైలజతో 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి అభిషేక్, అమూల్య అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. జయంత్ ఒక వైపు క్రషర్‌లో పనిచేస్తూనే మరో వైపు తమకున్నా 30 గుంటల వ్యవసాయ భూమిలో భార్య భర్తలిద్దరూ వరి పంటను సాగు చేస్తున్నారు. వారం రోజులుగా వారి మధ్య గొడవలు జరిగుతున్నట్లు, ఈ క్రమంలో తమ సొంత వ్యవసాయ పొలంలో మోటార్ రిపేరు చేయించేం దుకు శైలజా వెళ్లగా ఆమె వెనుకనే వెళ్లిన భర్త జయంత్ పారతో ఆమె తలపై కొట్టి హత్యకు పాల్పడినట్లు తెలిపారు. అనంతరం నిందితుడు జయంత్ వెంటనే పోలీసుల సమక్షంలో లొంగిపోయాడు.

మోడీ పాలనలో పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదు

- **సిపిఐ కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి**

మన తెలంగాణ/ మల్కాజిగిరి: మోడీ పాలనలో దేశంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూరలే దని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత వామపక్ష పార్టీ సభ్యులపై దా డులు అధికమయ్యాయని ఆరోపించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సిపిఐ పార్టీ రెండవ మహా సభలను పురస్కరించుకుని శుక్ర వారం మల్కాజిగిరిలోని గాంధీ పార్కులో బహిరంగ సభ నిర్వ హించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అవినీతి జరిగిందని అన్న బిజెపి ఇప్పుడు తమ హయాంలో విజయ్ మాల్యా, నీరవ్ మోదీ వంటి వారు వేల కోట్ల రూపాయలు మోసం చేసి విదేవాలకు పారిపోయారని విమర్శించారు. నోట్ల రద్దుతో సామాన్య ప్రజలుతమ డబ్బులు తాము తీసుకునేందుకు ఇబ్బందులు గురయ్యారు కానీ ధనవంతులకు ఎలాంటి ఇబ్బం దులు తలెత్తలేదని అసహనం వ్యక్తం చేశారు. అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రమేర్పడింది కానీ కెసిఆర్‌తో రాలేద న్నారు. కెసిఆర్ పాలన దొరల పాలనకు నిదర్శనమన్నారు. సిపిఐ పార్టీ ప్రజల పక్షాన ఉంటూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వ్యతిరేక విధానాలపై పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్ర మంలో నాయకులు పల్లా వెంకట్ రెడ్డి, ఎన్. బాల మల్లేష్, వి.ఎస్. బోస్, నర్సింహ్మా, దశరథ్, కృష్ణ మూర్తి, రమణ తదితర నాయకులు పాల్గొన్నారు.



'గీతాంజలి'లో ఇడి సోదాలు

- **మూడువేల కోట్ల విలువ చేసే వజ్రాలు, ఆభరణాలు సీజ్**

మనతెలంగాణ/ మహేశ్వరం: రంగారెడ్డిజిల్లా మహేశ్వ రం మండలం రావిరాలలో గల రాజీవ్ జెమ్స్ పార్కులో గీతాంజలి గ్రూప్ డైమాండ్ జ్యూవెల్లరీ యూనిట్‌లో ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు గురువారం రాత్రి నుంచి సోదాలు చేసి సుమారు మూడువేల కోట్ల విలువ చేసే వజ్రాలు, వజ్రాభరణాలను సీజ్ చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.1140కోట్లు కుచ్చుటోపీ పెట్టిన నిరవ్ మోడి వజ్రాలు వ్యాపారంలో భాగంగా రాజీవ్. ఎమ్స్ సెజ్‌లో 2007 నుండి గీతాంజలి గ్రూపు పేరుతో వజ్రాభరణాలు తయారీ యూనిట్‌ను నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి నుంచి ఇడి అధికారులు సోదాలు చే స్తూ లాకర్లను సీజ్ చేస్తుండడంతో ప్రస్తుతం ఈ యూ నిట్‌లో పని చేస్తున్న 9 వందల మంది కార్మికుల ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హాయాంలో నిరుపేద యువతీ యువకులకు ఉపాధి లభిస్తుందన్న ఉద్దేశ్యంతో ఎపి ఐఐసి ద్వారా దీనిని కేటాయించారు.

అధిక వడ్డీ ఆశ చూపి కుచ్చుటోపి

- **నలుగురు ఫైనాన్స్ వ్యాపారుల అరెస్టు**

మన తెలంగాణ/ మన్సూరాబాద్: అధిక శాతం వడ్డీలు ఇస్తా మని నమ్మించి పెట్టుబడులు పెట్టించుకుని మోసగించిన నలు గురు ఫైనాన్స్ వ్యాపారులను రాచకొండ పోలీసులు శుక్రవా రం అరెస్టు చేశారు. నిందితుల్లో డిస్మిస్ అయిన ఎస్ఐతో పాటు హోంగార్డు ఉండడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వివ రాలను జాయింట్ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించా రు. సూర్యపేట జిల్లా చిల్కూర్ మండలం కొండాపురం గ్రామా నికి చెందిన ఎస్.చిన్న గోపాల కృష్ణ(37) పోలీసు శాఖలో కాని స్టేబుల్‌గా 2006లో చేరాడు. ఆ తరువాత 2009 ఎస్ఐ బ్యా చ్‌కు ఎంపికైన అతడు మంగళహాట్ పోలీసు స్టేషన్‌లో ప్రొబేష నరీ ఎస్ఐగా విధులు నిర్వహించాడు. ఎస్ఐ ఎంపిక సంద ర్భంగా నిర్వహించిన పరీక్షలో కాపీ కొట్టాడని తేలడంతో 2012లో సిఐడి పోలీసులు అరెస్టు చేశారు. అదే ఏడాది హోంశాఖ పోలీసుశాఖ నుంచి తొలగించింది. 2013 నుంచి అతడు బంధువులు, స్నేహితులైన సూర్యాపేటకు చెందిన హోం గార్డు వై. సత్తి(30), ఫొటోగ్రాఫర్ పి.వెంకట్ (37), వ్యాపారి టి.నర్సింహారావు (36)తో పాటు 13 మందితో కలిసి ఫైనాన్స్ వ్యాపారం మొదలు పెట్టాడు. కొత్తపేటలో 'శివం ఎంటర్ ప్రైజె స్' పేరుతో కార్యాలయాన్ని కూడా తెరిచారు. అధిక వడ్డీలు ఇ స్తామని నమ్మించి రైతులు, విద్యార్థులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో వీరి కంపెనీలో భారీగా పె ట్టుబడులు పెట్టించారు. ఆ తరువాత బాధితులకు వడ్డీలు ఇవ్వ కుండా మొండికేశారు. దీంతో సుమారు 20 మంది బాధితులు చైతన్యపురి పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. తాము రూ.3.90 కోట్లు గోపాలకృష్ణ ఏర్పాటు చేసిన ఫైనాన్స్ కంపె నీలో పెట్టుబడులు పెట్టామని అయితే వారు మోసగించారని ఫిర్యాదు చేయగా గోపాలకృష్ణతో పాటు అతని అనుచరులు సత్తి, వెంకట్, నర్సింహారావులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.66 లక్షల విలువైన ఫ్లాట్, కారు, 11 తులాల బంగారం ఖరీదు చేశాడని తేలింది. వీటితో పాటు రూ.13 లక్షల నగదును సైతం పోలీసుల స్వాధీనం చేసుకున్నారు.

సూర్యాపేట మార్కెట్‌కు పోటెత్తిన కందులు




మన తెలంగాణ/ సూర్యాపేట జిల్లా: కంది రైతును కష్టాలు వెంటాడుతున్నాయి. అసలే వర్షాభావంతో అంతంత మాత్రంగా వచ్చిన దిగుబడితో ఆందోళనలో ఉన్న రైతులకు, పండించిన పంటను అమ్ముకోవడం భారంగా మారింది. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ గత వారం రోజులుగా బంద్ ఉండడంతో ఈ ఒక్క రోజే మార్కెట్‌కు దాదాపు 15 వేల బస్తాల కందులు వచ్చాయి. కేవలం నలుగురు సభ్యులు ఉన్న హాకా బృందం ఏమి చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నది... జనవరి 11 నాడు ప్రారంభమైన సూర్యాపేట హాకా సెంటర్‌లో ఇప్పటి వరకు 12400 క్వింటాళ్లు కందులు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన కందులు ఏ రోజువి ఆ రోజే ఎగుమతి కాకపోవంతో గత వారం రోజులుగా మార్కెట్ బంద్ ఉన్నది. దీనితో కందులు ఒకే సారి రావడంతో మార్కెట్ కిక్కిరిసింది. హాకా సిబ్బందిని పెంచి కొనుగోళ్లు త్వరగా జరపాలని రైతులు కోరుతున్నారు. వర్షాలు సరిగా లేని కారణంగా ఈ సారి కంది పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరానికి రెండు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు.... ఇదిలా ఉండగా మద్ధతు ధర కేవలం 5450 రూపాయలు మాత్రమే ఉండటం, పెట్టుబడికే ఎకరానికి 10 వేల రూపాయలు ఖర్చు కావడంతో పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటు కాక కంది రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మద్ధతు ధర ఎనిమిది వేల రూపాయలకు పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సిఎం విడియోసాంగ్ ఆల్బమ్‌ను ఆవిష్కరించిన ఎంపి కవిత

మన తెలంగాణ/హైదరాబాద్: ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదినోత్సవం సందర్భంగా టిఆర్‌ఎస్ యువజన విభాగం రూపొందించిన వీడియోసాంగ్ ఆల్బమ్‌ను నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. సిఎం ఆలోచనకు అనుగుణంగా రూపుదిద్దు కున్న పథకాల వివరాలు, వాటి ఫలాలను తెలియజేసేలా ఆల్బమ్‌ను రూపొందించారని యువ జన విభాగం రాష్ట్ర అధ్యక్షులు,ఎంఎల్‌సి శంభీపూర్ రాజును కవిత అభినందించారు. ఈ కార్యక్ర మంలో కుత్బుల్లాపూర్ ఎంఎల్‌ఎ కె.పి. వివేకానంద గౌడ్, కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ, రావుల శేషగిరి, ఎంపి రఫిక్, టిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నాగరాజు యాదవ్ పాల్గొ న్నారు. ఇది ఇలా ఉండగా కెసిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పాల్గొననున్నారు. ఉదయం 9.00గంటలకు ఉజ్జయిని మహంకాళి అమ్మవారి అలయంలో ఆయుష హోమంలో పాల్గొంటారు. 10 గంటలకు భన్సీలాల్ పేటలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ భూమి పూజకు హాజరవుతారు. 10:30 గంటలకు మెగా రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభిస్తారు.



కేంద్ర సర్వీసులకు ఇద్దరు ఐపిఎస్‌లు


చారుసిన్హా సి.వి.ఆనంద్

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సీనియర్ ఐపిఎస్‌లు సి.వి.ఆనంద్, చారుసిన్హాలు కేంద్ర సర్వీసులకు బదిలీ అయ్యారు. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న సివి ఆనంద్‌ను సిఐఎస్‌ఎఫ్ ఐజిగా, రాష్ట్ర పోలీసు శిక్షణ కేంద్రం ఐజిగా విధులు నిర్వహిస్తున్న చారుసిన్హాను సిఆర్‌పిఎఫ్ ఐజిగా నియమిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఐదేళ్ళ పాటు వీరు కేంద్ర సర్వీసుల్లోనే కొనసాగ నున్నారు. వీరిద్దరూ కేంద్ర సర్వీసులకు వెళ్ళడానికి ఏడాది క్రితమే కేంద్ర ప్రభుత్వానికి తెలిపారు. వీరి విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర హోం మంత్రి త్వ శాఖ ఈ మేరకు ఆదేశాలను జారీచేసింది.

ఎన్నికల కమిషన్ భవనానికి రూ.14కోట్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ఎన్నికల కమిషన్ భవన నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం 14.35 కోట్లు మంజూరు చేసింది. గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 91లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయానికి స్వంత భవనంతో పాటు కమిషనర్ బంగ్లా, నివాససముదాయాలను నిర్మించనున్నట్లు ప్రభుత్వం విడుదల చేసిన జిఒలో పేర్కొన్నారు. కమిషన్ కార్యాలయ భవన నిర్మాణానికి 3.20 కోట్లు, మిగిలిన మొత్తాన్ని కమిషనర్ బంగ్లా, సిబ్బంది నివాస సముదాయాలకు కేటాయించారు.

రికార్డు స్థాయికి విద్యుత్ డిమాండ్

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రం విద్యుత్ డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. గురువారం రికార్డు స్థాయిలో 9,596 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైంది. ఇది తెలంగాణ విద్యుత్ సంస్థల చరిత్రలో సరికొత్త రికార్డు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇంత మేర విద్యుత్ డిమాండ్ కాలేదు. గురువారం నాడు ఉదయం 7.57 గంటలకు 9596 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. సెప్టెంబరు 13, 2017న 9,500 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌తో రాష్ట్రంలో 198 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేశారు. ఈ రికార్డును గురువారం ట్రాన్స్‌కో బ్రేక్ చేసింది. పీక్ సమయంలో మరో 96 మెగావాట్ల డిమాండ్ పెరిగింది. 191 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అయింది. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తుండడంతో అంచనాలను మించి డిమాండ్ నమోదవుతోంది. అయితే ఈ సీజన్‌లో డిస్కంలు 10,500 మెగావాట్ల గరిష్టంగా డిమాండ్ వస్తుందని అంచనా వేశారు. అయితే డిస్కంలు, ట్రాన్స్‌కో మాత్రం 11,500 మెగావాట్ల డిమాండ్ వచ్చినా తట్టుకునేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నాయి. 191.72 మిలియన్ యూనిట్ల డిమాండ్‌లో థర్మల్ విద్యుత్ 80.69 ఎంయు (మిలియన్ యూనిట్లు)లు కాగా, 15.39 ఎంయులు సౌర విద్యుత్ రూపేణా లభించింది.

గోమాతను రాష్ట్రమాతగా గుర్తించాలి

మన తెలంగాణ/హైదరాబాద్: గోమాతను రాష్ట్రమాతగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని డిమాండ్ చేస్తూ 'భారతీయ గౌ క్రాంతి మంచ్' ఆధ్వర్యంలో ఆదివారం ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షులు మహేశ్ అగర్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాంలీలా మైదాన్‌లో జరిగే 'మహాజన ఆందోళన'లో కోటి మంది గోమాత భక్తులు పాల్గొంటారని తెలిపారు.

రేపు హజ్ యాత్రికుల శిక్షణా శిబిరం

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి ఈ నెల 18న హైదరాబాద్‌లో శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ హజ్ కమిటి స్పెషల్ ఆఫీసర్ ఎస్.ఎ.షుకూర్ తెలిపారు. ఓల్డ్ మలక్‌పేట్ లోని హైటెక్ ఫంక్షన్ హాలులో జరిగే ఈ శిక్షణా శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ ప్రారంభించనున్నారు.

మ్యాక్సీ విజన్ ఆసుపత్రికి 'నాభ్' గుర్తింపు

మన తెలంగాణ / హైదరాబాద్ : హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రికి నేషనల్ అక్రిడియేషన్ బోర్డ్ ఆఫ్ హాస్పటల్స్, హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (నాభ్) ఎంట్రి లెవల్ సర్టిఫికేషన్ లభించిందని ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ కాసు ప్రసాదరెడ్డి తెలిపారు. సర్టిఫికేట్ నేపథ్యంలో తమ బాధ్యత పెరిగిందని, రోగి సంరక్షణ, భద్రత, నాణ్యమైన సేవలు, సుశిక్షితులైన సిబ్బంది, నిఘాకు అవకాశం ఏర్పడిందని డాక్టర్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. అసాధారణమైన చికిత్స విధానాల వల్ల ఔట్ పేషంట్ల సంఖ్య పెరిగేందుకు కూడా ఈ సర్టిఫికేట్ దోహదం చేస్తుందని, ఆసుపత్రుల అభివృద్ధికి 'నాభ్' పునాదివంటిందన్నారు. ఈ సర్టిఫికేట్‌ను అందుకోవడానికి మాక్సీ విజన్ ఐ ఆసుప్రతి అన్ని రకాల ప్రమాణాలను కలిగి ఉందనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.

పంచాయతీరాజ్ ఇంజినీర్లపై విచారణ

మన తెలంగాణ/హైదరాబాద్ : నాబార్డు, ప్రధానమంత్రి గ్రామ రోజ్‌గార్ యోజన పథకం రోడ్ల పనుల్లో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఏడుగురు పంచాయతీరాజ్ ఇంజినీర్లపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కరీంనగర్ పంచాయతీరాజ్ డివిజన్‌లో ఏడు రోడ్ల పనుల్లో అక్రమాలకు పాల్పడ్డారని డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.లచ్చయ్య, జె.మధునయ్యలతో పాటు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.శ్రీనివాసరావు, వై.సుదర్శన్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్లు ప్రవీణ్‌కుమార్, జి.మిలింద్, ఇ.జనార్ధన్‌లపై అభియోగాలు నమోదయ్యాయి. ఈ అభియోగాలపై విచారణ కమిషనర్‌గా పదవీ విరమణ చేసిన ఐఎఫ్‌ఎస్ అధికారి సి.సమ్మిరెడ్డి, అడ్వకేట్ శ్రీనివాసరావులను విచారణాధికారులుగా నియమిస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీచేశారు.

కేంద్రాన్ని ప్రసన్నం చేసుకునే ప్రయత్నం : చెరుకు

మన తెలంగాణ/హైదరాబాద్: జిఎస్‌టి పేరుతో రాష్ట్రాలను నిలువుదోపిడీ చేస్తూ, బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వ తీరును ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రశ్నించకుండా ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని 'తెలంగాణ ఇంటిపార్టీ' అధ్యక్షులు డాక్టర్ చెరుకు సుధాకర్ అన్నారు. వచ్చే నెలలో మేధావులతో చర్చించి పార్టీ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి మితిమీరిందని, కెసిఆర్ కుటుంబ ఆస్తుల విలువ రాష్ట్ర బడ్జెట్లో సగానికి చేరుకున్నదని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటి పార్టీ కార్యాలయంలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు చెరుకు సుధాకర్ సమక్షంలో ఇంటి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఆర్‌ఎస్‌లో వసూల్ రాజా సంతోష్‌రావును రాజ్యసభకు పంపించాలని సిఎం కెసిఆర్ భావిస్తున్నారని, ఇప్పటి వరకు ఫ్యామిలీప్యాక్‌గా ఉన్న కెసిఆర్ కుటుంబం ఇక నుంచి జంబో ప్యాక్‌గా మారుతుందని ఎద్దేవా చేశారు. తలుపులు మూసి తెలంగాణ రాష్ట్రాన్ని విభజించారని వ్యాఖ్యానించిన ప్రధాని మోడి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన మేలు ఏమున్నదని ప్రశ్నించారు. ఏపి ప్రత్యేక హోదాకు తమ మద్దతు ఉంటుందన్నారు. తమకు జరుగుతున్న అన్యాయాలపై దక్షిణాది రాష్ట్రాలు కలిసి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

భారత్‌తో మరింతగా ఆయిల్ బంధం

ఇరాన్ దేశాధ్యక్షుడు రౌహానీ ప్రకటన

మక్కామసీదులో ప్రార్థనలు


ఇస్లాం శాంతి దయలను బోధిస్తుంది

అమెరికా అధ్యక్షుడిది దుస్సాహసం



మన తెలంగాణ/ హైదరాబాద్ : భారతదేశంతో తమ చమురు, సహజవాయువు, ఇంధన వనరులను పంచుకునేందుకు ఇరాన్ సిద్ధంగా ఉన్నదని ఇరాన్ దేశాధ్యక్షులు డాక్టర్ హస్సన్ రౌహానీ ప్రకటించారు. రెండు రోజుల హైదరాబాద్ పర్యటనలో భాగంగా నగరంలోని చారిత్రక మక్కా మసీదులో శుక్రవారం జరిగిన ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన భారీ ముస్లిం సమూహాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ "ఇరాన్ చమురు, సహజ వాయువు, ఇందన నిక్షేపాలు అధికంగా ఉన్న దేశం. భారతదేశ అభివృద్ధి, పురోగతి కోసం తమ వనరులను అందించేందుకు సిద్ధంగా ఉన్నామ'ని తెలిపారు. ఇందుకు ఛాబహార్ సముద్ర రేవు మార్గం సుగమం చేస్తుందని, ఈ రేవు అఫ్ఘనిస్తాన్, మధ్య ఆసియా ప్రాంతాలకు కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇరాన్‌లోని ఆగ్నేయ ప్రాంతంలో ఉన్న ఛాబహార్ సముద్ర రేవును భారతదేశం అభివృద్ధి చేస్తోందని, ఇది ఇరాన్, హిందూ మహాసముద్రం నడుమ దగ్గరి సముద్ర మార్గమవుతుందని చెప్పారు. అంతే కాకుండా భారతదేశంలో పారిశ్రామిక, వ్యవసాయ, నూతన సాంకేతిక పరిజ్ఞానం తదితర విభిన్న రంగాల్లో కూడా ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ సహకారం భారత్, ఇరాన్‌ల ఉమ్మడి లక్ష్యాలను సాధించేందుకు ఉపకరిస్తుందన్నారు. భారత్‌తో ధృడమైన ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించాలని ఆశిస్తున్నట్లు రౌహానీ స్పష్టం చేశారు. ఇరు దేశాలు పరస్పర సహకారం ద్వారా అధిక లబ్ది సాధించాలన్నారు. కొన్ని దేశాలు ముస్లింలకు వీసాలు మంజూరు చేసేందుకు ఇష్టపడడం లేదని, కాని ఇరాన్ అన్ని మతాల వారికి వీసాలను మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. భారతీయులకు వీసా నిబంధనలను మరింత సరళీకరిస్తామని, తద్వారా ఇరాన్ పౌరులతో సంబంధ, బాంధవ్యాలు మరింత మెరుగుపడతాయని చెప్పారను. భారతదేశం కూడా ఈ చర్యకు ప్రతిస్పందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచంలో ముస్లింల మధ్య ఐక్యతను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని చెప్పారు.ఇస్లాం వ్యతిరేకులు ముస్లింల మధ్య ఐక్యతను కోరుకోబోరని, ముస్లింలు ఐక్యంగా ఉన్నట్లయితే జెరూసలేంను ఇజ్రాయెల్ రాజధానిగా ప్రకటించేందుకు అమెరికా అధ్యక్షుడు సాహసించేవాడు కాదన్నారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఐక్యంగా ఉన్నట్లయితే ఇలాంది దేశాలు పాలస్తీనాలోని ముస్లింలపై నిరంతర హింసకు పాల్పడేందుకు ధైర్యం చేసేవారు కాదని చెప్పారు. ఈ సంక్లిష్ట సమస్యకు ముస్లింలు తమలో భిన్న తెగల మధ్య విభేధాలను పక్కన బెట్టి, అన్ని తెగలను అంగీకరించినప్పుడే పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రపంచం ముస్లింలను ఉగ్రవాదులు అని అంటుందని, కాని ఇస్లాం అనేది వాస్తవానికి శాంతి, దయలను ప్రబోధించే మతమని పేర్కొన్నారు. ముస్లింలు నమాజ్ చేసే ప్రతీసారీ ఖురాన్ పంక్తులైన బిస్మిల్లా హిర్ రహమాన్ నిర్ రహీమ్ అంటారని, అంటే ఇస్లాం మతం శాంతి కోరుకుంటుందని స్పష్టం చేస్తుందన్నారు. అమెరికాలో ఒక మాజీ విద్యార్థి ఇతర విద్యార్థులను చంపడాన్ని ప్రస్తావిస్తూ పశ్చిమ దేశాలు, అమెరికాలో పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలలో, ప్రజలను సామూహికంగా హత్య చేస్తారని, అంటే అమెరికా మానవత్వ దివిటి కానే కాదని, అలాగే మానవ సంక్షేమాన్ని ప్రోత్సహించేంది కాదన్నారు. భారతదేశంలో సంస్కృతులు సమ్మేళనం, మతాల సామరస్యాన్ని ఆయన కొనియాడారు. ఎలాంటి విశ్వాసాలు ఉన్నప్పటికీ విభిన్న మతాలు శాంతియుతంగా సహజీవనం చేయడాన్ని ఇరాన్ ప్రశంసిస్తున్నదన్నారు. హైదరాబాద్ నగర వాస్తు శిల్పి, చారిత్రక ప్రదేశాలు దక్కన్, భారతదేశం మధ్య చారిత్రక సంబంధాలను సాక్ష్యమన్నారు. హైదరాబాద్ నగరంలో భిన్న విశ్వాసాల సమూహాలు శాంతియుతంగా సహజీవనం చేస్తున్న తీరును ఇరాన్ అధ్యక్షులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారులు ఎ.కె.ఖాన్, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్, హజ్ కమిటీ చైర్మన్ మసీఉల్లా ఖాన్, ఇస్లామిక్ పండితులు పాల్గొన్నారు. అంతకుముందు ఇరాన్ అధ్యక్షులు రౌహానీ ఖుతుబ్ షాహీ టూంబ్స్‌ను సందర్శించి హైదరాబాద్ వ్యవస్థాపకులకు ఘన నివాళి అర్పించారు. సాయంత్రం 4 గంటలకు హోటల్ తాజ్ కృష్ణలో భారత్‌లో స్థిరపడ్డ ఇరానీయులతో ఇరాన్ అధ్యక్షులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.రెండు రోజుల పర్యటన ము గించుకున్న ఇరాన్ అధ్యక్షులు సాయంత్రం 5.30 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయం నుం చి ఢిల్లీకి బయల్దేరారు. ఇరాన్ అధ్యక్షుడికి బేగంపేట విమానాశ్రయంలో అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.

కోర్టులో పురుషోత్తమరెడ్డి లొంగుబాటు



మన తెలంగాణ/హైదరాబాద్ : ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో ఎసిబి అధికారులకు పక్షం రోజుల నుంచి పట్టుబడకుండా తప్పించుకు తిరుగుతున్న హెచ్‌ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తమరెడ్డి నాటకీయ పరిణామాల మధ్య శుక్రవారం నాంపల్లిలోని ఎసిబి ప్రత్యేక న్యా యస్థానంలో లొంగిపోయారు. మెజిస్ట్రేట్ 14 రో జుల జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో ఎసిబి అధికారులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. పురుషోత్తమరెడ్డిని మరింత లోతుగా విచారించాల్సి ఉందని భావిస్తున్న ఎసిబి అధికారులు పోలీసు కస్టడీకి అప్పగించాల్సిందిగా కోర్టులో పిటిషన్ వేయాలని ఆలోచిస్తున్నారు. పురుషోత్తమరెడ్డి తన అక్రమ ఆస్తులను తెలివిగా బినామీ పేర్ల పై పెట్టాడని, ఇప్పటికే అతని ఇద్దరు బినామీలు నిశాంత్‌రెడ్డి, యాదవ్‌రెడ్డిలను ఎసిబి అధికారులు అరెస్టు చేసి జైలుకు తరలించామని, వారి కార్యాలయాలు, ఆస్తులపై సోదాలు నిర్వహించి కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని ఏసిబి పోలీసులు వ్యాఖ్యానిస్తున్నారు. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ పురుషోత్తంరెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణ లో ఉండగానే నాటకీయ పరిణామాల మధ్య ఎసి బి కోర్టులో లొంగిపోవడ, అదే సమయంలో అత ని కుటుంబ సభ్యులకు చెందిన బ్యాంక్ లాకర్లను శుక్రవారం తెరిచి పరిశీలించడం వెంటవెంటనే జరిగిపోయా యి. బ్యాంకు లాకర్లలో భారీ గా వజ్రాలు, నగలు లభ్యమయ్యాయని, వీటి విలువ కో ట్లాది రూపాయలు ఉంటుందని, ఇప్పటివరకు ఎసిబి దాడుల్లో సుమారు 50 కోట్లకుపైగా ఆస్తులను స్వాధీనం చేసుకున్నామని ఏసిబి అధికారులు పేర్కొన్నారు. పలువురు బడా బిల్డర్లతో వ్యాపారాల్లో భాగస్వామిగా ఉండి పెట్టుబడులు పెట్టినట్లు ఎసిబి అధికారులకు కొన్ని ఆధారాలు లభ్యమయ్యాయి. కస్టడీలోకి తీసుకుని మరింత లోతుగా విచారిస్తే కొత్త సమాచారం వెలుగులోకి వస్తుందని ఏసిబి అధికారులు భావిస్తున్నారు.

ఎసిబి కస్టడీకి పురుషోత్తమరెడ్డి బినామీలు


నిశాంత్‌రెడ్డి యాదవరెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్:హెచ్‌ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తమరెడ్డి కేసులో చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న అతని బినామీలైన ఇద్దరు బిల్డర్లు నిశాంత్‌రెడ్డి, యా దవరెడ్డిలను ఎసిబి అధికారులు కస్టడీలోకి తీ సుకున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన పురుషోత్తంరెడ్డి కేసులో అతని బినామీలైన నిశాంత్‌రెడ్డి, యాదవరెడ్డిలను ఇటీవల ఎసిబి అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంగ తి తెలిసిందే. హబ్సిగూడలోని ఉన్న వీరిద్దరి కార్యాలయాల్లో ఎసిబి అధికారులు సోదాలు చేయగా కీలక డాక్యుమెంట్లు లభ్యం కావడంతో మరింత లోతుగా విచారించాలని ఎసిబి ప్రత్యేక కోర్టులో పోలీసులు కస్టడీ పిటిషన్‌ను వేయగా, నాలుగు రోజుల కస్టడీని మంజూరు చేస్తూ మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో చంచల్‌గూడ జైలులో ఉన్న నిశాంత్ రెడ్డి, యాదవరెడ్డిలను ఎసిబి అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు.

నేరేళ్ల బాధితులకు న్యాయం చేయాలి

వామపక్షాలు, తెలంగాణ జెఎసి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్



మన తెలంగాణ / హైదరాబాద్ : నేరేళ్ల ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని వామపక్షాలు, తెలంగాణ జెఎసి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు వామపక్షాలు, తెలంగాణ జెఎసి నాయకుల ప్రతినిధి బృందం హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డిని శుక్రవారం నివాసంలో కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, టిజెఎసి చైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, వామపక్షాల నాయకులు కె.గోవర్ధన్ (సిపిఐ(ఎంఎల్ న్యూడెమాక్రసీ), ఎం.ఆదిరెడ్డి (సిపిఐ), భూతం వీరయ్య (సిపిఐ ఎంఎల్), చలపతిరావు (సిపిఐ (ఎంఎల్) న్యూడెమాక్రసీ) తదితరులు హోంమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. నేరేళ్ల ఘటనపై డిజిపికి నివేదిక ఇచ్చామని, రాష్ట్రపతి దృష్టికి తీసుకువచ్చామని అయినప్పటికీ బాధితులకు న్యాయం జరగకపోవడం భాధాకరమని చాడ వెంకటరెడ్డి అనంతరం మీడియాతో మాట్లాడుతూ అన్నారు. బాధితులకు వైద్య సహాయాన్ని అందించేందుకు జనవరి 29న తాము వైద్యుల బృందాన్ని పంపితే వారు బాధితుల గాయాలు చూసి నివ్వెర పోయారన్నారు. జిల్లా ఎస్‌పిపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా బాధితులకు ఉద్యోగం లేదా ఆర్థిక సహాయం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ఈ అంశంపై హోంమంత్రి సానుకూలంగా స్పందించారని, విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆయన చెప్పారు. నేరేళ్ల ఘటనలో పోలీసులు అత్యంత దారుణంగా వ్యవహరించారని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. బాధితుల పక్షాన అనేక యాత్రలు చేశామని, వారికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. బాధితులను పోలీసులు ఇష్టానుసారంగా కులం పేరుతో దూషించడం, అనేక రకాల హింసలు పెట్టడం చట్ట విరుద్ధమన్నారు. ఇప్పటికైనా ఇసుక మాఫియాపై ప్రభుత్వం చర్యలు తీసుకోనట్లయితే అన్ని పార్టీలతో కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు.

డ్రైనేజీలో ఏడుగురు కార్మికుల మృతి

ఎపి, చిత్తూరు జిల్లాలో తీవ్ర విషాదం

పలమనేరు : చిత్తూరు జిల్లా పలమనేరు మండలంలోని మొరం గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. శ్రీవెంకటేశ్వర హెచరీస్‌లో భూగర్భ వ్యర్థాలను శుభ్రం చేస్తుండగా ఏడుగురు కార్మికులు వూపిరాడక మృతి చెందారు. శుక్రవారం ఉదయం హేచ రీస్ యాజమా న్యం ఆదేశాలతో కార్మికులు వ్యర్థాలను శుభ్రం చేసేందుకు డ్రైనేజీలోకి దిగారు. అందులోకి వచ్చే వ్యర్థాల్లో రసాయనాల కలవడంతో మొదట దిగిన నలుగురు కార్మికులు అందులోనే స్పృహ కోల్పోయారు. వాళ్లను పైకి లాగేందుకు ప్రయత్నించిన మరో ముగ్గురు కార్మికులు కూడా అపస్మారక స్థితికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు హుటాహుటిన అక్కడకు చేరుకుని మురుగు కాలువ పైకప్పును పెళ్లగించి వారిని వెలికితీశారు. వీరిని చికిత్స కోసం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా నలుగురు మార్గమధ్యలోనే మృతి చెందారు. మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మరో కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో మొరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రభుత్వం రూ.10లక్షలు, హేచరీస్ రూ.15లక్షల పరిహారం చెల్లించనుంది. మృతుల కుటుంబాలను కలెక్టర్ ప్రద్యుమ్న, ఎమ్మెల్సీ దొరబాబు పరామర్శించారు. మృతుల భార్యలకు వితంతు పెన్షన్లు ఇస్తామని కలెక్టర్ ప్రద్యుమ్న హామీ ఇచ్చారు. హేచరీస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.



పెట్టుబడి పథకంపై ప్రభుత్వం కసరత్తు

మన తెలంగాణ/హైదరాబాద్ : పెట్టుబడి పథకానికి అవసరమైన నగదును సమీకరించుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. పథకం అమలు సవ్యంగా సాగాలన్న ఉద్దేశంతో స్వయంగా సిఎం కెసిఆర్ రంగంలోకి దిగి కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీకోసం ప్రయత్నాలు ప్రారంభించారు. రానున్న మే నెల నుంచి ఎకరాకు రూ.4 వేల చొప్పున వ్యవసాయ పెట్టుబడి పథకం కింద 1.62 కోట్ల ఎకరాలకు రూ. 6480 కోట్లు అవసరమవుతుందని ప్రభుత్వం అంచనావేసింది. ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు కూడా పంపింది. వానాకాలం ప్రారంభానికి ముందే అర్హులైన రైతులందరికీ చెక్కుల రూపంలో ఆర్థిక సాయం చేయాలని, ఇందుకు అవసరమైన రూ. 6480 కోట్లను సమకూర్చుకోడానికి ప్రభుత్వం సుదీర్ఘంగా ఆలోచించి చివరకు రిజర్వ్ బ్యాంకు నుంచి అడ్వాన్స్ రూపంలో రుణం పొందాలని అంచనాకు వచ్చింది. ఇంత మొత్తంలో నగదును అందుబాటులో ఉంచడం కూడా ప్రభుత్వానికి పరీక్షగా మారింది. మంత్రులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఈటల రాజేందర్, ఉన్నతాధికారులు ఇటీవల ఢిల్లీ వెళ్లి నగదు కొరత లేకుండా చూడాలని కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీని, ఆర్‌బిఐ అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. అయితే ఆర్‌బిఐ అధికారులు ప్రధాన మంత్రి నరేంద్ర మోడి జోక్యం చేసుకుంటేనే నగదు సమస్య తీర్చవచ్చునని సూచించడంతో ఢిల్లీ పర్యటనలో భాగంగా సిఎం కెసిఆర్ గురువారం కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీని కలిసి వివరించారు. నగదు సమస్య లేకుండా చూడాలని కోరారు. కేంద్రం నుంచి రూ. 2 వేల కోట్ల వరకు నగదు లభ్యత హామీ లభించే అవకాశం ఉందని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు 'మన తెలంగాణ'కు చెప్పారు. దీనికి తోడు నగదు సమీకరణకు రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా చేయాల్సిన ఏర్పాట్లపైనా వీలైన అన్ని అవకాశాలను అన్వేషించాల్సిందిగా అధికారుల సిఎం ఆదేశించినట్లు తెలిసింది. చెక్కులపై అందరికీ ఒకే తేదీ ఇవ్వకుండా వేర్వేరు తేదీలను ఇవ్వడం ద్వారా కొంత వెసులుబాటు లభిస్తుందని అధికారులు ప్రతిపాదించినట్లు తెలిసింది. వీలైనంత వరకు మే నెలలో ఎక్కువ మొత్తంలో నగదును డిపాజిట్ల రూపంలో బ్యాంకుల్లో జమచేసే విధంగా చూడాలని పేర్కొన్నట్లు సమాచారం.

కుమ్మర్లను చట్టసభల్లోకి పంపించాలి

మన తెలంగాణ / హైదరాబాద్ : విద్యా, ఆర్థిక, సామాజిక, ఉద్యోగ, రాజకీయ పరంగా కుమ్మర్లను అభివృద్ధిపథంలోకి తీసుకురావాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యానగర్ బిసి భవన్‌లో జరిగిన కుమ్మర్ల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసం గిస్తూ కుండలు, కూజాలు, పూలకుండీలను వృత్తిదారుల నుంచి కొనుగోలు చేసి అంతరించి పోతున్న కులవృత్తులను, దీనిపై ఆధారపడి జీవిస్తున్నవారికి ఉపాధి కల్పించేలా ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. కుమ్మరి కులాన్ని బిసి బి నుండి బిసి ఎ కు మార్చడం సమంజసంగా ఉంటుందని సూచించారు. జనాభా దామాషా ప్రకారం ఎంఎల్‌ఎ, ఎంపి టి కెట్లు కేటాయించాలని, నామినేటెడ్ పదవులను కూడా కుమ్మర్లకు ఇవ్వాలని కోరారు. కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.జయంత్‌రావు, ఎస్ రామలింగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, ఎలగందుల శ్రీనివాస్, వీరేశం, సత్యనారాయణ, ఎన్.భూపేశ్ సాగర్, ఆర్.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. జయంత్‌రావు మాట్లాడు తూ ఈనెల 17న 3గంటలకు ఉప్పల్ గ్రౌండ్‌లో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు


మైనింగ్ కార్యకలాపాలకు సహకారం

మంత్రులు జగదీశ్ రెడ్డి, జోగు రామన్న వెల్లడి

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో అటవీ ప్రాంతాల్లో మైనింగ్ కార్యకలాపాల నిర్వహణ కోసం తమ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రులు జి. జగదీశ్ రెడ్డి, జోగు రామన్న వెల్లడించారు. టిఎస్ ఐపాస్ ద్వారా కంపెనీలకు 15 రోజుల్లోనే ప్రభుత్వం అనుమతులు జారీ చేస్తోందని, ఇదే సందర్భంలో మైనింగ్‌కు పర్యావరణ అనుమతులను నిర్ణీత గడువులోగా ఇచ్చే విధంగా సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రులు స్పష్టం చేశారు. మైనింగ్ కార్యకపాల కోసం భూములు ఇస్తున్న వారు లేదా మైనింగ్ కార్యకలాపాల వలన నష్టపోతున్న రైతులు, స్థానికులకు పునరావాస కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. మైనింగ్ టుడే 2018 పేరుతో గత మూడు రోజులుగా మాధాపూర్ హైటెక్స్‌లో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరై జోగు రామన్న, జగదీశ్వర్ రెడ్డి ప్రసంగించారు. మైనింగ్ ఇండియా మూడవ జాతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక కావడం అభినందనీయమన్నారు.

సింగరేణి స్టాల్‌కు ప్రథమ బహుమతి

మైనింగ్ సదస్సులో సింగరేణి స్టాల్‌కు ప్రథమ బహుమతి లభించింది. ద్వితీయ బహుమతిని ఎన్‌ఎండిసి గెలుపొందింది. హైటెక్స్‌లో జరిగిన అంతర్జాతీయ మైనింగ్ సదస్సు శుక్రవారం నాడు ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో సింగరేణి స్టాల్‌కు మొదటి బహుమతిని మంత్రి జగదీశ్వరరెడ్డి, జోగు రామన్న అందజేశారు. స్టాల్‌లో లాంగ్‌వాల్ మైనింగ్, హైవాల్ మైనింగ్, డ్రాగ్ లైన్, సాండ్ స్టోయింగ్ ప్లాంట్, ఓబి నుంచి ఇసుక తీసే పద్ధతి తెలిపే ప్రాసెసడ్ ఓడి, మ్యాన్ రైడింగ్ సిస్టం మోడళ్లను ఏర్పాటు చేయగా, ఇవి సందర్శకులను ఆకర్షించాయి.



21న గిరిజనుల నిరసన

మన తెలంగాణ/హైదరాబాద్ : గిరిజనుల సమస్యలపై తెలుగు రాష్ట్రాలు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ రెండు రాష్ట్రాలలో ఈనెల 21న నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు గిరిజన ఐక్య వేదిక వెల్లడించింది. అన్ని జిల్లాలో టిడిపి, టిఆర్‌ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలతో సహా పవన్‌కల్యాన్ దిష్టిబొమ్మను కూడా దహనం చేయనున్నట్లు ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు కె.వివేక్ వినాయక్ తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 20న విశాఖ జిల్లాలో గిరిజన దీక్ష చేపడుతున్నామని, 28వ తేదీన రాష్ట్ర ఏజెన్సీ బంద్, మార్చి 5న న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద గిరిజన దీక్ష చేపడుతున్నామని తెలిపారు.



వాట్సాప్‌ది అన్యాయం : పేటిఎం చీఫ్ విజయ్

బెంగళూరు: దేశంలో చెల్లింపు సేవలను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్న మెసేజింగ్ సర్వీస్ ప్రొవైడర్ వాట్సాప్‌ది అన్యాయం అని అంటున్నారు దేశంలోనే అతిపెద్ద డిజిటల్ చెల్లింపు కంపెనీ అధిపతి విజయ్ శేఖర్ శర్మ. పరిహారానికి దేశంలో యూనిఫైడ్ డిజిటల్ చెల్లింపు విధానాన్ని రూపొందించిన యుపిఐపై పిటిషన్ వేస్తామని కూడా ఆయన అన్నారు. గతవారం ప్రయోగాత్మకంగా సేవలు ఆరంభించిన వాట్సాప్ చెల్లింపుల విధానంకు లాగ్–ఇన్ సెషన్, ఆధార్ ఆధారిత చెల్లింపులు అవసరంలేదు. దీనిపై యుపిఐ విధానాన్ని రూపొందించిన నేషనల్ పేమెంట్స కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పిసిఐ)ను ఆశ్రయిస్తామన్నారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారులు కూడా ఎత్తిచూపాలని ఆయన అన్నారు. వాట్సాప్ యాజమాన్యం హక్కులు కలిగి ఉన్న ఫేస్‌బుక్‌కు ప్రతినెల చాలా మంది వినియోగదారులు తయారవుతున్నారు. దీంతో వాట్సాప్ దేశంలో డిజిటల్ పేమెంట్ రంగంలోకి దిగితే ఆర్డర్లు పొందడాన్ని కష్టతరం చేసేస్తుందన్నారు. ఫేస్‌బుక్ బహిరంగంగానే మన చెల్లింపు విధానాన్ని వలసవాదం చేసేస్తోంది. యుపిఐను భారత్ తయారుచేసింది. కానీ అమెరికా గుత్తాధిపతులు తమకు అనుకూలంగా మలచుకొంటున్నారు అని విజయ్ శేఖర్ శర్మ అన్నారు.

నష్టాల్లోకి జారిన స్టాక్ మార్కెట్

అన్ని రంగాల సూచీలు పతనం



ముంబయి: వారాంతంలో దేశీయ మార్కెట్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల ప్రభావంలో ఉత్సాహంగా ట్రేడింగ్‌ను మొదలుపెట్టిన సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు.. ఆ తర్వాత తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొన్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లు కుదేలయ్యాయి. అటు ఆటోమొబైల్, ఆర్థిక రంగాల కంపెనీల షేర్లు నష్టాల్లో ఉండటంతో సూచీలు ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా భారీ నష్టాలను చవిచూశాయి. శుక్రవారం నిఫ్టీ 10,500 మార్క్ కిందకు పడిపోగా.. సెన్సెక్స్ 286.71పాయింట్లు లేక 0.84 శాతం నష్టపోయి 34,010.76 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ 93.20 పాయింట్లు లేక 0.88 శాతం నష్టపోయి 10,452.30 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ. 64.13గా కొనసాగుతోంది. పిఎన్‌బి మోసం కేసులో గీతాంజలి గ్రూపు కంపెనీలపై సిబిఐ తాజా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడంతో వరుసగా రెండో సెషన్‌లో కూడా గీతాంజలి జెమ్స్ వాటాలు 20 శాతం లోయర్ సర్క్యూట్ వద్ద లాక్ అయింది. అయితే పిసి జ్యెలర్ మాత్రం బలహీనంగా ఆరంభమై దాదాపు 7 శాతం పెరిగింది.

రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసిఐసిఐ బ్యాంక్, ఎల్ అండ్ టి, ఐషర్ మోటార్స్, మారుతి, యెస్ బ్యాంక్, టాటా మోటార్స్, వేదాంత తదితర కంపెనీల షేర్లు 1 నుంచి 3.6 శాతం పతనమయ్యాయి. కాగా ఇన్ఫోసిస్, అంబుజా సిమెంట్స్ 1శాతం కన్నా ఎక్కువ లాభపడ్డాయి. వరుణ్ బేవరేజెస్ అక్టోబర్–డిసెంబర్ త్రైమాసిక ఫలితాల్లో రూ. 72.2 కోట్ల ఏకీకృత నష్టాన్ని పోస్ట్ చేశాక దాని వాటాలు 2 శాతం నష్టపోయాయి. మద్యంపై 8 శాతం ఎక్సైజ్ పన్ను పెంచనున్నట్లు కర్నాటక ప్రభుత్వం భావిస్తోందన్న వార్తలు రావడంతో పిన్‌కాన్ స్పిరిట్, యునైటెడ్ స్పిరిట్స్, గ్లోబస్ స్పిరిట్స్, రేడికో ఖైతాన్, యునైటెడ్ బేవరీస్ వంటి మద్యం కంపెనీ షేర్లు 2 నుంచి 4 శాతం నష్టపోయాయి.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	34010.76	–286.71	–0.84%
నిఫ్టీ	10452.30	–93.20	–0.88%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29400	31443.85	0.51%
ముంబై	30060	32149.73	1.01%
ఢిల్లీ	29550	31604.28	1.2%
కోల్‌కతా	30220.99	32321.91	1.1%
కేరళ	28250	30213.90	0%
బెంగళూరు	28700	30695.19	0%
హైదరాబాద్	29280	31315.51	0.1%
గల్ఫ్	1431.25	1530.75	1.32%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	40600.00	40900.00	–0.73
ముంబై	40600.00	40900.00	–0.73
ఢిల్లీ	40600.00	40900.00	–0.73
కోల్‌కతా	40600.00	40900.00	–0.73
హైదరాబాద్	40600.00	40900.00	–0.73



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	391	విశాఖపట్నం	400
వరంగల్	393	చిత్తూరు	408
విజయవాడ	395	చెన్నై	415
గోదావరి	395	బెంగళూరు	405

పిఎన్‌బి బీమా 2 కోట్లే!



చెన్నై: బ్యాంకు ప్రాథమిక నష్టపరిహార విధానం(బేసిక్ బ్యాంకర్స్ ఇండెమ్నిటీ పాలసీ) కింద పంజాబ్ నేషనల్ బ్యాంకు(పిఎన్‌బి)కు మోసం కింద లభించే బీమా మొత్తం రూ. 2 కోట్లేనని ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. సరిపోనంత బీమా చేయనందున పంజాబ్ నేషనల్ బ్యాంకు నష్టపోకతప్పదని తెలిసింది. మోసపోయిన నష్ట మొత్తం రూ. 11,300 కోట్లను పిఎన్‌బియే చెల్లించాలని, సెకండరీ మార్కెట్‌లో లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్(ఎల్‌ఒయులు) కొన్న యాక్సిస్ బ్యాంకు, అలహాబాద్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా లేక ఎస్‌బిఐ కాదని భారత రిజర్వు బ్యాంకు ఆదేశించనుంది. అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు నష్టపరిహార బీమా పాలసీ కింద వాణిజ్య, బిల్ డిస్కౌంటింగ్, సైబర్ బీమా కింద ప్రత్యేకంగా ఈ సదుపాయాన్ని తీసుకున్నాయి. కానీ పిఎన్‌బి మాత్రం అలా చేయలేదు. ఈ బీమాను యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్ 40శాతం వరకు ఇస్తోంది. ఇక మిగతా 60శాతం బీమాను మూడు ప్రభుత్వ రంగ బీమా కంపెనీలు ఇస్తున్నాయి. యునైటెడ్ ఇండియా అధికారి చెప్పిన వివరాల ప్రకారం.. పిఎన్‌బి బ్యాంకర్ నష్టపరిహార పాలసీ కింద రూ.5 కోట్ల ప్రీమియంను చెల్లిస్తోంది. ఈ పాలసీ మొత్తం బీమాను కల్పించదు. ఆస్తి నష్టం, అగ్నిప్రమాదం, దోపిడీ, మోసాల కింద ఈ బీమా నిర్దిష్ట పరిమితులను మాత్రమే కవర్ చేస్తోంది. అలా పిఎన్‌బి ఉద్యోగులు ఏదైనా మోసానికి పాల్పడితే వచ్చే బీమా రూ.2 కోట్లు మాత్రమేనట. పిఎన్‌బిలో మోసం 2011 నుంచి జరుగుతోందని వాళ్లే చెబుతున్నారు. కానీ పిఎన్‌బికి మేం బీమాను రెండేళ్ల నుంచి మాత్రమే అందిస్తున్నట్లు ఆ అధికారి తెలిపారు. పిఎన్‌బిలోని ముంబయి బ్రాంచిలో రూ.11,400 కోట్ల మోసపూరిత లావాదేవీలు జరిగిన విషయం తెలిసిందే. కొంతమంది ఖాతాదారులకు లబ్ధి చేకూర్చేందుకు తమ సిబ్బంది తప్పుడు 'లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్(ఎల్‌ఒయు)ల ద్వారా కుట్ర పన్నినట్లు పిఎన్‌బి తెలిపింది. ఈ ఎల్‌ఒయుని చూపించి విదేశాల్లో భారతీయ బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చు. అలా ఈ కేసులో నిందితులుగా ఉన్నవారు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ తదితర 30 బ్యాంకుల నుంచి రుణాలు పొందినట్లు తేలింది. పిఎన్‌బి 'మధ్యవర్తి'గా ఉండి రుణాలు ఇప్పించిన బ్యాంకులన్నింటికీ రూ.11వేల కోట్ల మొత్తాన్ని పంజాబ్ నేషనల్ బ్యాంకే చెల్లించాలని ఆర్‌బిఐ ఆదేశించినట్లు సమాచారం.

వాల్‌మార్ట్, సాఫ్ట్‌బ్యాంక్‌ల విభేదం

న్యూఢిల్లీ: భారత్‌లో దిగ్గజ ఇ–కామర్స్ కంపెనీ ఫ్లిప్‌కార్ట్‌లో 20 బిలియన్‌లు మొదలుకుని 23 బిలియన్ డాలర్ల మేరకు వాటాలు కొనాలని అమెరికా రిటైలర్ కంపెనీ వాల్‌మార్ట్ అనుకుంటోంది. ఒకవేళ ఇదే జరిగితే అమెరికాలో అది అమెజాన్‌తో పోటీపడగలదు. ఫ్లిప్‌కార్ట్ కంపెనీని కొనాలని వాల్‌మార్ట్ అయితే ఆసక్తిని చూపించింది. కాని ఫ్లిప్‌కార్ట్‌లో కీలక పెట్టుబడిదారైన సాఫ్ట్ బ్యాంక్ గ్రూపు దీనికి సమ్మతించడంలేదు. అమ్మకాన్ని వ్యతిరేకిస్తోంది. ఇప్పటికీ చర్చలు ఆరంభ దశలోనే ఉన్నాయి. వాల్‌మార్ట్ ఒప్పందం ఫ్లిప్‌కార్ట్‌లో పెద్ద వాటాదారుని చేయగలదని మదుపరులు భావిస్తున్నారు. ఫ్లిప్‌కార్ట్‌లో 15 నుంచి 16 బిలియన్ డాలర్ల మేరకు వాటాలు కొనడానికి గూగుల్ కూడా ఆసక్తి కనబరిచింది. ఇతరులతో కూడా ఫ్లిప్‌కార్ట్ చర్చలు జరుపుతోంది. వివరాలు తెలుపాల్సిందిగా కోరుతూ పంపిన ఇ–మెయిల్లకు గూగుల్, సాఫ్ట్ బ్యాంక్ ప్రతిస్పందించలేదు. ఫ్లిప్‌కార్ట్‌లో 15 నుంచి 20 శాతం వాటాలు కొనడానికి వాల్‌మార్ట్ ఆసక్తి కనబరుస్తోందని జనవరి 31న ఎకనామిక్స్ టైమ్స్ రాసింది. 2017 ఆగస్టులో జపాన్‌కు చెందిన సాఫ్ట్ బ్యాంక్ గ్రూప్ నుంచి 1.4 బిలియన్‌ల తాజా మూలధనాన్ని ఫ్లిప్‌కార్ట్ అందుకుంది. దీంతో ఫ్లిప్‌కార్ట్ విలువ 14 బిలియన్ డాలర్లు అయింది. 2007లో ఆరంభించిన ఫ్లిప్‌కార్ట్ ఇప్పటి వరకు 6 బిలియన్ డాలర్లకుపైగా మూలధనాన్ని సేకరించింది.

ఎక్కువ జీతగాళ్ల పిఎఫ్‌లో ఈక్విటీలకు 25 శాతం


ఇపిఎఫ్ఒ పరిశీలనలో ప్రతిపాదన



న్యూఢిల్లీ: ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సంస్థ(ఇపిఎఫ్ఒ) తన చెల్లింపుదారులకు పెద్ద యోచన చేస్తోంది. నెల కిందట సెన్సెక్స్ రికార్డులు బద్ధలు కొడుతున్నప్పుడు ఇప్పుడున్న 15 శాతం నుంచి గరిష్ఠ ఆదాయాలు లభించేలా ఈక్విటీ పెట్టుబడి పరిమితిని అనుమతించగలమని ప్రభుత్వం చెప్పినట్లు వార్తలు వచ్చాయి. దాంతో ఇపిఎఫ్ఒ వార్షిక వృద్ధి కార్పస్ 1.2 లక్షల కోట్ల రూపాయల మేరకు పెరిగి దాని విలువ 11 లక్షల కోట్ల రూపాయలకు చేరింది. పెద్ద ఎత్తున ఈక్విటీలో పెట్టుబడి పెట్టాలని మేము చర్చిస్తున్నాం. ఇటీవల మార్కెట్ దిద్దుబాటులో కూడా ఆ ఆలోచనను మానుకోలేదు. ఎక్కువ జీతాలు తీసుకునేవారు తమ ప్రావిడెంట్ ఫండ్‌లోని 25 శాతాన్ని స్టాకుల్లో పెట్టడానికి అనుమతించాలన్న విషయాన్ని ఇపిఎఫ్ఒ పరిశీలిస్తోంది. అయితే అల్పాదాయ ఉద్యోగులకు ఈ పరిమితి 15 శాతమే ఉంచేయనున్నది. 'ఇటీవల నెలల్లో మేము ఈ ప్రతిపాదనపై చర్చించాం. ఈ అంశాన్ని మళ్లీ వచ్చే ఆర్థిక, ఇన్వెస్ట్‌మెంట్ అ పెట్టుబడి సలహా కమిటీ సమావేశం(ఎఫ్ఐఎసి)లో చర్చిస్తాం' అని కమిటీ సభ్యుడు ప్రభాకర్ బనసురే అన్నారు. ఆసక్తికర విషయమేమిటంటే ఎఫ్ఐఎసి సమావేశాన్ని మొదట జనవరి చివర్లో నిర్వహించాలని అనుకున్నారు. కానీ తర్వాత బడ్జెట్ రోజుకు వాయిదా వేశారు. ఎందుకంటే ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కూడా ఇలాంటి ప్రకటన ఏదో చేయనున్నారనే అలా చేశారు. ఒకవేళ ఈ ప్రతిపాదన ఆమోదించితే ఇపిఎఫ్ డబ్బును ఆ సంస్థ వాటాలకు పెద్ద ఎత్తున మళ్లించగలదు.

న్యూయార్క్‌లో నీరవ్?

డిఫ్యూజన్ నోటీసులు జారీకి సిబిఐ అభ్యర్థన



న్యూయార్క్: విదేశీ వాణిజ్యం పేరుతో పంజాబ్ నేషనల్ బ్యాంకులో కోట్లాది రూపాయల మోసపూరిత లావాదేవీలు నిర్వహించిన ప్రముఖ వజ్రాల వ్యాపారి ఇప్పుడు న్యూయార్క్‌లో ఉన్నట్లు సమాచారం. న్యూయార్క్‌లోని విలాసవంతమైన జెడబ్ల్యు మరియట్ ఎస్సెక్స్ హౌస్ హోటల్‌లో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన లేదు. ఇదిలా ఉండగా నీరవ్ ఆచూకీ కోసం కేంద్ర దర్యాప్తు సంస్థ–సిబిఐ అధికారులు ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించారు. నీరవ్‌పై డిఫ్యూజన్ నోటీసులు జారీ చేయాలని కోరినట్టు కూడా తెలుస్తోంది. ఈ డిఫ్యూజన్ నోటీస్‌ను ఇంటర్‌పోల్ సభ్యత్వం ఉన్న దేశాలకు పంపిస్తారు. దాని ద్వారా పోలీసులు విచారణ చేపట్టి ఆ వ్యక్తుల ఆచూకీని కనుగొని చెబుతారు. త్వరలోనే నీరవ్ ఆచూకీని కనుగొంటామని సిబిఐ అంటోంది.నీరవ్ మోదీ (48) న్యూయార్క్‌లో ఒక హోటల్‌లో ఉన్నాడని పలు వార్తలు హల్ చల్ చేస్తుండగా... ఆయన ఎక్కడ ఉన్నదీ తమకు స్పష్టంగా తెలియదనీ విదేశాంగ శాఖ ప్రకటించింది. నీరవ్ మోదీ తమ అధికారులు ఎవరితోనూ సన్నిహితంగా లేడని, ఈ దశలో ఎక్కడ ఉన్నదీ చెప్పలేమని విదేశాంగ శాఖ ప్రతినిధి రవీష్ కుమార్ తెలిపారు. నీరవ్ మోడీతో కుమ్మకైన తమ బ్యాంకు అధికారులు 150 లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్(ఎల్‌ఒయు)లు ఇచ్చారని పంజాబ్ నేషనల్ బ్యాంకు తన మూడు ఫిర్యాదుల్లో సిబిఐకు తెలిపింది. కాగా పిఎన్‌బి పనితీరును కూడా సిబిఐ ఇప్పుడు పరిశీలిస్తోందని సమాచారం.

సిటీ బ్యాంకు బాటలో ఎస్‌బిఐ



న్యూఢిల్లీ: బిట్‌కాయిన్ సహా ఇతర క్రిప్టో కరెన్సీల కొను గోలుకు డెబిట్, క్రెడిట్ కార్డుల వినియోగాన్ని రెండు రోజుల క్రితం సిటీ బ్యాంకు నిషేధించగా, తాజాగా ఎస్‌బిఐ అదే బాటలో నిర్ణయం తీసుకుంది. బిట్‌కాయిన్ల కొనగోలుకు ఎస్‌బిఐ వీసా, మాస్టర్ కార్డులను ఉపయోగించడంపై నిషేధం విధించేందుకు ఎస్‌బిఐ ప్రయత్నిస్తోందని సమాచారం. దీనిపై ఎస్‌బిఐ కార్డు ఎండి, సిఇఒ హర్దయాల్ ప్రసాద్ స్పందిస్తూ ' బిట్‌కాయిన్ లావాదేవీలపై ప్రభుత్వం, ఆర్‌బిఐ ఆందోళన చెందుతున్నాయి. అందుకే వర్చువల్ కరెన్సీల లావాదేవీలను అడ్డుకునేందుకు ఈ విధమైన చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. దీనిపై వీసా, మాస్టర్‌కార్డ్ నెట్‌వర్క్‌లతో చర్చలు జరుపుతున్నాం' అని ఇ–మెయిల్ ద్వారా ఓ ఆంగ్ల మీడియాకు తెలిపారు. కాగా క్రిప్టో కరెన్సీ భారత్‌లో చట్టబద్ధం కాదని, ఆ కరెన్సీ లావాదేవీలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇటీవల బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్న విషయం తెలిసిందే

బ్యాంకుల్లో అతిపెద్ద లూటీలు

● విజయ్ మాల్యా నుంచి నీరవ్ మోడీ వరకు ● పిఎస్‌యు బ్యాంకులను ముంచుతున్న స్కామ్‌లు, మొండి బకాయిలు

ముంబై : ఇప్పటికే మొండి బకాయిలు పేరుకుపోయి అవస్థలు పడుతున్న ప్రభుత్వరంగ బ్యాంకులకు స్కామ్‌లు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. బ్యాంకుల నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ) 10 లక్షల కోట్లకు చేరాయి. ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఇటీవల 20 వేల కోట్ల రూపాయల మొండి బకాయిలను రద్దు చేసినట్టు ప్రకటించింది. మొత్తంగా అన్ని బ్యాంకులు కలిసి రూ.80 వేల కోట్ల రుణాలను రద్దు చేశాయి. వేలకోట్ల రుణాలను తిరిగి చెల్లించకుండా విదేశాలకు పారిపోయిన పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా నుంచి తాజాగా డైమండ్ వ్యాపారి నీరవ్ మోడీ వరకు బ్యాంకులను భారీ మొత్తంలో లూటీ చేశారనే చెప్పాలి. వేల కోట్లలో రుణాలు తీసుకొని ఎగనామం పెట్టినవారిని ఏమీ చేయలేక ప్రభుత్వరంగ బ్యాంకులు చేతులెత్తేస్తున్నాయే తప్ప వారిపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. చిన్న కస్టమర్లపై ప్రతాపం చూపే బ్యాంకులు పెద్దవారిపై చేష్టలుడిగి చూస్తూ ఉన్నాయి. ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) ముంబై బ్రాంచీలో సుమారు రూ. 11,500 కోట్లమేర అక్రమ లావాదేవీల కేసులో నిరవ్ మోడీ వ్యవహారం అందర్నీ ముక్కున వేలేసుకునేలా చేసింది. మాల్యా వంటివారు ప్రభుత్వం కన్నుగప్పి తప్పించుకుపోయినా .. మళ్లీ అలాంటి ఘటనలే పునరావృతం కావడం అందరినీ కలచివేస్తుంది.







కఠిన చర్యలకు ఆర్‌బిఐ సన్నద్ధం

మొండి ఘటాల నేపథ్యంలో ఆర్‌బిఐ రిజర్వ్ బ్యాంక్ మరింత కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధమైంది. ఆర్‌బిఐ కొత్త నిబంధనలను కూడా జారీ చేసింది. సవరించిన నిబంధనల ప్రకారం, ఒత్తిడి ఆస్తులను వెంటనే గుర్తించి, ఇచ్చిన గడువులోగా రిసొల్యూషన్ ప్లాన్ అమలు చేయాలి.. ఈ విషయంలో విఫలమైతే బ్యాంకులపై జరిమానా పడనుంది. మొండి బకాయిల పరిష్కారానికి ఇప్పటికే ఉన్న ఎస్4ఎ, ఎస్‌డిఆర్(వ్యూహాత్మక రుణ పునర్వ్యస్థీకరణ), సిడిఆర్(కార్పొరేట్ రుణ పునర్వ్యవస్థీకరణ) వంటి వివిధ స్కీమ్‌లను ఆర్‌బిఐ రద్దు చేసింది. దివాలా చట్టం(ఐబిసి) కింద మొండి బకాయిదారులపై బ్యాంకులు చర్యలు తీసుకోవచ్చని ఆర్‌బిఐ తెలిపింది. తాజా నిబంధనల ప్రకారం, బ్యాంకులు మొండి బకాయిలున్న ఖాతాలను వెంటనే గుర్తించి, వాటిపై రిజల్యూషన్ ప్లాన్(ఆర్‌పి) అమలు చేయాలి. ఈ ప్లాన్ అంటే ఖాతాదారులపై చర్యలు తీసుకోవడం.. వారి నుంచి రుణాలు రాబట్టుకోవడం చేయాల్సి ఉంటుంది. ఇదంతా ఒక్క రోజులో అయిపోదు కాబట్టి దీనికి ఆర్‌బిఐ కొంత గడువు ఇచ్చింది. 180 రోజుల్లోగా ఈ ప్రక్రియ ముగిసేలా చూడాలని స్పష్టం చేసింది. గడువులోగా రిజల్యూషన్ ప్లాన్ పూర్తి కాకపోతే ఆయా బ్యాంకులు దివాలా కేసు కింద నమోదు చేయవచ్చు. అయితే అది కూడా గడువు పూర్తయిన 15 రోజుల్లోగానే నమోదు చేయాల్సి ఉంటుంది.

రూ.81,683 కోట్ల మొండి బకాయిలు రద్దు

గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ బ్యాంక్‌లు పెద్ద మొత్తంలో మొండి బకాయిలను రద్దు చేశాయి. 2016–17లో దేశీయ అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బిఐ రూ.20,339 కోట్ల మొండి బకాయిలను రద్దు చేసింది. రుణాలను రద్దు చేసిన ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఎస్‌బిఐ వాటానే అధికంగా ఉంది. అయితే 2016–17లో అన్ని ప్రభుత్వ బ్యాంకుల రుణాలు రూ.81,683 కోట్లు రద్దు అయింది. ఎస్‌బిఐలో అనుబంధ బ్యాంకులు విలీనం చేయకముందు గణాంకాలు కావడం గమనార్హం.. 2012–13లో పిఎస్‌యు బ్యాంకులు రద్దు చేసిన మొత్తం రూ.27,231 కోట్లుగా ఉందని ప్రభుత్వ గణాంకాలు తెలిపాయి. అయితే ఈ మొత్తం ఐదేళ్లలోనే మూడు రెట్లు పెరిగింది. ఎస్‌బిఐతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్ 2016–17లో రూ 9205 కోట్లను, బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ 7346 కోట్లు, కెనరా బ్యాంక్ రూ 5,545 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ 4,348 కోట్ల మేర మొండి బాకీలను రద్దు చేశాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరు నెలల్లో బ్యాంకులు రద్దు చేసిన రుణాల మొత్తం రూ 53,625 కోట్లకు పెరిగింది. మొత్తం 21 బ్యాంకులకు గాను 9 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తుల(ఎన్‌పిఎ) విలువ 15 శాతానికి పెరగడం ఆందోళన రేకెత్తిస్తోంది. 14 పిఎస్‌బిల స్థూల నిరర్థక ఆస్తులు 12 శాతానికి పైగా పెరిగాయి.

బంగారం ధర ధగధగ

10 గ్రాములకు రూ. 170 పెరిగి రూ. 31,820 చేరిన పసిడి

న్యూఢిల్లీ: త్వరలో మూఢం ముగియనుండటం...పెళ్ళిల సీజన్ దగ్గరపడుతుండటం, అంతర్జాతీయ మార్కెట్ అనుకూలత కారణంగా బంగారం ధర ఊపందుకుంది. 10 గ్రాముల బంగారం ధర రూ. 170 పెరిగి రూ. 31,820కు చేరిందని బులియన్ వ్యాపారులు అంటున్నారు. నగల వ్యాపారులు వినియోగదారులను ఆకట్టుకునేందుకు డిస్కౌంట్లు కూడా ఇస్తుండటంతో బంగారం ధర పెరిగిందని రాయిటర్ వార్తా సంస్థ పేర్కొంది. అయితే వెండి ధర మాత్రం బలహీనపడింది. కిలో వెండి రూ. 580 మేరకు పతనమై రూ. 39,380కు చేరిందని పిటిఐ వార్తా సంస్థ పేర్కొంది. డాలరు విలువ బలహీనం పడడం కూడా బంగారం ధర పెరిగేందుకు కారణమైంది.ఇంతేకాక దేశీయంగా పెళ్ళిల సీజన్ కావడంతో నగల వ్యాపారులు బంగారం కొనుగోలు దిగుతుండడంతో దేశీయ మార్కెట్‌లో బంగారానికి మద్దతు లభిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం 0.40 శాతం పెరిగి 1358.70 డాలర్ల ధర పలుకుతుండగా, వెండి ఔన్స్ ధర 0.36 శాతం పెరిగి సింగపూర్‌లో 16.88 డాలర్లు ధర పలుకుతోంది. భారత్‌లో డీలర్లు ఔన్స్ బంగారంపై శుక్రవారం 3 డాలర్ల డిస్కౌంట్ ఇచ్చారు. బంగారం దిగుమతులు జనవరిలో 37 శాతం...ఏడాది కాలంలో 17 నెలల కనిష్ఠానికి పతనమయ్యాయి.



ఐఒబి రిటైల్ లోన్ మేళా



మన తెలంగాణ / హైదరాబాద్ : ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఉప్పల్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బిడిఎల్ కంచన్ బాగ్ ఆవరణలో విద్యా రుణాలు, వాహన, హౌసింగ్ మార్టిగేజ్ రుణ మేళా జరిగింది. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉప్పల్ శాఖ చీఫ్ మేనేజర్ కె. సత్యనారాయణ, మేనేజర్ డి. శ్రీధర్, అసిస్టెంట్ మేనేజర్ స్వాతి రెడ్డి, ప్రాంతీయ కార్యాలయ మేనేజర్లు రాఘవేంద్ర, రాజేష్ పాల్గొన్నారు.

ఎంఎస్ఆర్ లాభం కోటి

మన తెలంగాణ / హైదరాబాద్ : డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఎంఎస్ఆర్ ఇండియా నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 33 శాతం పెరిగి కోటి రూపాయలు నమోదు చేసుకుంది. టర్నోవరు రూ. 23 కోట్ల నుండి రూ. 50 కోట్లకు ఎగిసింది. ఏప్రిల్ – డిసెంబర్‌లో రూ. 108 కోట్ల టర్నోవర్ పై రూ. 22 కోట్ల నికర లాభం ఆర్జించింది. డాక్టర్ కాపర్ ఉత్పాదన అమ్మకాల మూలంగానే ఈ స్థాయిలో వృద్ధి సాధ్యమైందని ఎంఎంఎస్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది.

హైటెక్ ఎయిర్ కండీషనింగ్ ఉత్పత్తుల ఆవిష్కరణ

మన తెలంగాణ / హైదరాబాద్ : హైటెక్ ఎయిర్ కండిషనింగ్ ఉత్పత్తులను జపాన్ కంపెనీ ఫుజిత్సు జనరల్ కంపెనీ హైదరాబాద్ మార్కెట్‌లోకి ప్రవేశ పెట్టింది. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆ సంస్థ ప్రెసిడెంట్ ఇత్సురో సైటో, మేనేజింగ్ డైరెక్టర్ కెనిచీ ఇషికవా, ఇజిపిఎల్ సిఈవో ఎం. ఇజాజుద్దీన్ హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని హైడల్ ఏయిర్ కండిషనింగ్ ఎయిర్ కండిషనింగ్ ఉత్పత్తులను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఫుజిత్సి జనరల్ ఎయిర్ కండిషనింగ్ మార్కెట్‌లో నాల్గు శాతం వాటా కల్గి ఉన్నట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో తమ మార్కెట్ వాటాను 5 శాతానికి పెంచుకోనున్నట్లు వెల్లడించారు. కంపెనీకి ప్రస్తుతం దేశంలో 2500 మంది డీలర్లు ఉన్నట్లు వెల్లడించారు.

అరిజ్‌ఖాన్ అరెస్ట్‌పై ఢిల్లీ పోలీసులకు రాజ్‌నాథ్ ప్రశంస

న్యూఢిల్లీ: ఇండియన్ ముజాహిదీన్ ఆపరేటివ్ జునైద్ అలియాస్ అరిజ్ ఖాన్‌ను అరెస్ట్ చేసిన ఢిల్లీ పోలీసులను కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రశంసించారు. శుక్రవారం జాతీయ రాజధాని పోలీస్ రైజింగ్ డే పరేడ్ వద్ద హోంమంత్రి ప్రసంగించారు. నగరంలో పోలీసులు భద్రత వాతావరణాన్ని సృష్టించడం ద్వారా ప్రజలు సురక్షితంగా ఉన్నట్లు భావిస్తారని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ పోలీస్ అమర వీరుల నిధికి రూ. 5 కోట్లు కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసియాన్ సమ్మిట్‌కు విస్తృతమైన భద్రత కల్పించిన ఢిల్లీ పోలీసులకు ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే శక్తి ఉందన్నారు. న్యూయార్క్, లాటిన్ అమెరికన్ నగరాల్లోని పోలీసుల విధానాన్ని అనుసరించాలని ఆయన పిలుపునిచ్చారు. నేరాల నియంత్రణ పెద్ద సవాల్‌గా మారిందని ఆయన పేర్కొన్నారు. దీర్ఘకాలిక ప్రణాళిక, వ్యూహం ద్వారా న్యూయార్క్, లాటిన్ అమెరికాలోని బొగోట వంటి నగరాలలో నేరాలను నియంత్రించగలిగారని సింగ్ తెలిపారు. పోలీసు సిబ్బందికి ఆయన పతకాలు ప్రదానం చేశారు.



ఎన్నికల అభ్యర్థులు ఆదాయవనరులను చెప్పాలి : సుప్రీం

ఢిల్లీ: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఆదాయ వనరుల వివరాలను తప్పనిసరిగా వెల్లడించాలని సుప్రీంకోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. నామినేషన్ వేసే సమయంలోనే అభ్యర్థులు తమ వ్యక్తిగత, వారి జీవిత భాగస్వామి, వారిపై ఆధారపడే పిల్లలకు ఆదాయం ఎక్కడి నుంచి వస్తుందో బహిర్గతం చేయాలని వెల్లడించింది. ఈ మేరకు లోక్ ప్రహరి అనే ఎన్జీవో వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విధంగా తీర్పు వెలువరించింది. అభ్యర్థులు తమ ఆస్తుల వివరాలను స్పష్టంగా చెప్పాలంటూ లోక్‌ప్రహరి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో తమ ఆస్తుల వివరాలతో ఉన్న అఫిడవిట్‌ను దాఖలు చేస్తారు. ఇందులో వ్యక్తిగత, భాగస్వాములు, పిల్లలు ఇతర కుటుంబసభ్యుల ఆస్తుల వివరాలను పొందుపరుస్తారు. అయితే ఆ ఆదాయమంతా వారికి ఎక్కడి నుంచి వస్తుందనే విషయాన్ని మాత్రం అభ్యర్థులు వెల్లడించరని లోక్ ప్రహరి పిటిషన్‌లో పేర్కొంది. ఆ ఆదాయం ఎక్కడి నుంచి వస్తుందో కూడా చెప్పేవిధంగా నామినేషన్‌లో కాలమ్‌ను ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్రం తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. రాజకీయ నాయకుల ఆస్తులు అమాంతం పెరిగినా.. ఎలా పెరిగాయి అనే విషయంపై కేంద్రం ఎలాంటి దర్యాప్తు చేపట్టలేదని చురకలంటించింది. అభ్యర్థులు తమ ఆదాయ వనరులను చెప్పాల్సిందేనని స్పష్టం చేస్తూ నేడు తీర్పు వెల్లడించింది.

ఆరోవిల్లే గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు మోడీ

పుదుచ్చేరి: తమిళనాడులోని విల్లుపురం జిల్లాలో ఫిబ్రవరి 24న ఆరోవిల్లే ఇంటర్నేషన్ టౌన్‌షిప్ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటారని స్థానిక బిజెపి నాయకుడు వి సామినాథన్ విలేకరులకు తెలిపారు. ఆరోవిల్లే వేడుకల్లో పాల్గొన్న అనంతరం లాస్‌పేట సమీపంలోని హెలిపాడ్ వద్ద పార్టీ కార్యకర్తల ర్యాలీ నుద్దేశించి మోడీ ప్రసంగిస్తారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆరోవిల్లే గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు వచ్చినప్పుడు ఓడరేవులో కంటైనర్ కార్గో ఆపరేషన్‌ను ప్రారంభించాలని అభ్యర్థించినట్లు ఇటీవల పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి నారాయణ స్వామి విలేకరులకు తెలిపారు. తమ అభ్యర్థనపై ప్రధాని సమాధానం కోసం వేచి చూస్తున్నామని పేర్కొన్నారు. 'డాన్ ఆఫ్ సిటీ' గా పేరున్న ఆరోవిల్లే మానవుల్లో ఐక్యతకు కృషి చేస్తుంది. మానవ వనరుల మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే ఈ అంతర్జాతీయ సంస్థను ఫిబ్రవరి28,1968లో ప్రారంభించారు.

కార్తీ నివాసంలో మళ్లీ సోదాలు

న్యూఢిల్లీ : కార్తీ చిదంబరం సంబంధిత ఐఎన్ఎక్స్ మీడియా మనీ లాండరింగ్ కేసులో ఇడి వర్గాలు శుక్రవారం తాజాగా సోదాలు నిర్వహించాయి. సీనియర్ కాంగ్రెస్ నేత చిదంబరం కుమారుడు అయిన కార్తీ లావాదేవీలపై ఇడి దర్యాప్తు సాగుతోంది. తాజాగా దీనికి సంబంధించి చెన్నైలో మూడు నివాసాలలో సోదాలు జరిపారు. అక్రమ డబ్బు లావాదేవీల నిరోధక చట్టం పరిధిలో వీటిని నిర్వహించినట్లు తెలిపారు. ఒక్కరోజు క్రితమే ఈ కేసుకు సంబంధించి కార్తీని పది గంటల పాటు ఢిల్లీలో ఇడి వర్గాలు ప్రశ్నించాయి. వివరాలను రాబట్టేందుకు యత్నించాయి. ఇంతకు ముందు కూడా కేసులో కార్తీ నివాసాలపై దాడులు జరిగాయి. కేసుకు సంబంధించి కార్తీపై గత ఏడాది మే నెలలో సిబిఐ కేసు నమోదు అయింది. తనపై వచ్చిన ఆరోపణలను కార్తీ తోసిపుచ్చారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు హతం

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులను భద్రతా సిబ్బంది కాల్చి చంపారు. మృతుల్లో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌టిఎఫ్, డిఆర్‌జి దళాలు మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లో పాల్గొని తిరిగి వస్తుండగా చింతగుఫా పోలీస్ స్టేషన్ పరిధిలోని టోకన్‌పల్లి సమీపంలో ఇరువురి మధ్య కాల్పులు జరిగాయని దక్షిణ బస్తర్ రేంజ్ డిఐజి సుందర్‌రాజ్ పి తెలిపారు. కాల్పులు ఆగిపోవడంతో సంఘటన స్థలంలో మహిళ సహా ఇద్దరు మృత దేహాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. వారి నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మావోయిస్టు వినియోగించే ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

కుమార్తెలతో సహా తల్లి ఆత్మహత్య

బెంగళూరు: మగ సంతానం కలుగలేదని మనస్తాపానికి గురైన ఓ మహిళ తన ముగ్గురు కుమార్తెలతో సహా బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతుల్లో ఒకరు రెండు నెలల ఆడ శిశువు ఉన్నారు. చిక్కబల్లాపుర జిల్లాలోని కుగ్రామం హన్మంతాపూర్‌లో గురువారం ఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. చిన్నారులను వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లిన తల్లి తీవ్ర ఘాతుకానికి పాల్పడిందన్నారు. మగ శిశువు కనలేదని ఆమెను భర్త, బంధువులు, కూలీలెవ్వరూ వేధించలేదని పోలీసులు తెలిపారు. మగ సంతానం కోసం ఆమె ఎంతో కాలంగా ఎదురు చూస్తోందని, మూడో సంతానం కూడా ఆడ శిశువు జన్మించడంతో మానసిక ఒత్తిడికి గురయినట్లు వారు తెలిపారు.

రోహింగ్యాలను రప్పించుకుంటాం

ఢాకా: తమపై సాగుతున్న హింసాకాండను తప్పించుకోడానికి బంగ్లాదేశ్ పారిపోయి వచ్చిన రోహింగ్యా ముస్లింలను వెనక్కి తీసుకోడానికి మయన్మార్ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు ఆ దేశపు మంత్రి ఒకరు బంగ్లాదేశ్ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్‌కు తెలిపినట్లు అధ్యక్ష ప్రతినిధి జోనాల్ అబెదీన్ శుక్రవారం నాడు తెలిపారు. మయన్మార్ హోం మంత్రి క్యాస్వే హమీద్‌కు తమ దేశపు సంసిద్ధత గురించి తెలిపారు. ఐక్యరాజ్య సమితి మాజీ ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నన్ సారథ్యంలోని కమిషన్ చేసిన సిఫార్సులను మయన్మార్ అమలు పరుస్తుందని కూడా ఆ మంత్రి నుంచి హమీద్‌కు హామీ లభించింది. బంగ్లాదేశ్‌లోకి గత ఆగస్టు నుంచి మొత్తం 7 లక్షల మంది దాకా రోహింగ్యా ముస్లింలు రఖైన్ నుంచి తప్పించుకుని వచ్చారు.

ప్రియా పాటను నిషేధించండి
కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి లేఖ

న్యూఢిల్లీ : కంటిబాసతో ఇంటర్‌నెట్ సంచలనంగా మారిన ప్రియా ప్రకాష్ వారియర్ వార్తల్లో నానుతూనే ఉంది. ప్రియా హల్‌చల్ చేసిన వైరల్ సాంగ్ మాణిక్య మలరయ పూవి ట్రాక్‌ను నిషేధించాలని రజా అకాడమీ తాజాగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రి స్మృతీ ఇరానీకి లేఖ రాసింది. ప్రియా ప్రకాష్ తొలి మూవీ ఒరు ఆదార్ లవ్‌లోని ఈ పాట వివాదాస్పదమైనన సంగతి తెలిసిందే. ఈ మళయాళీ పాట మహ్మద్ ప్రవక్తను అవమానించేలా ఉందని మంత్రికి రాసిన లేఖలో రజా అకాడమీ అభ్యంతరం వ్యక్తం చేసింది. సినిమా నుంచి ఈ సాంగ్‌ను తొలగించేలా సెన్సార్ బోర్డుకు, చిత్ర బృందానికి సూచించాలని రెహ్మానీ గ్రూప్ అధ్యక్షుడు అసిఫ్ సర్దార్ మంత్రిని కోరారు. మరోవైపు ఈ పాటను వ్యతిరేకిస్తూ రజా అకాడమీ మినరా మసీదు ఎదుట నిరసన తెలిపింది. మళయాళ మూవీ ఒరు ఆదార్ లవ్ నుంచి విడుదలైన చిన్న క్లిప్‌లో ప్రదర్శించిన హావభావాలతో ప్రియా ప్రకాష్ రాత్రికి రాత్రే సెలబ్రిటీగా మారిన విషయం తెలిసిందే.

కావేరీపై సుప్రీంకోర్టు తీర్పు

తమిళనాడుకు తగ్గింపు, కర్ణాటకకు పెంపు

న్యూఢిల్లీ : దశాబ్దాలుగా నలుగుతోన్న కావేరీ నదీ జలాల వివాదంలో సుప్రీంకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. తమిళనాడుకు 177.25 టిఎంసిల నీటినే విడుదల చేయాలని ఆదేశించింది. ఇంతకు ముందు తమిళనాడుకు 192 టిఎంసిల నీరు విడుదల అయ్యేది. అయితే ఇప్పుడు ఇందులో 14.75 టిఎంసిల మేరకు కోత విధించారు. దీనితో తమిళనాడులో జల ప్రకంపనలు తలెత్తాయి.కావేరీని జాతీయ సంపదగా పేర్కొన్న ధర్మాసనం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నాయకత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వెలువరించిన తీర్పుతో కర్ణాటకకు అదనంగా 14.75 టిఎంసిల నీరు మిగులుతుంది. ఆ రాష్ట్రానికి 284.75 టిఎంసిల నీటిని కేటాయించింది. కావేరీ జలాలపై దశాబ్దాలుగా వివాదం రగులుకుంటూ వస్తోంది. దీనిని పరిష్కరించేందుకు కేంద్రం కావేరీ జల వివాద ట్రిబ్యునల్ (సిడబ్ల్యూడిటి) 2007 ఫిబ్రవరి 5న వెలువరించిన తీర్పును సమర్థించింది. అప్పటి జల పంపిణీ ఏర్పాట్లను దాదాపుగా సబబే అని పేర్కొంది. కర్ణాటక స్వల్పస్థాయి ఊరట కలికావేరీ జల వివాద ట్రిబ్యునల్ (సిడబ్ల్యూడిటి)ను ఏర్పాటు చేసింది. వివాద పరిశీలన తరువాత ఈ ట్రిబ్యునల్ తమిళ నాడుకు 419 టిఎంసిలు, కర్ణాటకకు 270 టిఎంసిలు, కేరళకు 30 టిఎంసిలు, పుదుచ్చేరికి 7 టిఎంసిల నీటిని కేటాయించింది. అయితే ట్రిబ్యునల్ తీర్పుపై అన్ని రాష్ట్రా లు నిరసన వ్యక్తం చేశాయి. తీర్పునకు వ్యతిరేకంగా వేర్వేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దీనితో పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని అత్యున్నత ధర్మాసనం ఇప్పుడు కీలక తీర్పును వెలువరించింది. 2007 ట్రిబ్యునల్ తీర్పు మేరకు తమిళనాడుకు ఇప్పటికే 227 టిఎంసిల నీటిని విడుదల చేశారు. ఇంకా 192 టిఎంసిల నీటిని విడుదల చేయాల్సి ఉంది. దీనికి సంబంధించి ఇప్పటికే



కర్ణాటకకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అయితే ఈ తీర్పును వ్యతిరేకిస్తూ కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసింది. దీనిపై వాదోపవాదాలు సాగాయి. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని తమిళనాడుకు రావాల్సిన వాటాను ఇప్పుడు సుప్రీంకోర్టు తమ తీర్పులో తగ్గించింది. శుక్రవారం వెలువరించిన తీర్పులో తమిళనాడుకు 177.25 టిఎంసిలనీటిని విడుదల చేయాలని కర్ణాటకను ఆదేశించారు. అయితే వివాదానికి సంబంధించి కేరళ, పుదుచ్చేరిల వాటాలలో ఎలాంటి మార్పు ఉండదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

ట్రిబ్యునల్‌ను కాదనరాదు

కావేరీ జలాలపై ఏ రాష్ట్రానికి సంపూర్ణ అధికారాలు లేవని తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జలాల విషయంలో ట్రిబ్యునల్‌ను ధిక్కరించడానికి వీల్లేదని తెలిపారు. అయితే భూగర్భ జలాలు , బెంగళూరులో నీటి కొరత నేపథ్యంలో కర్ణాటకకు నీటివాటాను పెంచుతున్నట్లు న్యాయస్థానం తెలిపింది. కావేరీ బేసిన్‌లో ఉన్న 20 టిఎంసిల భూగర్భ జలాల నుంచి 10 టిఎంసిలను తమిళనాడుకు కేటాయించవచ్చునని స్పష్టం చేశారు. ఇదే సమయంలో బెంగళూరులో నీటి కొరతను తీర్చేందుకు వీలుగా 4.2 టిఎంసిల నీటిని కేటాయించారు. ఇప్పటి తీర్పు వచ్చే 15 సంవత్సరాల వరకూ అమలులో ఉంటుందని న్యాయస్థానం తెలిపింది.

తీర్పు నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు

కీలక తీర్పు వెలువరించే నేపథ్యంలో కర్ణాటక, తమిళనాడులలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. బెంగళూరులో అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు అయింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఆధ్వర్యంలో త్రిసభ్య ధర్మాసనం ఏకగ్రీవ తీర్పును వెలువరించింది.

బాధాకరం :కమల్ హాసన్

కావేరీ నదీ జలాలపై సర్వోన్నత న్యాయస్థానం తీర్పు తనకు దిగ్భ్రాంతిని కల్గించిందని నటుడు కమల్ హాసన్ వ్యాఖ్యానించారు. తీర్పు తనకు షాక్ కల్గించిందని చెన్నైలో కమల్ పేర్కొన్నారు. అయితే తీర్పు పూర్తి పాఠం చూడాల్సి ఉందన్నారు. అయితే నీరు ఏ రాష్ట్రం సొంతం కాదని, ఏ రాష్ట్రానికి సంపూర్ణాధికారం లేదని చెప్పడం బాధాకరం అని కమల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక తీర్పుపై తమిళనాడులో రాజకీయ పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి. తమిళనాడు ప్రభుత్వం రాజకీయ లాభాల కోసం రాష్ట్రాన్ని నాశనం చేస్తోందని డిఎంకె ఆరోపించింది. ఇది తమకు నష్టం కల్గించే తీర్పు అని డిఎంకె సీనియర్ నేత దురయ్ మురుగన్ ఆవేదన వ్యక్తం చేశారు. అన్నాడిఎంకె వైఖరి వల్లనే ఈ విధమైన తీర్పు వచ్చిందని డిఎంకె కార్యదర్శి టికెఎస్ ఎలన్‌గోవన్ విమర్శించారు. తమిళనాడుకు జరిగిన అన్యాయంపై అన్ని విధాలుగా పోరాడుతామని తెలిపారు. రాష్ట్రంలో 24 లక్షల ఎకరాలకు పైగా పంటలు సాగులో ఉన్నాయని, వీటికి నష్టం కల్గించే విధంగా సుప్రీంకోర్టు తీర్పు ఉందని వ్యాఖ్యానించారు. ఇక తీర్పుపై ప్రముఖ నటి గౌతమి ట్విట్టర్‌లో స్పందించారు. కావేరీపై కర్ణాటకకు తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని తెలిపారు. కావేరీ యావత్ తమిళనాడుకు అన్నం పెడుతోందని , దీనిని విస్మరించి సుప్రీం తీర్పు ఇచ్చిందని, ఇది న్యాయం కాదని స్పందించారు. రైతులకు ఇబ్బంది కల్గించే తీర్పు అనుచితం అని, వ్యాపారం కన్నా వ్యవసాయం మిన్న అని స్పందించారు.

నీరవ్ స్కామ్‌పై రాహుల్ ట్వీట్
లమో...నీమో...నమో



న్యూఢిల్లీ : నీరవ్ మోడీ స్కాంలో ప్రధాని మోడీపై కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ట్విట్టర్ ద్వారా దాడిని తీవ్రతరం చేశారు. దేశాన్ని దోచుకుతిన్న మోడీ అంటూ నీరవ్ దేశం నుంచి పరారయిన వైనంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టారు. ఈ సందర్భంగా ఆయన లమో (లలిత్ మోడీ), నీమో (నీరవ్ మోడీ)లు నమో (నరేంద్ర మోడీ) తో కలుసుకుని దేశాన్ని దోచుకుని ఫరారు అవుతున్నారని వ్యాఖ్యానించారు. విదేశాలలో భేటీలు , దేశంలో లూటీలుగా వ్యవహారం సాగుతోందన్నారు. ప్రధాని మోడీతో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని ఆసరాగా చేసుకునే బిలియనీర్ జ్యువలర్ దేశం విడిచి వెళ్లగలిగాడని, బ్యాంకులను దోచుకున్నాడని రాహుల్ మండిపడ్డారు. 12 వేల కోట్ల రూపాయలను దోచుకుని వెళ్లారని, లిక్కర్ రారాజు విజయ్ మాల్యాలాగానే తుర్రుమన్నారని విమర్శించారు. ప్రధాని మోడీని కౌగిలించుకోవడం ద్వారా దేశాన్ని దోచేయవచ్చునని నీరవ్ నిరూపించారని, దావోస్‌లో ప్రధానితో నీరవ్ సన్నిహితంగా ఉన్న ఫుటేజే ఇందుకు నిదర్శనం అన్నారు. పెద్దలతో పరిచయాలను పలుకుబడిగా మార్చుకుని అందినంతగా దోచుకుని దేశం నుంచి ఉడాయించడం నీరవ్‌తో తేటతెల్లం అయిందన్నారు. రెండేళ్ల క్రితమే పిఎన్‌బి మోసం గురించి తెలిసినా ప్రభుత్వం పట్టించుకోలేదని, స్వతంత్ర భారతంలో జరిగిన అతి పెద్ద బ్యాంక్ మోసం ఆపేందుకు ఈ ప్రభుత్వం ఏమీ చేయలేదని, పైగా నేరస్థుడు తప్పించుకునేందుకు వీలు కల్పించారని రాహుల్ విమర్శించారు. 2016 జులైలోనే ప్రభుత్వానికి ఈ బ్యాంక్ మోసం గురించి తెలిసిందని చెప్పారు. ప్రభుత్వం నుంచి తగు సమాచారం నీరవ్‌కు అందిఉండటం వల్లనే ఆయన దేశం నుంచి పారిపోయి ఉంటారని రాహుల్ అనుమానం వ్యక్తం చేశారు.

టెన్షన్ వద్దు, ఏకాగ్రతే కీలకం

విద్యార్థులతో ప్రధాని ..పరీక్షా పే చర్చా

న్యూఢిల్లీ : తనను ప్రధానిగా భావించరాదని, స్నేహితుడిగా చూడాలని ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులతో వ్యాఖ్యానించారు. పది, పన్నెండుతరగతులకు బోర్డు పరీక్షల సందర్భంగా స్థానిక తల్కోతోరా స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన 'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో ప్రధాని విద్యార్థులతో ముచ్చటించారు. ఈ రోజు తాను విద్యార్థిని అని, విద్యార్థులు పరీక్షలు నిర్వహించేవారని తెలిపారు. పరీక్షల ఒత్తిడి నుంచి గట్టెక్కడానికి ఏకాగ్రత అవసరం అని, అంతకు మించి ఆత్మవిశ్వాసం అవసరం అని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు సంధించిన ప్రశ్నలు ప్రధాన మంత్రి కార్యాలయానికి అందాయి. పరీక్షల టెన్షన్ , తల్లిదండ్రుల నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లు మొదలుకుని యోగాతో ఏకాగ్రత , పోటీలో నెగ్గుకు రావడం ఎలా అనే పలు అంశాలపై వేలాది ప్రశ్నలు వచ్చాయి. వీటిలో కీలకమైన వాటికి ప్రధాని సమాధానాలు ఇచ్చారు. తనను స్నేహితుడిగా అనుకుని ప్రశ్నలు అడగవచ్చునని, తరువాత మార్కులు వేయాలని చమత్కరించారు. అన్ని రకాలుగా సిద్ధం అయినా , పరీక్షల సమయంలో చెప్పలేనంత భయాందోళనలకు గురి అవుతుంటామని విద్యార్థులు తెలిపారు. దీనిని అధిగమించడం ఎలా అని ప్రశ్నించారు. నిజాయితీతో పరీక్షలకు సిద్ధం కావాలని , ఆత్మవిశ్వాసం సన్నగిల్లితే తీరా పరీక్షలలో చదివింది కూడా మరిచిపోతామని ప్రధాని చెప్పారు. కఠోరశ్రమ, మనను మనం సవాలు చేసుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని సలహా ఇచ్చారు. ధ్యాస అంతా పరీక్షల మీదనే ఉంటే ఇక తిరుగు ఉండదని ప్రధాని సూచించారు. పరీక్షలప్పుడు భయాన్ని తొలిగించుకోవాలని చెప్పారు. ఏకాగ్రత అనేది ప్రత్యేకంగా నేర్చుకుంటే వచ్చేది కాదని, ఏకాగ్రతకు ప్రత్యేక మార్గం యోగా అని దీనిని అంతా అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ప్రధాని మోడీ విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా పలు సూచనలు చేశారు. తనకు తమిళం రాదని, అదే విధంగా ఇతర కొన్ని భాషలు కూడా రావని అయితే తన సమాధానాలు అన్ని భాషల వారికి సరైన విధంగా చేరుతాయని ప్రధాని చెప్పారు.



లోక్‌సభ పరీక్షలకు సిద్ధమా అంటూ ప్రధానికి విద్యార్థి ప్రశ్న

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ శుక్రవారం విద్యార్థులతో పరీక్షాపే చర్చ కార్యక్రమం నిర్వహిస్తుండగా ఓ విద్యార్థి నుంచి కీలకమైన ప్రశ్నను ఎదుర్కొన్నారు. విద్యార్థుల పరీక్షల గురించి , ఒత్తిళ్ల గురించి చెపుతున్నారు కానీ వచ్చే లోక్‌సభ ఎన్నికలను ఏ విధంగా ఎదుర్కొంటారని ఒక విద్యార్థి కీలక ప్రశ్న వేశారు. దీనికి కంగుతిన్న ప్రధాని వెంటనే సమాధానం ఇవ్వలేదు. అయితే తరువాత తేరుకుని తానే ఉపాధ్యాయుడిని అయి ఉంటే ఈ విద్యార్థిని జర్నలిజం వైపు వెళ్లాలని సూచిస్తానని , ఎందుకంటే జర్నలిస్టులే సాధారణంగా ఈ విధమైన ప్రశ్నలు వేస్తుంటారని ప్రధాని తెలిపారు. నిజానికి ఇలాంటివి చాలా మెలిక ఉండే ప్రశ్నలే . వీటిని మెళకువగా ఉంటేనే జవాబులు చెప్పవచ్చు. ఏది ఏమైనా ఎన్నికలకు పరీక్షలకు లింక్ పెడుతూ వచ్చిన ప్రశ్న కీలకమైనదే అనే అభిప్రాయం ప్రధాని మాటలలో వ్యక్తం అయింది. అయితే అప్పటివరకూ విద్యార్థులకు వారి ప్రశ్నల మేరకు నేరుగా సమాధానం ఇస్తూ వచ్చిన ప్రధాని దీనికి నేరుగా సమాధానం ఇవ్వలేకపొయ్యారు.

కోర్టును ధిక్కరించారు
విద్యార్థులపై జెఎన్‌యు ఫిర్యాదు

న్యూఢిల్లీ: యూనివర్సిటీ ఆడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌కు100 మీటర్ల లోపల ఆందోళనలు జరపొద్దన్న కోర్టు ఆదేశాలను విద్యార్థులు ఉల్లంఘించారని ఢిల్లీ హైకోర్టుకు జెఎన్‌యు ఫిర్యాదు చేసింది. కోర్టు ధిక్కారానికి పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని అభ్యర్థించింది. ఈ కేసును హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్, జస్టిస్ సి హరి శంకర్‌లతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. నిర్బంధ హాజరుపై వైస్ చాన్సలర్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యార్థులు ఆడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌ను దిగ్బంధించారని, అధికారులు కార్యాలయం నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారని వర్సిటీ పేర్కొంది. గత ఏడాది ఆగస్టు 9న ఆడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌కు 100 మీటర్ల లోపల విద్యార్థులు ఆందోళన చేయకూడదని హైకోర్టు ఆదేశించింది. దీంతో సబర్మతి హాస్టల్ మైదానంలో విద్యార్థులు ఆందోళనలు నిర్వహించేందుకు వర్సిటీ అధికారులు అనుమతించారు.

ప్రచారం లేకున్నా పుతిన్ విజయం తథ్యం?

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఎన్నికల ప్రచారం జరుగుతున్నట్లే లేదు. ఆయన ప్రచార నినాదాల్లో పస కొరవడింది. ప్రత్యర్థులతో ముఖాముఖి చర్చకు ఆయన విముఖంగా ఉన్నారు. అయినప్పటికీ 65 ఏళ్ల పుతిన్ ఈ ఎన్నికల్లో విజయం దిశగా దూసుకుపోతున్నారు. వచ్చే నెల జరగనున్న ఎ న్నికలో పుతిన్ నాలుగవ సారి ఆ పదవికి ఎన్నికయితే సోవియట్ యుగం మళ్లీ ఆవిష్కృతమవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరో వింత ఏమిటంటే స్పష్టమైన కార్యక్రమం ఏదీ ఈ ఎన్నికల కోసం పుతిన్ అమలుపర్చడం లేదు. కార్యక్రమంలేని అభ్యర్థి ఆయన ఒక్కడే కావడంతో అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఇది తన ప్రజలపట్ల వైముఖ్యాన్ని ప్రదర్శించడమే అని కార్నెగీ మాస్కో సెంటర్‌కు చెందిన ఆండ్రీ కోలెస్నికోవ్ అన్నారు. అధ్యక్ష అభ్యర్థిగా టివిలో ఉచిత ప్రచారానికి గల వ్యవధిని కూడా పుతిన్ వాడుకోవడం లేదు. అయితే గోడలపై ప్రచారం ద్వారా ఆయన తుదకు విజయం దిశగా పయనిస్తున్నారని చానల్ వన్ అనే ప్రభుత్వ టివి ప్రకటించింది. ఆయనపై నాలుగు భాగాల డాక్యుమెంటరీని ఆ చానల్ తిరిగి ప్రసారం చేస్తోంది. అది ఆలివర్ స్టోన్ రూపొందించిన చిత్రం. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ ముగిసిన తర్వాతే నాలుగో భాగం ప్రసారం అవుతుంది. హైవే వెంబడి బిల్ బోర్డ్‌పై పుతిన్ చిత్రాలు పెద్దగా చూపడం ఒక్కటే ఆయన తరఫున సాగుతున్న పెద్ద ప్రచారం.

ట్రావెల్ బ్యాన్‌పై కోర్టులో మళ్లీ చుక్కెదురు
రాజ్యాంగ విరుద్ధమన్న నాలుగవ సర్క్యూట్ న్యాయ స్థానం

వాషింగ్టన్: ఆరు ముస్లిం దేశాలపై తాజాగా ట్రంప్ ప్రభుత్వం విధించిన ట్రావెల్ బ్యాన్‌ను ఫెడరల్ అపీల్స్ కోర్టు ఒకటి గురువారం నాడు కొట్టివేసింది. అది ఒక మతానికి చెందిన వారిపై గురిపెట్టినది కనుక రాజ్యాంగ వ్యతిరేకమని కోర్టు తీర్పు చెప్పింది. రిచ్‌మండ్‌లోని అమెరికా సర్క్యూట్ కోర్ట్ ఆఫ్ అపీల్స్ ట్రంప్, ఇతర పాలనా అధికార్ల వాంగ్మూలాలను విని ఈ నిర్ణయం ప్రకటించింది. నిషేధం ఉత్తర్వును కూడా క్షుణ్ణంగా పరిశీలించింది. అనంతరం ట్రావెల్ బాన్ రాజ్యాంగ విరుద్ధమని, కారణం లేకుండా ఇస్లామ్‌పట్ల శత్రు భావాన్ని ప్రకటిస్తున్న ఉత్తర్వు అదని పేర్కొంది. మేరీలాండ్ ఫెడరల్ జడ్జి ఈ ట్రావెల్ బాన్‌పై తాత్కాలిక నిలిపివేత ప్రకటించడాన్ని రిచ్‌మండ్ కోర్టు సమర్థించింది. ఏప్రిల్‌లో ట్రావెల్ బాన్‌పై విచారణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. గత డిసెంబర్‌లో హైకోర్టు ట్రావెల్ బాన్ సంపూర్ణ అమలుకు షరతులతో అనుమతి ప్రకటించింది. కోర్టుల ద్వారా అపీల్స్ దాఖలు చేయవచ్చునని హైకోర్టు ప్రకటించింది. నాలుగవ సర్క్యూట్ కోర్టు తన తీర్పులో ఈ బాన్‌ను విమర్శిస్తూ కఠినమైన పదజాలాన్ని వినియోగించింది. వేలాది అమెరికన్ కుటుంబాలపై విరుద్ధ ప్రభావం ట్రావెల్ బాన్ చూపుతుందని పేర్కొంది. జాతీయ భద్రతకు ట్రావెట్ బాన్ అవసరమని ట్రంప్ సమర్థింపు ప్రకటన చేశారు. ఈ ఉత్తర్వును 4వ సర్క్యూట్ కోర్టు తిరస్కరించడం ఇది రెండవసారి.

కలిసికట్టుగా పర్యావరణ పరిరక్షణ

స్థిర అభివృద్ధి సదస్సులో ప్రధాని మోడీ పిలుపు ...

న్యూఢిల్లీ : పర్యావరణ పరిరక్షణకు భారతదేశం కట్టుబడి ఉందని, ఇదే సమయంలో ఇతర దేశాలు కూడా కట్టుబాట్లను గౌరవించాల్సి ఉందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ప్రపంచ స్థిర అభివృద్ధి సదస్సును ఉద్దేశించి శుక్రవారం ప్రధాని ఇక్కడ మాట్లాడారు. పర్యావరణ హితంగా భారతదేశం వ్యవహరిస్తుందని, అంతర్జాతీయంగా దీనిపై అంతా కట్టుబడి ఉండాలని పిలుపు నిచ్చారు. పారిస్‌లో జరిగిన వాతావరణ పరిరక్షణ సదస్సులో అన్ని దేశాలూ తీసుకున్న నిర్ణయాలను, 2015 సిఒపి 21 సమ్మిట్‌లో ఈ దిశలో కీలక నిర్ణయాలు తీసుకున్నారని ప్రధాని గుర్తు చేశారు. దీనిని అన్ని దేశాలూ గుర్తించి తగు విధంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. సముచిత మార్పుల దిశలో ప్రపంచ దేశాలు తీసుకున్న నిర్ణయాలపై చర్చ జరుగుతోందని అన్నారు. ప్రపంచం అంతా ఈ దిశలో అసంబద్ధ వాస్తవికతతో వ్యవహరిస్తున్నాయని,అయితే భారతదేశం ఒక్కటే నిబద్ధతతో దీనిని సముచిత కార్యాచరణ దిశకు మలిచిందని తెలిపారు. ప్రగతి పట్ల భారతదేశానికి నమ్మకం ఉందని, అయితే ఇదే సమయంలో పర్యావరణ పరిరక్షణ చర్యలూ తీసుకుంటుందని తెలిపారు. ఐరాస తలపెట్టిన స్థిర అభివృద్ధి లక్ష్యాలు భారత్‌కు సమానత, సమీకృత, పర్యావరణ న్యాయం దారులను ఖరారు చేశాయని ప్రధాని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు అవసరం అయిన అన్ని చర్యలనూ భారత దేశం తీసుకుంటుందని, కానీ ఇతర దేశాలపై కూడా ఈ దిశలో బాధ్యత ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏ దేశం పేరు ప్రస్తావించకుండా అంతా ఉమ్మడి, వైవిధ్య బాధ్యత, సమానతల దృక్పథానికి కట్టుబడి ఉండాలని కోరారు. 2030 లక్ష్యిత జాతీయ నిశ్చిత ప్రాతిపదిక (ఐఎన్‌డిసి) దిశ వైపు దేశం వెళ్లుతోందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ నేషనల్ జియోగ్రాఫిక్ గ్రీన్ డెక్స్ రిపోర్టు 2014ను ప్రస్తావించారు. ఈ నివేదిక సూచీలో ఇండియా ర్యాంక్ హరిత భరితం దిశలో అత్యున్నత స్థాయిలో ఉందన్నారు. ప్రకృతికి సంబంధించిన వనరులన్నీ కూడా భగవంతునికి చెందినవని, వాటికి మనం ధర్మకర్తలమని మహాత్మా గాంధీ చెప్పారని ప్రధాని గుర్తు చేశారు. భూగోళాన్ని మరింత సురక్షితం చేయాల్సి ఉందని పేర్కొన్నారు. భారతదేశ ఘనమైన, సుదీర్ఘ చరిత్ర అందరికీ గర్వకారణం అని, మనిషికి, ప్రకృతికి మధ్య సామరస్య వాతావరణం నెలకొని ఉండాలని ఇదే భారతీయ విలువల పరమార్థం అన్నారు. జల వనరుల గురించి ప్రస్తావిస్తూ, జలం అందుబాటులో లేకపోతే కష్టం అని, జల లభ్యతకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, ఏ వ్యవసాయ క్షేత్రం కూడా నీరు లేకుండా ఎండిపోరాదని , ఈ లక్ష్యంతోనే తమ ప్రభుత్వం చర్యలూ తీసుకుంటుందని తెలిపారు. అన్ని గ్రామాల విద్యుద్దీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు, పట్టణీకరణ , రవాణా అవసరాలు పెరుగుతూ ఉండటంతో మెట్రో వ్యవస్థలను పెంచుతున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సులో పలువురు నిపుణులు పర్యావరణ పరిరక్షణపై ప్రసంగించనున్నారు. భూ ఉపరితలంపై ప్రభావం తగ్గేలా చేయడం, జలం, వాయు వనరుల పరిరక్షణకు తగు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇంధనం, ఇతర కీలక వనరులను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా భూగోళానికి మరింతగా రక్షణ ఏర్పడే చర్యల గురించి కూడా సదస్సులో విశ్లేషించనున్నారు



కెప్టెన్సీలో విరాట్ రాటుదేలాడు: సెహ్వాగ్

న్యూఢిల్లీ: కెప్టెన్‌గా విరాట్ కోహ్లి ఎంతో రాటు దేలాడని భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ప్రశంసించాడు. గతంలో భారత్ ఒక్క గంగూలీ సారథ్యంలో మాత్రమే విదేశాల్లో విజయాలు సాధించిందని, కోహ్లి కూడా అతని బాటలో నడవడం ఎంతో ఆనందానికి గురి చేస్తుందన్నాడు. కోహ్లి ఆటగాడిగా, కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపిస్తున్న తీరు తనను ఎంతో ఆకట్టుకుంటుందన్నాడు. యువ ఆటగాళ్లను వెన్ను తట్టి ప్రోత్సహించడంలో కోహ్లి ఎంతో ముందు వరుసలో నిలుస్తాడన్నాడు. గతంలో గంగూలీ కూడా యువ ఆటగాళ్లలోని ప్రతిభను వెలికి తీయడంలో సఫలమయిన విషయాన్ని సెహ్వాగ్ గుర్తు చేశాడు. అతని బాటలోనే కోహ్లి నడుస్తుండడం జట్టుకు శుభ సూచకమన్నాడు. కాగా, దక్షిణాఫ్రికా సిరీస్‌లో భారత ప్రదర్శన తనను ఎంతో ఆనంద పరిచిందన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సౌతాఫ్రికాపై చెలాయిస్తున్న ఆధిపత్యాన్ని చూస్తే ఎంతో గర్వంగా ఉందన్నాడు. గతంలో సౌతాఫ్రికా సిరీస్‌లు అంటే ముందుగానే ఓటమి ఖాయమయ్యేదన్నాడు. అయితే ఈసారి పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయన్నాడు. కోహ్లి సేన అంచనాలకు మించి రాణిస్తూ దక్షిణాఫ్రికాను కట్టడి చేయడం గొప్ప విషయమని సెహ్వాగ్ పేర్కొన్నాడు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రదర్శన కొనసాగిస్తుందనే నమ్మకాన్ని సెహ్వాగ్ వ్యక్తం చేశాడు.

అఫ్ఘానిస్థాన్‌కు సిరీస్



షార్జా: జింబాబ్వేతో జరుగుతున్న వన్డే సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలవుండగానే అఫ్ఘానిస్థాన్ 3–1తో కైవసం చేసుకుంది. శుక్రవారం జరిగిన నాలుగో వన్డేలో అఫ్ఘాన్ పది వికెట్ల తేడాతో జింబాబ్వను చిత్తు చేసి సిరీస్‌ను దక్కించుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన జింబాబ్వే ప్రత్యర్థి బౌలర్ల ధాటికి తట్టుకోలేక కేవలం 134 పరుగులకే కుప్పకూలింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ 21.1 ఓవర్లలోనే కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్లు మహ్మద షాజాద్, ఇన్సానుల్లా జనత్ అజేయ అర్ధ సెంచరీలతో జట్టును గెలిపించారు. సునాయాస లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్‌కు ఓపెనర్లు షాజాదవ్, ఇన్సానుల్లా అండగా నిలిచారు. ఇద్దరు ధాటిగా ఆడుతూ జింబాబ్వే బౌలర్లను హడలెత్తించారు. షాజాద్ తన మార్క్ షాట్లతో చెలరేగిపోయాడు. దూకుడుగా ఆడిన షాజాద్ 74 బంతుల్లో పది ఫోర్లు, మరో మూడు సిక్సర్లతో 75 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరోవైపు ఇన్సానుల్లా రెండు సిక్స్‌లు, మరో ఆరు ఫోర్లతో 51 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వేను అఫ్ఘాన్ బౌలర్లు తక్కువ స్కోరుకే పరిమితం చేశాడు. ముజీబ్ జర్దాన్ ఐదు వికెట్లు తీసి ప్రత్యర్థి ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చాడు. మహ్మద్ నబి, రషేద్ ఖాన్ రెండేసి వికెట్లతో తమవంతు పాత్ర పోషించారు.

మహిళా జట్టుకు రెండో గెలుపు

- సఫారీలతో రెండో టి20 మ్యాచ్

ఈస్ట్ లండన్: దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో ట్వంటీ–20లో భారత మహిళా జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–0 ఆధిక్యాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ మరో ఐదు బంతులు మిగిలివుండగానే కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్లు స్మృతి మందన, మిథాలీ రాజ్‌లు అద్భుత బ్యాటింగ్‌తో జట్టును గెలిపించారు. ప్రారంభం నుంచే వీరిద్దరూ దూకుడైన ఆటతో ప్రత్యర్థి బౌలర్లను హడలెత్తించారు. ఈ జోడీని విడగొట్టేందుకు సఫారీ బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చూడచక్కని ఆటతో మిథాలీ, మందన ముందుకు సాగారు. ఇద్దరు పోటీ పడి భారీ షాట్లు కొట్టడంతో స్కోరు వేగంగా పరిగెత్తింది. వీరిని ఔట్ చేసేందుకు ప్రత్యర్థి కెప్టెన్ తరచు బౌలర్లను మార్చినా ఫలితం లేకుండా పోయింది. దూకుడుగా ఆడిన మందన 42 బంతుల్లో 4ఫోర్లు, మరో మూడు సిక్సర్లతో 57 పరుగులు చేసి పెవిలియన్ చేరింది. ఈ క్రమంలో తొలి వికెట్‌కు 106 పరుగులు జోడించింది. మరో



వైపు మిథాలీ చివరి వరకు అజేయంగా నిలిచింది. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన మిథాలీ 61 బంతుల్లో 8ఫోర్లతో 76 పరుగులు సాధించి నాటౌట్‌గా ఉంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 7 (నాటౌట్)తో కలిసి మరో వికెట్ నష్టపోకుండా జట్టును విజయ తీరానికి చేర్చింది.



సత్తా చాటిన బౌలర్లు...

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికాను భారత బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. శిఖా పాండే, పూనమ్ యాదవ్, పూజా, రాధాలు పొదుపుగా బౌలింగ్ చేస్తూ ప్రత్యర్థి క్రికెటర్లను కట్టడి చేశారు. సౌతాఫ్రికా జట్టులో సూనె లూస్ ఒక్కటే పోరాటం చేసింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన లూస్ 33 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. మిగతా వారు విఫలం కావడంతో జట్టు స్కోరు 142 పరుగులకే పరిమితమైంది. భారత బౌలర్లలో పూనమ్ యాదవ్, అనుజా పాటిల్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

ఆస్ట్రేలియా రికార్డు విజయం



అక్లాండ్: స్వదేశంలో జరుగుతున్న ముక్కోణపు ట్వంటీ–20 సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు వరుస విజయ పరంపర కొనసాగుతూనే ఉంది. శుక్రవారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ క్రమంలో ఆస్ట్రేలియా 244 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి కొత్త ప్రపంచ రికార్డును నెలకొంది. ఈ సందర్భంగా గతంలో విండీస్ పేరిట ఉన్న 231 పరుగుల రికార్డు ఛేదనను ఆస్ట్రేలియా తిరగరాసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. ఓపెనర్లు మార్టిన్ గుప్టిల్ (108), కొలిన్ మున్రో (76) అద్భుత బ్యాటింగ్‌తో కివీస్‌కు భారీ స్కోరును అందించారు. విధ్వంసక ఇన్నింగ్స్‌ను ఆడిన మున్రో 33 బంతుల్లోనే ఆరు భారీ సిక్సర్లు, మరో అర డజను ఫోర్లతో 76 పరుగులు చేశాడు. ఈ క్రమంలో గుప్టిల్‌తో కలిసి తొలి వికెట్‌కు 132 పరుగులు జోడించాడు. మరోవైపు గుప్టిల్ కూడా విధ్వంసక బ్యాటింగ్‌తో తనవంతు పాత్ర పోషించాడు. ఆస్ట్రేలియా బౌలర్లను హడలెత్తించిన గుప్టిల్ ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించాడు. ఈ క్రమంలో 54 బంతుల్లోనే 9 భారీ సిక్స్‌లు, మరో ఆరు ఫోర్లతో 105 పరుగులు సాధించాడు. ఈ సందర్భంగా 45 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేసిన కివీస్ తరపున అత్యంత వేగంగా సెంచరీ సాధించిన బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. గతంలో మెకొల్లమ్ పేరిట ఉన్న రికార్డును గుప్టిల్ బద్దలు కొట్టాడు. అంతేగాక ట్వంటీ–20 ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు సాధించిన క్రికెటర్‌గా కూడా నిలిచాడు. ఇందులో కూడా మెకొల్లమ్ రికార్డునే గుప్టిల్ బద్దలు కొట్టడం విశేషం. గుప్టిల్ 2,188 పరుగులతో అగ్రస్థానంలో నిలిచాడు. మెకొల్లమ్ 2,140 పరుగులతో రెండో, భారత కెప్టెన్ విరాట్ కోహ్లి 1,956 పరుగులతో మూడో స్థానంలో నిలిచారు.

వార్నర్, షార్ట్ మెరుపులు...

తర్వాత భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియాకు ఓపెనర్లు డేవిడ్ వార్నర్, అరయ్ షార్ట్ కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చారు. ఇద్దరు అద్భుత షాట్లతో కివీస్ బౌలర్లను ఉతికి ఆరేశారు. విధ్వంసక ఇన్నింగ్స్‌ను ఆడిన వార్నర్ ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించాడు. షార్ట్ కూడా దూకుడుగా ఆడడంతో స్కోరు వేగంగా పరిగెత్తింది. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన వార్నర్ 24 బంతుల్లోనే 4ఫోర్లు, ఐదు భారీ సిక్సర్లతో 59 పరుగులు చేశాడు. ఈ క్రమంలో తొలి వికెట్‌కు 8.3 ఓవర్లలోనే 121 పరుగులు జోడించాడు. మరోవైపు ధాటిగా ఆడిన షార్ట్ 44 బంతుల్లో 8 బౌండరీలు, మరో మూడు సిక్సర్లతో 76 పరుగులు చేశాడు. మాక్స్‌వెల్ (31; 14 బంతుల్లో 3x4, 2x6), అరోన్ ఫించ్ (36 నాటౌట్; 14 బంతుల్లో 3x4, 2x3)లతో చెలరేగడంతో ఆస్ట్రేలియా మరో ఏడు బంతులు మిగిలివుండగానే కేవలం ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.



మలిష్కాకు అభినందనలు



మన తెలంగాణ/ హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్‌లో నిలకడైన ఆటతో ప్రకంపనలు సృష్టిస్తున్న మలిష్కాను రాష్ట్ర క్రీడల మంత్రి టి.పద్మారావు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి అభినందించారు. మలిష్కా తన తల్లిదండ్రులతో కలిసి మంత్రి పద్మారావు, శాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డిని కలుసుకుంది. ఇటీవల పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మలిష్కా పాల్గొంటుంది. అపార ప్రతిభావంతులైన మలిష్కాను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వం పరంగా మలిష్కాకు ఆర్థిక సహాయం దక్కెలా తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. మరో చైర్మన్ కూడా సహకరించేందుకు ముందుకు వచ్చారు. ఇదిలావుండగా టెన్నిస్‌లో ప్రతిభ చాటుతున్న తమ చిన్నారికి ఆర్థికంగా చేయూత అందించి ఆదుకోవాలని మలిష్కా తల్లిదండ్రులు మంత్రికి, శాట్స్ చైర్మన్‌కు లేఖను అందజేశారు. దీనికి వీరిద్దరూ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే మలిష్కాకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిభావంతులైన క్రీడాకారులకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. దీని కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. క్రీడాకారులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మేటి ఆటగాళ్లుగా ఎదగాలని సూచించారు.

చివరి మ్యాచ్‌లోనూ టీమిండియా గెలుపు

- చెలరేగిన బౌలర్లు, • కదంతొక్కిన కోహ్లి • మళ్లీ చిత్తయిన సఫారీలు • 5–1తో సిరీస్ భారత్ వశం



సెంచూరియన్: కెప్టెన్ విరాట్ కోహ్లి 129 (నాటౌట్) అజేయ శతకంతో కదం తొక్కడంతో శుక్రవారం ఇక్కడ సౌతాఫ్రికాతో జరిగిన చివరి వన్డేలో భారత్ 8వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో ఆరు మ్యాచ్‌ల సిరీస్ 5–1తో గెలిచి చరిత్ర సృష్టించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 46.5 ఓవర్లలో కేవలం 204 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 32.1 ఓవర్లలోనే కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. విరాట్ కోహ్లి కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో భారత్‌ను గెలిపించాడు. ఊరిస్తున్న లక్ష్యంతోబ్యాటింగ్‌కు ప్రారంభంలోనే ఎదురు దెబ్బ తగిలింది. కిందటి మ్యాచ్‌లో సెంచరీ సాధించిన రోహిత్ శర్మ ఈసారి (15) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కోహ్లి జట్టును గెలిపించే బాధ్యతను తనపై వేసుకున్నాడు. శిఖర్ ధావన్ అండతో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచాడు. సమన్వయంతో బ్యాటింగ్ చేసిన ధావన్ రెండు ఫోర్లతో 18 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ క్రమంలో 61 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యంలో పాలుపంచుకున్నాడు. తర్వాత వచ్చిన అజింక్య రహానె 34 (నాటౌట్) అండతో మరో వికెట్ కోల్పోకుండానే కోహ్లి భారత్‌ను గెలిపించాడు. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన కోహ్లి 96 బంతుల్లోనే 19 ఫోర్లు, మరో రెండు సిక్స్‌లతో 129 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు ఈ క్రమంలో తన ఖాతాలో 35వ వన్డే సెంచరీని జమచేశాడు. ఈ వన్డే సిరీస్‌లో కోహ్లికి



ఇది మూడో సెంచరీ కావడం విశేషం. ఈ సందర్భంగా కోహ్లి ఎన్నో రికార్డులను బద్దలు కొట్టాడు. కాగా, ఆదివారం జరిగే తొలి టి–20 మ్యాచ్‌లో భారత్ ఆతిథ్య సౌతాఫ్రికాతో తలపడుతుంది.

ప్రారంభంలోనే..

టాస్ ఓడి బ్యాటింగ్ చేపట్టిన దక్షిణాఫ్రికాకు ప్రారంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. భారత బౌలర్లు శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రిత్ బుమ్రాలు కచ్చితమైన లైన్ అండ్ లెన్త్‌తో బౌలింగ్ చేస్తూ సౌతాఫ్రికా ఓపెనర్లను కట్టడి చేశారు. మరోవైపు కిందటి మ్యాచ్‌లో అర్ధ సెంచరీతో రాణించిన ఓపెనర్ హాషిం ఆమ్లా ఈ మ్యాచ్‌లో ఆశించిన స్థాయిలో ఆడలేదు. రెండు ఫోర్లతో పది పరుగులు చేసి శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో వికెట్ల వెనుకాల దొరికి పోయాడు. అప్పటికి జట్టు స్కోరు 25 పరుగులు మాత్రమే. కొద్ది సేపటికే కెప్టెన్ మార్‌క్రామ్ కూడా పెవిలియన్ చేరాడు. మూడు ఫోర్లు, ఒక సిక్స్‌తో 24 పరుగులు చేసిన మార్‌క్రామ్‌ను కూడా శార్దూల్ వెనక్కి పంపాడు. దీంతో సౌతాఫ్రికా 43 పరుగులకే ఓపెనర్ల వికెట్లను కోల్పోయింది. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను సీనియర్ ఆటగాడు ఎబి.డివిలియర్స్ తనపై వేసుకున్నాడు. అతనికి యువ ఆటగాడు ఖయా జొండో అండగా నిలిచాడు. ఇద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే అడపాదడపా ఫోర్లతో స్కోరును ముందుకు నడిపించారు. ఇద్దరు మూడో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యాన్ని సైతం నమోదు చేశారు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని చాహల్ విడగొట్టాడు. 4 ఫోర్లతో వేగంగా 30 పరుగులు చేసి కుదురుకున్నట్టు కనిపించిన డివిలియర్స్‌ను చాహల్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. దీంతో సౌతాఫ్రికా కోలుకోలేని స్థితికి చేరింది. మరోవైపు వికెట్ కీపర్ క్లాసెన్ కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. 3 ఫోర్లతో 22 పరుగులు చేసి బుమ్రా బౌలింగ్‌లో వెనుదిరిగాడు. తర్వాత సౌతాఫ్రికా వరుస క్రమంలో వికెట్లను కోల్పోయింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన జొండో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లత 54 పరుగులు చేసి చాహల్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. చివరల్లో ఫెలుక్‌వాయో రెండు సిక్స్‌లు, మరో రెండు ఫోర్లతో 34, మోర్నె మోర్కెల్ రెండు సిక్సర్లతో 20 పరుగులు చేయడంతో సౌతాఫ్రికా స్కోరు 204కు చేరింది. భారత బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ నాలుగు వికెట్లు తీశాడు. చాహల్, బుమ్రాలకు రెండేసి వికెట్లు లభించాయి.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.